www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

జగన్నాథ రథయాత్రలో విషాదం

- గుండిచా ఆలయం వద్ద తొక్కిసలాట
- ముగ్గురి మృతి, 50 మందికి గాయాలు
- ఆరుగురి పరిస్థితి విషమం: కలెక్టర్
- భక్తులకు క్షమాపణలు చెప్పిన ఒడిసా సీఎం
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు

2



పూరీలోని ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

సోమవారం | 30-6-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 75 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్ల పక్షం తిథి: పంచమి ఉ.9:24 తదుపరి షష్ఠి, నక్షత్రం: మఖ ఉ.7:21 తదుపరి పుబ్బ, వర్జ్యం: మ.3:52-5:34, దుర్ముహూర్తం: మ.12:44-1:37, మ.3:21-4:13, అమృతఘడియలు: రా.2:05-3:47, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 5:47, సూర్యాస్తమయం: 6:49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న పార్టీ నేతలు



టార్గెట్ 2029

ఇందుకోసం కఠినంగా ఉంటా: చంద్రబాబు

అవసరమైతే ఎవరినైనా వదులుకుంటా.. ప్రజా మద్దతు ఉన్నవారికే టికెట్లు

- 2024లో మొహమాటాలకు తావులేకుండా గెలుపే లక్ష్యంగా ఇచ్చాం
- వచ్చే ఎన్నికల్లోనూ ఇదే వ్యూహం
- ఎమ్మెల్యేలు సీరియస్‌గా లేకుంటే కష్టం
- పనితీరుపై సర్వేలు చేస్తున్నా.. విశ్లేషిస్తున్నా
- తప్పులుంటే ప్రతి ఒక్క ఎమ్మెల్యేకూ చెబుతా
- సరిదిద్దుకుంటే సరి.. లేకుంటే ఇక అంతే
- నిర్మొహమాటంగా నిర్ణయం తీసుకుంటా: సీఎం

అమరావతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'మన టార్గెట్ 2029.. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో నిర్మొహమాటంగా ఉంటా. కఠినంగా ఉంటా.. అవసరమైతే ఎవరినైనా వదులుకోవడానికి సిద్ధం.' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలకు స్పష్టమైన సందేశమిచ్చారు. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని, పనితీరు బాగోలేని వారికి గుడ్‌బై చెప్పేస్తానని తేల్చిచెప్పారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో

మిగతా 11వ పేజీలో...

7 గంటలు సాగిన విస్తృత భేటీ.. 56 మంది గైర్హాజరు

అందరం కదులుదాం.. ఇంటింటికీ వెళ్దాం: లోకేశ్

జనంలోకి వెళ్దాం

నామోషీ వదిలి 'తొలి అడుగు' వేయండి

- చేసిన మంచి చెప్పండి.. చేసింది చెప్పుకోలేకే గతంలో ఓడాం
- వివేకా హత్య విషయంలో దుష్ప్రచారాన్ని అడ్డుకోలేకపోయాం
- ఏ మాత్రం అప్రమత్తంగా ఉన్నా 2019లో ఓడిపోయేవాళ్లం కాదు
- ఈసారి అలాంటి పొరపాట్లు పునరావృతం కాకూడదు
- వైసీపీ అబద్ధాలను తిప్పికొట్టాలంటే ఇంటింటికీ వెళ్లాల్సిందే
- రాజకీయ ముసుగులో ఉండే క్రిమినల్స్‌తో జాగ్రత్త
- కుట్రలను జనాలకు వివరించాలి.. టీడీపీ భేటీలో సీఎం స్పష్టీకరణ

11

'పర్మిట్'తో ఆదాయం పెంచుదాం!

పర్మిట్ రూమ్‌లతో 200 కోట్లు రాబడి

- నగరాల్లో 7.5 లక్షలు, మిగిలినచోట్ల 5 లక్షలు
- పర్మిట్ రూమ్‌లకు ఫీజుల ప్రతిపాదన
- గతేడాది దరఖాస్తు ఫీజులతో భారీ ఆదాయం
- ఇప్పుడు పర్మిట్ రూమ్‌లు, బార్ పాలసీపై ఎక్సైజ్ దృష్టి
- సెప్టెంబరు నుంచి కొత్త బార్ పాలసీ



అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆదాయం పెంచుకోవడంపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించింది. గతేడాది కొత్త మద్యం షాపుల పాలసీ వల్ల భారీగా ఆదాయం వచ్చింది. దరఖాస్తు ఫీజుల రూపంలోనే రూ.1,906 కోట్లు వచ్చింది. ఇంత పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు ఊహించలేదు. దీని వల్ల 2024-25లో రూ.28,842 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తుల ఫీజులు ఉండవు. అందువల్ల ఆ రూ.1900 కోట్ల ఆదాయం రాబట్టుకోవడంపై ఎక్సైజ్ శాఖ దృష్టి పెట్టింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వడం ద్వారా దీన్ని భర్తీ చేసుకోవాలని భావిస్తోంది. సెప్టెంబరు నుంచి మద్యం షాపుల వద్ద పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలనే నిర్ణయానికి కొచ్చింది. గతంలో అన్ని షాపులకూ ఏడాదికి రూ.5 లక్షలు పర్మిట్ రూమ్ ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లలోని

మిగతా 12వ పేజీలో...

వడివడిగా క్వాంటమ్ బాట

జనవరి నుంచి క్వాంటమ్ వ్యాలీ కార్యకలాపాలు

- అమరావతిలో టెక్ వ్యాలీ పార్కులోనే లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- ఇతర రాష్ట్రాలూ సేవలు వినియోగించుకునే వెసులుబాటు
- అనేక రంగాల్లో విస్తృతంగా సేవలు.. నేడు సీఎం అధ్యక్షతన వర్క్‌షాప్

12



ఫుట్‌బాల్ ఆడేస్తున్న రోబోలు

చైనాలో ఏఐ ఆధారిత మరమనుషులతో ప్రత్యేక మ్యాచ్

2

కాంతిని గడ్డ కట్టించారు!



- ఘనపదార్థంలా కనపడుతూనే ద్రవలక్షణాలుండే సూపర్‌సాలిడ్‌లా మార్చిన ఇటలీ శాస్త్రజ్ఞులు
- క్వాంటమ్ కంప్యూటర్లు, ఆప్టికల్ ప్రాసెసర్ల అభివృద్ధికి, వేగవంతమైన సమాచార వ్యవస్థల్లో కీలకం

2

2

ఆన్‌లైన్‌లో ఆర్డరిస్తే..



ఇంటికే వచ్చేసింది!

అమెరికాలో ఫ్యాక్టరీ నుంచి నేరుగా యజమాని ఇంటికి సెల్ఫ్ డ్రైవింగ్‌తో వెళ్లిన టెస్లా కారు



8

షఫాలీ మృతికి కారణమిదేనా?

- కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్స
- ఖాళీ కడుపుతో ఔషధాలు, ఇంజెక్షన్లు
- వికటించి గుండెపోటు అంటూ వార్తలు

నాకు రాజకీయ అండదండలున్నాయ్



- నన్నేమీ చేయలేవు.. స్వేచ్ఛకు పూర్ణచందర్ బెదిరింపులు
- వారం క్రితమే ఇద్దరు కలిసి అరుణాచలానికి పయనం
- అక్కడ స్వేచ్ఛ పెళ్లి ప్రస్తావన తేగా ససేమిరా అన్న పూర్ణచందర్
- ఇద్దరి మధ్య వాగ్వాదం.. మనస్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డ స్వేచ్ఛ!

12

8 గంటల ముందే రైల్వే రిజర్వేషన్ చార్టు

ప్రస్తుతం ఉన్న 4 గంటల వ్యవధి పెంపు

2

యాప్‌ల్లో ఇచ్చే ఫోన్ నంబర్లకు సర్కారీ

ధ్రువీకరణ తప్పనిసరి

- అందుకోసం ప్రత్యేకంగా ఒక ప్లాట్‌ఫామ్
- ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం

క్రిటికల్ మినరల్స్‌లో స్వావలంబన

రక్షణ అవసరాలే లక్ష్యంగా మైనింగ్

- 2024-31 వరకు నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్
- ఐదేళ్లలో 16 వేల కోట్ల వ్యయం
- రూ.18 వేల కోట్ల పెట్టుబడులు
- దేశీయ, అంతర్జాతీయంగా కొత్త మైనింగ్ ప్రాజెక్టులు
- ప్రభుత్వ, ప్రైవేటుకు అవకాశాలు
- అన్ని రాష్ట్రాలకూ ప్రోత్సాహకాలు
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం



దేశీయ రక్షణ రంగానికి సంక్లిష్ట ఖనిజాల(క్రిటికల్ మినరల్) మైనింగ్ కీలకం. ఈ విషయంలో అంతర్జాతీయ దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాం. రక్షణ రంగ అవసరాలకు విదేశాలపై ఆధారపడే బదులు, స్వయంగా మైనింగ్ రంగంలో అభివృద్ధి చెందాలని కేంద్రం నిర్ణయించింది. కేవలం ఐదేళ్ల వ్యవధిలో దేశీయ అవసరాల్లో కనీసం 10 శాతం లక్ష్యాలను చేరుకునేలా మైనింగ్ రంగంలో కార్యచరణ ప్రకటించింది. అదే నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్. దీనిలో రాష్ట్రాలకూ కీలక పాత్ర పోషించే అవకాశం కల్పించింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సంక్లిష్ట ఖనిజాల(క్రిటికల్ మినరల్) మైనింగ్‌లో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశ రక్షణ అవసరాలకు ఈ ఖనిజాలను వినియోగించేందుకు వీలుగా నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఈ మిషన్ అమలు కానుంది. ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న యుద్ధ భయాలు, సరిహద్దు వివాదాలు, పెరుగుతున్న సాంకేతిక దాడులను

మిగతా 3వ పేజీలో...



వేగంగా మ్యుటేషన్లు!

- రోజుల తరబడి ఎదురుచూపులకు స్వస్తి
- ఆఫీసుల చుట్టూ తిరగకుండానే పని పూర్తి
- రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే ఆటోమేటిగ్గా వెబ్‌ల్యాండ్‌లో యాజమాన్య హక్కుల బదిలీ
- మున్సిపాలిటీల్లో కూడా ప్రవేశపెట్టే యోచన
- విజయవాడ కార్పొరేషన్‌లో ప్రయోగాత్మకంగా..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


రోజుల తరబడి ఎదురు చూపుల్లేవు.. కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనీ లేదు... ఆటోమ్యుటేషన్ విధానంతో రాష్ట్రంలో ప్రజల కష్టాలకు చెక్ పడింది. ఒకప్పుడు ఆస్తి బదలాయింపు ప్రక్రియ ఒక పెద్ద ప్రహసనంగా ఉండేది. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కోసం రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకోవడం, అది సవ్యంగా పూర్తవుతుందా.. కొర్రీలేమైనా పడతాయా అని కొనుగోలుదారులకు కునుకు పట్టేది కాదు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ రోజుల తరబడి

మిగతా 12వ పేజీలో...

ఎక్కడి క్లెయిమ్‌లు అక్కడే!

వైద్యసేవ ట్రస్ట్‌లో 2.60 లక్షలు పెండింగ్

- 2 నెలలుగా ప్రాసెస్ చేయని అధికారులు
- వీటి విలువ దాదాపు రూ.600 కోట్లు
- బిల్లులు రాక ఆస్పత్రులు విలవిల
- ఆకస్మిక తనిఖీల్లేవు.. జరిమానాలు లేవు
- ట్రస్ట్ ఉన్నతాధికారి నిర్వాకంతో అస్తవ్యస్తం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పాలన పూర్తిగా స్తంభించింది. ఎంప్యానెల్‌మెంట్లు నిలిచిపోయాయి. ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీల ఊసే లేదు. జరిమానాలు అసలే లేవు. లక్షలాది క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ట్రస్ట్ ఉన్నతాధికారి తాను పని చేయరు.. కిందస్థాయి అధికారులను పని చేయనివ్వరని ఆరోపణలొస్తున్నాయి. మరో నెల రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే ఆస్పత్రుల్లో పేదలకు వైద్య సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. వైద్యసేవ ట్రస్ట్ ద్వారా ఆస్పత్రుల్లో చికిత్స పొందిన రోగులకు సంబంధించిన బిల్లులు క్లెయిమ్‌ల రూపంలో వస్తాయి. వీటిని వెంటనే ప్రాసెస్ చేసి సీఎఫ్ఎంఎస్‌కు పంపించడమే ట్రస్ట్ ప్రధాన విధి. ప్రస్తుతం ట్రస్ట్ అధికారులు ఈ పని కూడా చేయడం లేదు. గత రెండు నెలలుగా ట్రస్ట్ నుంచి

మిగతా 3వ పేజీలో...

దేశమంతా విస్తరించిన రుతుపవనాలు

- హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరదలకు 17 మంది మృతి
- ఉత్తరాఖండ్‌కు రెడ్ అలర్ట్.. చార్‌ధామ్ యాత్ర నిలిపివేత
- జార్ఖండ్‌లో 162 మంది విద్యార్థులను కాపాడిన పోలీసులు
- బంగాళాఖాతంలో అల్పపీడనం

12



ఫుట్‌బాల్ ఆడేస్తున్న రోబోలు

చైనాలో ఏఐ ఆధారిత మరమనుషులతో ప్రత్యేక మ్యాచ్

బీజింగ్, జూన్ 29: ఇంతకాలం రోబోలు ఇంట్లో పనులు చేయడం లేదా రెస్టారెంట్లలో వంటకాలు సర్వ్ చేయడం చూశాం. కానీ కృత్రిమ మేధ సహాయంతో మరమనుషులు ఫుట్‌బాల్ ఆడితే?.. చైనా ఇదే చేసి చూపించింది! మనుషులే కాదు రోబోలు అదరగొట్టేలా ఫుట్ బాల్ ఆడగలవని నిరూపించారు చైనా పరిశోధకులు. ఇటీవల చైనా పురుషుల ఫుట్‌బాల్ జట్టు తన ఆటతీరుతో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయినా.. మనుషులను పోలిన ఈ రోబోలు మాత్రం వాటికున్న అడ్వాన్స్‌డ్ విజువల్ సెన్సార్ల సాయంతో బంతిని గుర్తించడంతో పాటు మైదానంలో తమ చురుకైన కదలికలతో అందర్నీ అలరించాయి. కింద పడినా మళ్లీ మనుషుల్లా పైకి లేవడం, మానవుల సాయం లేకుండా పూర్తి ఏఐ ఆధారిత సాంకేతికతతో ముందుకు కదలడం ఇలా ఒకటేమిటీ అన్ని రకాల ఫుట్‌బాల్ నైపుణ్యాల్ని ప్రదర్శించాయి. ఆటల్లో గాయపడిన రోబోలను స్ట్రెచర్ల సాయంతో సిబ్బంది బయటకు తీసుకెళ్లడం ఆటకు మరింత సహజత్వాన్ని ఇచ్చింది. త్వరలో జరిగే ప్రపంచ హ్యూమనాయిడ్ రోబోట్ పోటీలకు ప్రివ్యూగా శనివారం చైనా రాజధాని బీజింగ్‌లో ఈ పోటీలు జరిగాయి. బూస్టర్ రోబోటిక్స్ సంస్థ రూపొందించిన నాలుగు హ్యూమనాయిడ్ రోబోట్ జట్లు ఈ పోటీల్లో కనువిందు చేశాయి. భవిష్యత్తులో మనుషులు, రోబోలు కలిసి ఆడే పరిస్థితులు వస్తాయని బూస్టర్ రోబోటిక్స్ సీఈవో చెంగ్ హావో అన్నారు. ఫైనల్స్ మ్యాచ్‌లో త్సింగ్‌హువా యూనివర్సిటీ జట్టు, చైనా వ్యవసాయ యూనివర్సిటీ మౌంట్ సీ జట్టును ఓడించి విజేతగా నిలిచింది.



రోబోల ఫుట్‌బాల్ మ్యాచ్

రైలు బయలుదేరేందుకు 8 గంటల ముందే రిజర్వేషన్ చార్టు

న్యూఢిల్లీ, జూన్ 29: టిక్కెట్ల రిజర్వేషన్ విధానంలో మరో మార్పు చేసినట్టు ఆదివారం రైల్వే శాఖ ప్రకటించింది. ఇంతవరకు రైలు బయలుదేరడానికి కేవలం నాలుగు గంటల ముందు రిజర్వేషన్ ఛార్టును ఖరారు చేస్తుండగా, ఇక నుంచి ఎనిమిది గంటల ముందు ఛార్టును ప్రకటించనుంది. ఇది మంగళవారం నుంచి అమల్లోకి రానుంది. రైలు బయలుదేరడానికి కేవలం 4 గంటల ముందు రిజర్వేషన్ ఛార్టును ఖరారు చేస్తుండడంతో టిక్కెట్లు కన్ఫర్మ్ అవుతుందో లేదో తెలియక వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ప్రయాణాన్ని కొనసాగించాలో, ప్రత్యామ్నాయం చూసుకోవాలో నిర్ణయించుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై స్పష్టత ఇచ్చేందుకు రైలు బయలుదేరడానికి 8గంటల ముందు రిజర్వేషన్ల ఛార్టును తయారు చేయనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది.

ఆన్‌లైన్‌లో ఆర్డరిస్తే.. ఇంటికే వచ్చేసింది

ఆస్టిన్ (అమెరికా) ఆన్‌లైన్‌లో కారును ఆర్డర్ చేసుకున్న వినియోగదారుడికి ఆ కారు డ్రైవర్ లేకుండా స్వయంగా దానంతట అదే ఇంటికి వచ్చి చేరితే ఆశ్చర్యం కలగక మానదు కదా!. అమెరికాలో అచ్చం అలానే జరిగింది. ఆస్టిన్‌లో నివాసముండే వినియోగదారుడికి తాను బుక్ చేసుకున్న కారు ఫ్యాక్టరీ నుంచి ఎటువంటి మానవ ప్రమేయం లేకుండా తన ఇంటికి వచ్చి చేరింది. ఆటోమోటివ్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా తన నూతన 'మోడల్ వై' ఎస్‌యూవీతో ఈ చరిత్రాత్మక మైలురాయిని అందుకుంది. ఈ కారు జర్నీ వీడియోను టెస్లా 'ఎక్స్'లో పంచుకోగా ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. టెక్సాస్ గిగాఫ్యాక్టరీ నుంచి బయలుదేరిన కారు.. డ్రైవర్ లేకుండా రహదారులపై వంద కిలోమీటర్లకు పైగా వేగంతో ప్రయాణిస్తూ పరిస్థితులకు అనుగుణంగా వేగాన్ని నియంత్రించుకుంటూ ట్రాఫిక్ సిగ్నళ్లను, మలుపులను దాటుకుంటూ యజమాని ఇంటికి చేరుకుని పార్కింగ్ ప్రదేశంలోకి వెళ్లి నిలిచింది. ఈ మేరకు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ.. తన టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

యూజీసీ డిఫాల్టర్ జాబితాలో ఎన్ఐడీ ఏపీ

న్యూఢిల్లీ, జూన్ 29: ర్యాగింగ్‌ను అరికట్టేందుకు నిబంధనలు పాటించని 4 ఐఐటీలు, 3 ఐఐఎంలను యూజీసీ డిఫాల్టర్ జాబితాలో చేర్చారు. అధికారిక వర్గాల సమాచారం మేరకు.. ఈ జాబితాలో ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ బాంబే, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ పలక్కాడ్, ఐఐఎం బాంబే, ఐఐఎం రోహ్‌టక్, ఐఐఎం తిరుచిరాపల్లి ఉన్నాయి. అలాగే ఎయిమ్స్ రాయబరేలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్-ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, హర్యాణా కూడా ఉన్నాయి.

త్రిభాషా విధానంపై 'మహా' సర్కారు వెనుకడుగు!

ముంబై, జూన్ 29: మరాఠా, ఇంగ్లీష్ మాధ్యమ ప్రాథమిక పాఠశాలల్లో 'డీఫాల్ట్'గా హిందీ భాష నేర్చుకోవాలన్న నిర్ణయంపై నిరసన వెల్లువెత్తడంతో మహారాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చింది. ఈ విషయమై సవరిస్తూ గత ఏప్రిల్‌లో జారీ చేసిన త్రిభాషా విధానాన్ని ఉపసంహరిస్తున్నట్లు ఆదివారం తెలిపింది. తాజాగా విధాన రూపకల్పనకు డాక్టర్ నరేంద్ర జాదవ్ సారథ్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఫడణవీస్ అధ్యక్షతన జరిగిన మహారాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈ కమిటీ అన్ని వర్గాల వారితో సంప్రదిస్తుందని పేర్కొన్న ఫడణవీస్.. తమకు 'మరాఠీ' ముఖ్యమని తెలిపారు.

మొబైల్ యాప్‌ల్లో ఇచ్చే ఫోన్ నంబర్లకు సర్కారీ ధ్రువీకరణ తప్పనిసరి!

» అందుకోసం ప్రత్యేకంగా ఒక ప్లాట్‌ఫామ్: డీవోటీ ప్రతిపాదన

న్యూఢిల్లీ, జూన్ 29: ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు.. టెలీకమ్యూనికేషన్ విభాగం (డీవోటీ) కొత్త సైబర్ భద్రత నియమాలను ప్రతిపాదించింది. డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా వినియోగదారులు ఇచ్చే మొబైల్ నంబర్లు నిజంగా వారివేనా కాదా అనే విషయాన్ని యాప్‌లు, బ్యాంకులు ధ్రువీకరించుకునేందుకు.. ఒక ప్లాట్‌ఫామ్‌ను(నూతన ధ్రువీకరణ వ్యవస్థను) ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రచురించిన ముసాయిదాలో పేర్కొంది. కొత్త ప్రతిపాదన ప్రకారం యాప్‌లు, బ్యాంకులు సహా ఇతర డిజిటల్ వేదికలు ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటయ్యే వ్యవస్థ ద్వారానే వినియోగదారుల మొబైల్ నంబర్లను వెరిఫై(ఎంఎన్‌వీ) చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ సంస్థల యాప్‌లైతే ఈ ధ్రువీకరణను ఉచితంగా చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేసే ధ్రువీకరణకు ఒక్కో ఫోన్ నంబర్‌కు రూపాయిన్నర, ప్రైవేటు సంస్థలు తమ కోసం చేసుకునే ధ్రువీకరణ అయితే ఒక్కో నంబర్‌కూ రూ.3 చొప్పున చెల్లించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై కొందరు నిపుణులు వ్యతిరేకత వెలిబుచ్చుతున్నారు. ఇది అమల్లోకి వస్తే ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంఎన్‌వీ చార్జీల పేరిట వినియోగదారులపై అదనపు భారం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అమలు చేయాలంటే పౌరుల ఫోన్ నంబర్లతో కూడిన డేటాబేస్‌ను నిర్వహించాల్సి ఉంటుందని (డేటా సెంట్రలైజేషన్).. అంతేకాక, ఈ నిర్ణయం వ్యక్తిగత గోప్యతకు సంబంధించి జస్టిస్ పుట్టస్వామి కేసులో సుప్రీం కోర్టు పేర్కొన్న 'ప్రపోర్షనాలిటీ' (చిన్న ప్రయోజనాల కోసం పెద్ద హక్కులకు భంగం వాటిల్లడం) నిబంధనకు విఘాతం కలిగించేలా ఉందని 'ద డైలాగ్' అనే టెక్ పాలసీ థింక్ ట్యాంక్ వ్యవస్థాపకుడు కాజిమ్ రిజ్వీ ఆందోళన వెలిబుచ్చారు.



కాంతిని గడ్డకట్టించారు!

న్యూఢిల్లీ, జూన్ 29: సెకనుకు దాదాపుగా 3 లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఫోటాన్ల సమూహమైన కాంతిని ఇటలీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ పవియా, సీఎన్ఆర్ నానోటెక్ పరిశోధకులు గడ్డకట్టించారు. ఒక నిర్దిష్టమైన పద్ధతిలో ఏర్పాటు చేసిన అత్యంత శీతలమైన వాతావరణంలోకి (అణువాయువులోకి) పంపడం ద్వారా దాన్ని ఒక 'సూపర్ సాలిడ్'లా మార్చగలిగారు (పైకి గడ్డ కట్టినట్టుగా కనిపిస్తూనే అంతర్గతంగా ద్రవలక్షణాలను కలిగి ఉండే పదార్థాలను క్వాంటం సిద్ధాంతంలో సూపర్ సాలిడ్స్ అంటారు). మామూలు సాలిడ్స్ (ఘనపదార్థాలు) వాటంతట అవి కదలవు. కానీ, సూపర్ సాలిడ్స్ అలా కాదు. వాటిలోని కణాల ఆధారంగా.. తమ నిర్మాణంలో ఏ మార్పూ లేకుండా అవి అవి తమ దిశను, సాంద్రతను మార్చుకోగలవు. ఇలా కాంతిని నియంత్రించగలిగే టెక్నాలజీ అందుబాటులోకి వస్తే.. కాంతితో, అతి తక్కువ విద్యుత్తుతో పనిచేసే కంప్యూటర్లను అభివృద్ధి చేయవచ్చు. భవిష్యత్తులో మనం వాడే క్వాంటం కంప్యూటర్లు, ఆప్టికల్ ప్రాసెసర్లను ఈ టెక్నాలజీ ద్వారా తయారుచేయవచ్చు. ఫోటాన్లను నియంత్రించగలిగే శక్తి సంపూర్ణంగా అందుబాటులోకి వస్తే మనం ఊహించలేనంత వేగంతో డేటాను, అత్యంత సురక్షితంగా ప్రసారం చేయొచ్చు. కాంతి ఆధారిత సమాచార ప్రసార ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేయొచ్చు. కాంతిలో డేటానూ భద్రపరచవచ్చు. 'ఆప్టికల్ మెమొరీ చిప్స్' వంటి అద్భుతమైన పరిజ్ఞానాలను భవిష్యత్తులో రూపొందించడానికి ఇదొక కీలకమైన ముందడుగు. అవి ప్రస్తుతం మనం వాడే హార్డ్ డిస్క్ డ్రైవ్‌ల కన్నా కొన్ని వేల రెట్లు వేగంతో పని చేస్తాయి. మెడికల్ ఇమేజింగ్ (అంటే ఎక్స్‌రేల వంటివి), అంతరిక్ష రహస్యాల అన్వేషణలో ఈ పరిజ్ఞానం కీలకంగా ఉపయోగపడుతుంది.

ఏప్రిల్ 1 నుంచి జనగణన

2 దశల్లో నిర్వహణ.. తొలి దశలో ఇళ్లు, ఆస్తుల లెక్క.. రెండో దశలో జనాభా, కుల గణన

» 36 ప్రశ్నలతో సమాచార సేకరణ

» రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎస్‌లకు సెన్సస్ కమిషనర్ లేఖ



న్యూఢిల్లీ, జూన్ 29: దేశంలో జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. దీనిని రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలిదశలో ఇళ్ల జాబితా, వాటి స్థితి, ఆస్తులు, సౌకర్యాలు వంటి వివరాలను సేకరిస్తారు. మలి దశలో జనాభా లెక్కలతో పాటు వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, సంస్కృతి, సంప్రదాయాలు సహా ఇతర వివరాలను సేకరిస్తారు. తొలిదశ 2026, ఏప్రిల్ 1న ప్రారంభం కానుండగా, రెండో దశ 2027, ఫిబ్రవరి 1న మొదలవనుంది. తొలిదశకు ముందే సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకంతోపాటు వారికి పని కేటాయింపు ప్రక్రియ కూడా పూర్తి చేయనున్నారు. ఈ మేరకు జన గణన విభాగం కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ పేర్కొన్నారు. ఆయా వివరాలతో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఈ ప్రక్రియకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సహకరించాలని కోరారు. జన గణనతోపాటే కుల గణను కూడా చేపట్టనున్నట్టు కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో దానిని కూడా మలిదశలో చేపట్టనున్నారు. కాగా, దేశంలో జనగణన చేపట్టడం ఇది 16వ సారి అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేపడుతున్న 8వ జనగణనగా మృత్యుంజయ్ కుమార్ పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియను మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. అదేవిధంగా ప్రజలకు స్వీయ గణన సదుపాయం కూడా అందుబాటులో ఉండనుంది. మొత్తం డేటాకు పటిష్ఠమైన భద్రత కల్పిస్తారు. ఇక, జన గణన, వ్యక్తిగత విషయాల్లో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు, రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్ వంటి ప్రశ్నలు అడిగి వివరాలు సేకరించనున్నారు. తృణధాన్యాల వినియోగం, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, వృథానీటి నిర్వహణ, వంటగది సదుపాయం, వంటకు వినియోగించే గ్యాస్ ఎల్పీజీనా, పీఎన్‌జీనా వంటి వాటి వివరాలను కూడా నమోదు చేస్తారు. ఇక, ఇళ్లకు సంబంధించిన వివరాల్లో ఇంటి గోడలు, గచ్చు, పైకప్పుల వివరాలు, వాటి పరిస్థితిని తెలుసుకుంటారు. ఇంట్లో ఎంత మంది ఉంటారు?, ఇంటికి ఎన్ని గదులు ఉన్నాయి? వివాహిత జంటలు, కుటుంబ పెద్ద మహిళా? పురుషుడా? వంటి వివరాలను సేకరిస్తారు.

అంకెల్లో..

- మొత్తం ఎన్యూమరేటర్లు: 34 లక్షలు
- గణనలో పాల్గొనే సిబ్బంది: 1.3 లక్షలు
- ప్రజలను అడగనున్న ప్రశ్నలు: 36
- ఇళ్లు, ఆస్తుల గణన: 2026, ఏప్రిల్ 1 నుంచి
- జనాభా, కుల గణన: 2027, ఫిబ్రవరి 1 నుంచి

సరిహద్దులకు తుదిగడువు

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పరిపాలనా సౌలభ్యం కోసం చేసే జిల్లాలు, తాలూకాలు, పోలీసు స్టేషన్ల సరిహద్దుల నిర్ణయాన్ని ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి ముగించాలని మృత్యుంజయ్ కుమార్ సూచించారు. డిసెంబరు 31నాటికి ఉన్న సరిహద్దులను జన గణనకు ప్రామాణికంగా తీసుకుంటామని వివరించారు. గ్రామాలు, పట్టణాలను ఏకరీతి గణన బ్లాకులా విభజించనున్నట్టు తెలిపారు. ఒక్కొక్క బ్లాకుకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించనున్నట్టు పేర్కొన్నారు.

బిహార్‌లో 3 కోట్ల మంది ఓటర్లపై ఈసీ కీలక ప్రకటన

బిహార్ ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. 2003 నాటి రాష్ట్ర ఓటర్ల జాబితాను త్వరలోనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నట్టు తెలిపింది. ఈ జాబితాలో మొత్తం 4.96 కోట్ల మంది ఓటర్ల వివరాలు ఉన్నాయని, వీరు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొంది. మిగిలిన 40 శాతం మంది ఓటర్లు మాత్రం.. ఎన్నికల సంఘం పేర్కొన్న 11 ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదానిని సమర్పించాలని తెలిపింది. ఈ ఓటర్ల సంఖ్య 3 కోట్లుగా ఉందని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వల్ల ఓటర్లకు మేలు జరుగుతుంది. అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోరు. అదేవిధంగా అక్రమంగా ఓటు హక్కు పొందిన వారిని నిలువరించే అవకాశం ఉంటుంది" అని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. కాగా, బిహార్‌లో మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

జగన్నాథ రథయాత్రలో విషాదం

» గుండిచా ఆలయం వద్ద తొక్కిసలాట

» ముగ్గురి మృతి, 50 మందికి గాయాలు

పూరీ/భువనేశ్వర్, జూన్ 29: ఒడిశాలోని పూరి జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుండిచా ఆలయ సమీపంలో జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మృతిచెందగా, దాదాపు 50 మంది గాయపడ్డారు. రథాల్లో కొలువైన దేవతామూర్తులను చూడటానికి వందలాది మంది భక్తులు ఒక్కసారిగా తోసుకుంటూ ముందుకు రావడంతో తొక్కిసలాట జరిగిందని పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వైన్ తెలిపారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి చాలా విషమంగా ఉందని చెప్పారు. పూజా సామగ్రిని తీసుకువెళ్తున్న రెండు ట్రక్కులు రథాల సమీపంలో రద్దీగా ఉన్న ప్రదేశంలోకి ప్రవేశించడంతో గందరగోళం మొదలైందని అధికారులు పేర్కొన్నారు. సంప్రదాయంలో భాగంగా దేవతామూర్తుల మొహాలపై కప్పి ఉంచిన వస్త్రాన్ని (పహందా) తొలగించే సమయంలో స్వామిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. మృతులను బసంతి సాహు (36), ప్రేమకాంత్ మొహంతి(80), ప్రవాతి దాస్ (42)గా గుర్తించారు. ఈ దుర్ఘటనపై ఒడిశా సీఎం మోహన్ మాఝీ స్పందించారు. ప్రభుత్వం తరఫున భక్తులను క్షమాపణలు కోరారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. తొక్కిసలాట ఘటన అత్యంత విషాదకరమని, సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు. సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

95 కోట్ల మందికి సంక్షేమం!

దేశ జనాభాలో 64% మందికి సంక్షేమ పథకాలతో లబ్ధి.. మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సామాజిక భద్రత పథకాలతో దేశంలో 95 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని ప్రధాని మోదీ వెల్లడించారు. జనాభాలో 64 శాతం మందికి ఏదో ఒక రూపంలో సంక్షేమం అందుతోందన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తన నివేదికలో ఈ విషయం వెల్లడించిందన్నారు. ఆకాశవాణిలో ఆదివారం ప్రసారమైన 'మన్ కీ బాత్' 123వ సంచికలో ఆయన ప్రసంగించారు. 2015కి ముందు వరకు దేశంలో 25 కోట్ల మంది మాత్రమే సామాజిక భద్రత కార్యక్రమాలతో ప్రయోజనం పొందారని చెప్పారు. ఇవాళ ఏదో ఒక పథకం ద్వారా 95 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఆరోగ్యం నుంచి సామాజిక భద్రత వరకు ప్రతి రంగంలో సంతుష్ట స్థాయికి చేరే దిశగా దేశం ముందుకెళ్తోందన్నారు. భారత్‌ను ట్రాకోమా(కంటివాపు) రహితదేశంగా ఐఎల్‌వో ప్రకటించడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. దీని నిర్మూలనలో 'స్వచ్ఛ భారత్ అభియాన్', 'జల్‌జీవన్ మిషన్' కార్యక్రమాల సహకారం కూడా ఉందన్నారు. ఊబకాయాన్ని కూడా తగ్గించుకోవాలని పిలుపిచ్చారు. ఇందుకోసం నూనె వాడకాన్ని పది శాతం తగ్గించుకోవాలని పునరుద్ఘాటించారు. వివిధ యాత్రలకు బయల్దేరుతున్న భక్తులు, యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'సుదీర్ఘ కాలం తర్వాత సోమవారం నుంచి కైలాస్ మానసరోవర్ యాత్ర పునఃప్రారంభమవుతోంది. అమరనాథ్ యాత్ర 3వ తేదీ నుంచి మొదలవుతోంది. ఇటీవలే పూరీ జగన్నాథుడి రథయాత్ర జరిగింది. కొద్ది రోజుల్లో పవిత్ర శ్రావణ మాసం వస్తోంది. ఉత్తరం నుంచి దక్షిణం.. తూర్పు నుంచి పశ్చిమం వరకు సాగే ఈ యాత్రలన్నీ 'ఏక్ భారత్..శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి' అని చెప్పారు.

విశాఖ యోగాంధ్రలో 3 లక్షలకుపైనే..

దేశవ్యాప్తంగానే గాక ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని ప్రధాని గుర్తుచేశారు. "విశాఖ బీచ్‌లో నేను పాల్గొన్న యోగాంధ్ర కార్యక్రమంలో 3లక్షల మంది పాలుపంచుకున్నారు. ఇదో అద్భుత దృశ్యం" అని పేర్కొన్నారు. తెలంగాణలో మూడు వేల మంది దివ్యాంగులు కలిసి యోగా శిబిరంలో పాల్గొన్నారని, సాధికారతకు యోగా ఎలా మాధ్యమం అవుతుందో నిరూపించారని ప్రశంసించారు. మేఘాలయలో 'ఎరి' పట్టును ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీనికి కొద్ది రోజుల కిందట 'జీఐ' ట్యాగ్ కూడా లభించిందన్నారు. 'ఎరి పట్టు మేఘాలయకు వారసత్వంలాంటిది. ఇక్కడి ఖాసీ తెగ ప్రజలు ఎన్నో తరాలుగా దీనిని సంరక్షిస్తూ వస్తున్నారు. ఈ పట్టును తీసుకోవడానికి పట్టుపురుగులను చంపవసరం లేదు. అందుకే దీనిని 'అహింస పట్టు'గా పేర్కొంటున్నారు' అని తెలిపారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారిని దేశం ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుందని ప్రధాని ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల క్రియాశీల భాగస్వామ్యం ఉంటే ఇలాంటి పెను సంక్షోభాలను ఎదుర్కోగలమన్నారు.

భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్..

తెలంగాణలోని భద్రాచలానికి చెందిన గిరిజన మహిళలను ప్రధాని ప్రశంసించారు. తమ జీవనోపాధి కోసం రోజంతా పొలాల్లో కూలీలుగా కష్టపడి పనిచేసే గిరిజన మహిళలు నేడు చిరుధాన్యాల (మిల్లెట్స్) నుంచి ఆరోగ్యకరమైన బిస్కెట్లు తయారు చేస్తున్నారని అన్నారు. ఈ బిస్కెట్లు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరుతో హైదరాబాద్ నుంచి లండన్ దాకా వెళ్తున్నాయని తెలిపారు. ఆ గిరిజన మహిళలు 'గిరి శానిటరీ ప్యాడ్లు' తయారుచేశారని.. కేవలం మూడు నెలల్లో 40 వేల ప్యాడ్లను తయారుచేసి చాలా సరసమైన ధరకు పాఠశాలలు, సమీపంలోని కార్యాలయాలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు.

మూడు నెలల్లో సీఎంగా డీకే శివకుమార్!

» సొంత పార్టీ ఎమ్మెల్యే హుస్సేన్ వ్యాఖ్యలు

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పు జరుగుతుందా? ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య స్థానంలో కాంగ్రెస్ అధిష్ఠానం ప్రస్తుత డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కూర్చొపెట్టే ఆలోచనలో ఉందా? అంటే అవుననే అంటున్నారు సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్! రామనగరలో ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2-3 నెలల్లో సీఎంగా సిద్దరామయ్య స్థానంలో డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనేలా మాట్లాడారు. 'సమయం వచ్చినప్పుడు అధిష్ఠానం డీకే శివకుమార్‌కు అవకాశం ఇస్తుంది. అది ఈ ఏడాది జరిగే అవకాశం ఉంది' అని వ్యాఖ్యానించారు. 'సెప్టెంబరు తర్వాత రాష్ట్రంలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయని కొందరు నాయకులు మాట్లాడుతున్నారు. నేను డైరెక్టుగా చెబుతున్నా.. 2-3 నెలల్లో ఒక నిర్ణయం జరుగుతుంది' అని డీకేకు సన్నిహితుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ పేర్కొన్నారు.

సాంకేతిక లోపంతో చెన్నైలో దిగిన హైదరాబాద్ విమానం

చెన్నై, న్యూఢిల్లీ, జూన్ 29: సాంకేతిక లోపం కారణంగా హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ఓ విమానం తిరిగి చెన్నైలో దిగింది. నెల్లూరుకు సమీపంలో గాల్లో ఉండగా విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించారు. వెంటనే అధికారులను సంప్రదించిన పైలట్ చెన్నైలో విమానాన్ని సురక్షితంగా దింపినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ విమానంలో 159 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఇదిలా ఉండగా.. టోక్యో నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానాన్ని ఆదివారం కోల్‌కతాకు మళ్లించారు. క్యాబిన్‌లో అధిక ఉష్ణోగ్రత మూలంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.



బెజోస్.. పెళ్లి సందడి

వెనిస్, జూన్ 29: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, జర్నలిస్టు లారెన్ సాంచెజ్ వివాహం వెనిస్ గ్రాండ్ కెనాల్‌లో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ వివాహ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రముఖులు హాజరయ్యారు. సాధారణంగా పెళ్లి అనగానే సంగీత్, మెహందీ గుర్తొస్తాయి. కానీ బెజోస్, సాంచెజ్ కాస్త డిఫరెంట్‌గా ఫోమ్ పార్టీతో తమ పెళ్లి వేడుకలను మొదలుపెట్టారు. నురుగులో మునిగి తేలుతూ పార్టీ చేసుకుంటున్న బెజోస్, సాంచెజ్ ఫొటోలు వైరల్ అయ్యాయి. ఈ వివాహం కోసం బెజోస్ దాదాపు రూ.470 కోట్లు ఖర్చు పెట్టినట్లు సమాచారం. యూరప్‌లో ఇంత భారీ మొత్తంలో ఖర్చు పెట్టిన వివాహం ఇదే అని తెలుస్తోంది.

పాక్ ఆర్థికం అతలాకుతలం!

» నౌకలపై భారత్ నిషేధం విధించడంతో తీవ్ర నష్టం

» ఎగుమతులు, దిగుమతుల్లో 50 రోజుల జాప్యం

» వెల్లడించిన 'డాన్' కథనం



పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత.. మే 2 నుంచి పాకిస్థాన్‌పై భారత్ విధించిన నిషేధంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా భారతీయ పోర్టుల్లో పాకిస్థానీ నౌకలను నిషేధించడంతో ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. పాకిస్థాన్ పత్రిక 'డాన్' ఈ అంశంపై ఓ కథనాన్ని ప్రచురించింది. పాకిస్థాన్ నౌకలపై నిషేధం విధించడంతో.. భారీ నౌకలు కరాచీ పోర్టులోనే లంగర్ వేసుకుని, ఎదురు చూస్తున్నాయి. భారత పోర్టుల్లో అనుమతి లేకపోవడంతో.. సాధారణంగా జరగాల్సిన ఎగుమతులు, దిగుమతుల్లో 30 నుంచి 50 రోజుల మేర ఆలస్యం నమోదవుతోంది. భారత్ విధించిన నిషేధంతో లాజిస్టిక్స్ ధరలు గణనీయంగా పెరిగాయని, బీమా ఖర్చులు కూడా పెరిగినట్లు కరాచీకి చెందిన వస్త్రాల ఎగుమతిదారుడు ఆమిర్ అజీజ్ వాపోయారు. ఫలితంగా షిప్పింగ్ ధరలు భారీగా పెరిగినట్లు వివరించారు. భారత్ నిషేధం విధించిన తొలినాళ్లలో పాకిస్థాన్ దొడ్డిదారిలో సరుకు రవాణాకు సిద్ధమైంది. అయితే.. భారత్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) ఈ తరహా దిగుమతులు, ఎగుమతులపై కొరడా ఝుళిపిస్తోంది. యూఏఈ, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాల నుంచి పాక్ పంపే సరుకులను కట్టడి చేసేందుకు 'ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్'ను ప్రారంభించింది. ఫలితంగా 39 కంటైనర్లలోని రూ.9 కోట్ల విలువ చేసే 1,100 మెట్రిక్ టన్నుల సరుకు సీజ్ అయ్యింది. పాక్ ఈ సరుకును యూఏఈలో తయారైనట్లు తప్పుడు రికార్డులను సృష్టించి, భారత్‌కు తరలించింది.

దారుణ పరిస్థితులు

కరాచీ, కాసీం పోర్టులు పాక్ ఎగుమతులు, దిగుమతులకు అత్యంత కీలకం. వీటికి దన్నుగా గ్వాదర్ పోర్టు ఉంది. ఈ మూడు పోర్టులు ఆ దేశ జీడీపీకి 0.5% వాటాను అందజేస్తున్నాయి. ఈ పోర్టుల ద్వారా పాక్ ప్రభుత్వానికి ఏటా రూ.15 వేల కోట్ల మేర ఆదాయం లభిస్తుందని అంచనా. భారత్ ఆంక్షల తర్వాత.. పోర్టుల ద్వారా ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. ఇక భారత్ నుంచి 2018లో ఇరు దేశాల మధ్య 2.41 బిలియన్ డాలర్ల మేర వాణిజ్యం జరగ్గా.. 2024లో అది 1.2 బిలియన్ల డాలర్లకు పడిపోయింది. పాకిస్థాన్ నుంచి భారత్‌కు దిగుమతులు కూడా 547.5 మిలియన్ డాలర్ల(2018లో) నుంచి 0.48 మిలియన్ డాలర్లకు(2024లో) పడిపోయాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ సంబంధాలు మరింతగా క్షీణించాయి. దీంతో.. పాక్‌లోని ప్రజలపై నిత్యావసరాలు, గృహోపకరణాల ధరల భారం పడుతోంది.

- సెంట్రల్ డెస్క్



కనకదుర్గమ్మకు బోనాలు సమర్పిస్తున్న హైదరాబాద్ ప్రతినిధులు, చిత్రంలో మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, ఈవో శీను నాయక్

కనకదుర్గమ్మకు భాగ్యనగర్ బంగారు బోనాలు

విజయవాడ (వన్‌టౌన్), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు శ్రీభాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో సుమారు 500 మందికి పైగా భక్తులు ఆదివారం బంగారు బోనాలు సమర్పించారు. తొలుత బంగారు బోనాలతో ఊరేగింపుగా ఇంద్రకీలాద్రి చేరుకున్నారు. ప్రత్యేక పూజల్లో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దుర్గగుడి ఈవో శీనానాయక్ పాల్గొని దుర్గమ్మకు బోనాలు సమర్పించారు.

ఎక్కడి క్లెయిమ్‌లు అక్కడే!

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క క్లెయిమ్ కూడా సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లలేదు. ప్రస్తుతం ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ స్థాయిలో దాదాపు 2.60 లక్షల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ.600 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో క్లెయిమ్‌లు పెండింగ్ పెట్టిన సందర్భాలు ట్రస్ట్ చరిత్రలో లేవు. ట్రస్ట్‌కు ప్రతి రోజూ దాదాపు 5వేల నుంచి 6వేల వరకూ ప్రీఆథరైజేషన్ల (శస్త్రచికిత్సకు అనుమతి కోసం వచ్చే వినతులు)తో పాటు సుమారు 5వేల క్లెయిమ్‌లు వస్తాయి. ఆస్పత్రుల నుంచి క్లెయిమ్‌ను అప్‌లోడ్ చేయగానే ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వద్దకు వస్తాయి. అక్కడినుంచి ప్యానల్ డాక్టర్‌కు, ఆపరేషన్స్ ఈవోకు ఆ తర్వాత సీఈవోకి వెళ్తాయి. సీఈవో లాగిన్ నుంచి సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ అవుతాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించే సమయంలో క్లెయిమ్స్‌కు సంబంధించిన నిధులు ఆస్పత్రుల ఖాతాల్లోకి వెళ్తాయి. గత రెండు నెలల నుంచి 2.60 లక్షల క్లెయిమ్‌లను ప్రాసెస్ చేయకపోవడంతో ఆస్పత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పటికే రూ.కోట్ల బిల్లులు ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉంది. క్లెయిమ్‌లు ప్రాసెస్ చేయకపోవడంతో ఆస్పత్రులకు వెళ్లాల్సిన బిల్లులు ట్రస్ట్‌లోనే నిలిపోతున్నాయి. ట్రస్ట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం ఇస్తున్న కాస్త బిల్లులు కూడా ఆస్పత్రులకు చేరడం లేదు.

కలెక్టర్లు చూసుకుంటారులే...

ప్రస్తుతం ట్రస్ట్ సాఫ్ట్‌వేర్ మొత్తం నేషనల్ హెల్త్ ఆథారిటీ (ఎన్‌హెచ్ఏ)లోకి మారుతోంది. ఈ బాధ్యతలు ట్రస్ట్ సిబ్బందికి అప్పగించడంతో క్లెయిమ్‌లు పెండింగ్‌లో పడ్డాయి. దీనికి తోడు ట్రస్ట్ ఉన్నతాధికారి తీవ్ర నిర్లక్ష్యం కూడా పెండింగ్‌కు కారణంగా మారింది. ట్రస్ట్ సాఫ్ట్‌వేర్ ఎన్‌హెచ్ఏ పరిధిలోకి వెళ్తే క్లెయిమ్‌లు జిల్లా కలెక్టర్ల లాగిన్‌కు వెళ్తాయి. ఏదైనా సమస్య వచ్చినా కలెక్టర్లు చూసుకుంటారన్న ఆలోచనలో ఉన్నారు. అప్పుడు తనకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పూర్తయ్యే వరకూ క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఉన్నతాధికారి నిర్ణయించారు.

సంతకం అంటే భయం..

ట్రస్ట్ ఉన్నతాధికారికి సంతకం అంటే చాలా భయం. ఏ ఫైల్‌పైనా ఆయన సంతకాలు చేయరు. చివరికి ఉద్యోగుల జీతాలకు సంబంధించిన ఫైల్‌పై సంతకం పెట్టాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. కిందస్థాయి అధికారులు ఏదైనా ఫైల్ పెట్టినా దానిని రిజెక్ట్ చేయడమో లేదా తర్వాత చర్చిద్దామని పక్కన పెట్టేయడమే పనిగా పెట్టుకున్నారు. ట్రస్ట్‌కు ప్యానల్ డాక్టర్లు చాలా ముఖ్యం. వారు సక్రమంగా విధులు నిర్వహిస్తేనే ట్రస్ట్ ద్వారా రోగులకు వైద్య సేవలు అందుతాయి. అలాంటి కీలకమైన ప్యానల్ డాక్టర్లకు ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా పెండింగ్ పెట్టారు. జీతాలకు సంబంధించిన ఫైల్ ఉన్నతాధికారి వద్దకు ఎన్నిసార్లు తీసుకువెళ్లినా దానిని పక్కన పెట్టాలని ఆదేశిస్తున్నారు. సంతకాల భయంతో సదరు ఉన్నతాధికారి ట్రస్ట్‌ను భ్రష్టు పట్టించారు. ఆ భయంతోనే లక్షల్లో క్లెయిమ్‌లు పెండింగ్ పెట్టారు. ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం ట్రస్ట్‌కు వెళ్లి సమీక్ష నిర్వహించారు. అక్కడ ఏ పని జరగడం లేదని తెలుసుకున్న ఆయన అధికారులను మందలించినట్లు సమాచారం. లక్షల్లో క్లెయిమ్‌లు పెండింగ్ పెట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారుల్లో మాత్రం మార్పు రాలేదు.

జీరో పెనాల్టీలు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి తొమ్మిది నెలల్లో వివిధ ఆస్పత్రులకు రూ.13కోట్ల పెనాల్టీలు విధించారు. ఈ విషయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి కూడా చాలా సమావేశాల్లో గర్వంగా చెప్పుకున్నారు. కానీ గత మూడు నెలల నుంచి ట్రస్ట్ అధికారులు పెనాల్టీల ఊసే ఎత్తడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు 3నెలల నుంచి తాళం వేసేశారు. ఆరోగ్యశాఖలో అత్యంత కీలక విభాగమైన ఎన్టీఆర్ వైద్య సేవలో యాక్టివ్‌గా ఉండే అధికారులను నియమించాలని పలువురు కోరుతున్నారు.



కారు నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కారు నుంచి మంటలు

» సురక్షితంగా బయటపడిన కర్ణాటక భక్తులు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ఆదివారం ఓ కారు అగ్నిప్రమాదానికి గురైంది. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా గుడిపల్లికి చెందిన సుదర్శన్ శ్రీవారి దర్శనం కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఆదివారం తిరుమల బయలుదేరారు. మధ్యాహ్నం తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే కారు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించారు. వెంటనే అంతా వాహనం నుంచి కిందకు దిగి దూరంగా పరుగు తీశారు. నిమిషాల వ్యవధిలోనే కారు నుంచి మంటలు వ్యాపించాయి. టీటీడీ విజిలెన్స్ ఫైర్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు సగభాగం కాలిపోయింది.

తాడిపత్రిలో హైటెన్షన్

» మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి రాకతో అలజడి

» ఇంటిపై దాడికి జేసీ ప్రభాకర్‌రెడ్డి యత్నం



తాడిపత్రిలో పెద్దారెడ్డితో మాట్లాడుతున్న ఏఎస్పీ



పెద్దారెడ్డి ఇంటివైపు వెళ్తున్న ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు

తాడిపత్రి, జూన్29(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రాకతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పెద్దారెడ్డి ఇంటిపై దాడికి జేసీ ప్రభాకర్ రెడ్డి బయల్దేరడంతో ఆందోళన నెలకొంది. పోలీసులు పెద్దారెడ్డికి నచ్చజెప్పి అనంతపురం తరలించడంతో సమస్య సద్దుమణిగింది. గతేడాది శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇరువర్గాలవారు దాడులు చేసుకున్నారు. దీంతో పెద్దారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డిపై మూడు నెలలు పోలీసులు నియోజకవర్గ బహిష్కరణ విధించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకు అస్మిత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రికి వచ్చారు. పెద్దారెడ్డిని పోలీసులు అనుమతించలేదు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందంటూ అడ్డు చెప్పారు. దీంతో పెద్దారెడ్డి కోర్టును ఆశ్రయించగా... తాడిపత్రికి వెళ్లవచ్చునని అనుమతి ఇచ్చింది. ఆయన తాడిపత్రికి రావడం, పోలీసులు వెనక్కి పంపడం జరుగుతోంది. వారం క్రితం పోలీసులపై ఆయన కోర్టులో పిటిషన్ వేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎవరికీ తెలియకుండా ఆదివారం ఉదయం స్వగ్రామమైన యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి వచ్చారు. పెద్దారెడ్డి ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. విషయం తెలుసుకుని ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు పెద్దఎత్తున కార్యకర్తలు చేరుకున్నారు. జేసీ కార్యకర్తలతో కలిసి పెద్దారెడ్డి ఇంటి వైపు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పెద్దారెడ్డి వెళ్లిపోవాలని, లేదంటే ఇంటిపైకి వెళ్తామని కార్యకర్తలు పట్టుబట్టారు. పెద్దారెడ్డితో ఏఎస్పీ రోహిత్‌కుమార్ వెళ్లి చర్చించారు. సొంతూరు వెళ్లాలని సూచించారు. తనకు కోర్టు ఆర్డర్ ఉందని, వెళ్లనని ఆయన చెప్పారు. ఆయనను పోలీసులు జీపులో ఎక్కించి, అనంతపురం తరలించారు.

పెద్దారెడ్డి కోసం వచ్చిన వారికి రప్పా రప్పా..

ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 'పెద్దారెడ్డి ఒక్కరే నాకు శత్రువు. అతడికి సపోర్ట్‌గా వచ్చిన కార్యకర్తలు, నాయకులందరినీ రప్పా.. రప్పా ఆడిస్తా' అని హెచ్చరించారు. తాను నాలుగు రోజులపాటు తాడిపత్రిలో ఉండనని, తమ కార్యకర్తలు రప్పా.. రప్పా ఆడిస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. చంద్రబాబు మంచోడు కాబట్టే వైసీపీ ఆటలు సాగుతున్నాయన్నారు. తాడిపత్రిలో అలాంటిదేమీ ఉండదని, రేపటి నుంచి వేరే అంటూ వ్యాఖ్యానించారు. దొంగగా తాడిపత్రికి వచ్చి వెళ్తున్న పెద్దారెడ్డిని వైసీపీ కార్యకర్తలు, నాయకులు నమ్ముకోవద్దన్నారు.



ఏఐ ఫర్ ఏపీ పోలీసు హ్యాకథాన్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

ఆర్నెల్లలో పోలీసు శాఖలో 'ఏఐ' యాప్‌లు

» నేరాలకు పాల్పడితే ఆటోమేటిక్‌గా గుర్తించే వ్యవస్థలు

» 'ఏఐ ఫర్ ఏపీ పోలీసు' హ్యాకథాన్‌తో మంచి ఫలితాలు

» ముగింపు కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ దశాబ్దాల తరబడి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు కృత్రిమ మేధ ద్వారా పరిష్కారాలు లభించాయని, వీటిని ఆరు నెలల్లో ఏఐ ఆధారిత అప్లికేషన్ల ద్వారా అమల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. గుంటూరులోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన 'ఏఐ ఫర్ ఏపీ పోలీసు' హ్యాకథాన్ ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీజీపీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా జాతీయ స్థాయిలో మొదటి సారిగా ఏఐ హ్యాకథాన్ నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. 160 కంపెనీలు నమోదు కాగా.. 60 కంపెనీలను ఎంపిక చేశామని తెలిపారు. విజ్ఞాన భాగస్వామిగా ఫోర్‌సైట్ ఏఐ సంస్థ సీఈవో సూర్య, హ్యాకథాన్ నిర్వహణకు ఆర్‌వీఆర్ కాలేజీ సహకారం అందించాయన్నారు. ఈ సాంకేతిక మేథోమథనంలో పోలీసు శాఖకు ఉపయోగపడే పరిష్కారాలు లభించాయమని పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదులను వేగవంతంగా ఎలా పరిష్కరించాలనే దానిపై దృష్టి పెట్టామని, దీని వలన పోలీసు శాఖ పనితీరు కూడా వేగం పెరుగుతుందన్నారు. ఈ సదస్సుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి హ్యాకథాన్‌లు మరిన్ని నిర్వహిస్తామని చెప్పారు. 'సాధారణంగా కానిస్టేబుళ్లకు ఎస్‌హెచ్‌వోలు బీట్‌లు వేస్తుంటారు. ఫలానా చోట నేరాలు జరగడానికి ఆస్కారం ఉంటుంది, అక్కడికి వెళ్లి నిఘా పెట్టి, నేరాలు జరగకుండా చూడండని ఆదేశిస్తుంటారు. అయితే ఈ పని రాబోయే రోజుల్లో ఏఐ అప్లికేషన్ చేస్తుంది. ఏ ప్రాంతంలో ఎలాంటి నేరాలు గతంలో జరిగాయి.. ఎక్కడ ప్రశాంతమైన పరిస్థితులున్నాయనే వివరాలను వాయిస్ కమాండ్‌ల ద్వారానే సమాధానం పంపిస్తుంది. వీటికి సంబంధించిన అంచనాలను కూడా ఏఐనే చేసి పంపుతుంది. దీని వలన దొంగలు, సైబర్ నేరగాళ్లను సులభంగా ట్రాక్ చేయొచ్చు. తద్వారా నేరానికి పాల్పడితే ఆటోమేటిక్‌గా గుర్తించే వ్యవస్థ పోలీసు శాఖకు అందుబాటులోకి వస్తుంది' అని డీజీపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ పోలీసు డైరెక్టరేట్ కార్యాలయ అధికారులు, జిల్లాల నుంచి వచ్చిన ఐజీ, డీఐజీ, ఎస్పీలు పాల్గొన్నారు.

పాకీజాకు దాతల అండ

» రూ.2లక్షలు ఇచ్చేందుకు మహేష్‌బాబు ఫ్యాన్స్ నిర్ణయం?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మానవత్వం పరిమళించింది. తీవ్రమైన ఆర్థిక కష్టాలతో, చివరికి భిక్షాటన చేసే దుస్థితికి చేరుకున్న సినీ నటి పాకీజా విషయంలో దాతలు ఉదారంగా స్పందిస్తున్నారు. 'పాపం.. పాకీజా!' శీర్షికన ఈ నెల 27న 'ఆంధ్రజ్యోతి' పతాక శీర్షికన ప్రచురించిన కథనానికి అనూహ్య స్పందన లభించింది. ఏపీ ప్రభుత్వ కరుణ కోసం గుంటూరు వచ్చిన ఆమె దీనగాథను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో అనేక మంది స్పందించారు. ఆమెకు ఫోన్ పే ద్వారా సాయం అందించేందుకు ముందుకొస్తున్నారు. ఆదివారం ఒకానొక సమయంలో రోజువారీ ట్రాన్సాక్షన్ల సంఖ్య పరిమితి దాటిపోయి ఆమె ఫోన్ పే యాప్ జామైపోయింది. పెద్ద మొత్తంలో కాకపోయినా ఎక్కువ మంది ఒకేరోజు ఫోన్‌పే చేయడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలిసింది. ఇలా ఆదివారం రోజున రూ.30 వేల సాయం అందినట్లు తెలుస్తోంది. కాగా, ఆమెకు రూ.2 లక్షలు విరాళం అందించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల మహేష్‌బాబు ఫ్యాన్స్ ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. మహేష్‌బాబు నటించిన 'అతడు' సినిమా రీ రిలీజ్ సందర్భంగా ఆమెకు త్వరలో ఆమెకు కబురు పెట్టి 'ఆంధ్రజ్యోతి' సమక్షంలోనే ఈ సాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. దాతలు పాకీజాకు సాయం చేయదలచుకుంటే 81488 86254 అనే ఈ నంబరులో సంప్రదించవచ్చు.

మాస్టారూ.. మీరు వెళ్లొద్దు!



ఉపాధ్యాయుడు రమణను వెళ్లవద్దని కోరుతున్న విద్యార్థులు

ఉద్యోగాల్లో ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైంది! ఎందుకంటే దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను తీర్చిదిద్దేది వారే!! విధి నిర్వహణలో భాగంగా టీచర్లు పలు పాఠశాలల్లో పనిచేస్తారు. వారి ఉద్యోగ కాలంలో బదిలీలపై బడులు మారుతూ ఉంటారు. అయితే ఈ క్రమంలో ఉపాధ్యాయులు పిల్లలకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా.. వారితో ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడుతుంది. బదిలీపై టీచర్లు వేరే చోటుకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తట్టుకోలేని విద్యార్థులు.. 'మాస్టారూ.. మీరు స్కూల్ వదిలి వెళ్లొద్దు' అంటూ అడ్డుకొని, కంటతడి పెట్టుకున్న పలు సందర్భాలు ఉన్నాయి. అలాంటి ఘటనే తాజాగా అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం కందిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. బదిలీ అయిన ఉపాధ్యాయుడు పి.రమణ రిలీవ్ కావడానికి ఆదివారం పాఠశాలకు వచ్చారు. ఈ విషయం తెలిసి విద్యార్థులు అతని వద్దకు చేరుకున్నారు. తాను బదిలీపై వెళుతున్నట్టు ఆయన చెప్పడంతో.. వెళ్లవద్దంటూ విద్యార్థులు కంటతడి పెట్టుకున్నారు. బోరున విలపిస్తూ ఆయన బైక్‌ను అడ్డుకున్నారు. చాలాసేపటి తర్వాత తల్లిదండ్రులు వారికి నచ్చజెప్పి ఇళ్లకు తీసుకువెళ్లారు.

\- బుచ్చెయ్యపేట(అనకాపల్లి జిల్లా)- ఆంధ్రజ్యోతి

క్రిటికల్ మినరల్స్‌లో స్వావలంబన

(మొదటి పేజీ తరువాయి)

తిప్పికొట్టేందుకు డిఫెన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా స్వయం సమృద్ధి సాధించడం, అంతర్జాతీయంగా పెద్ద ఎగుమతిదారుగా నిలవాలన్న సంకల్పంతో కేంద్రం ఈ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. దీని వల్ల దేశీయ రక్షణ రంగం అవసరాలను స్థానికంగా సమకూర్చుకోవడం అనే లక్ష్యాన్ని చేరుకోవడంతోపాటు పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ, మైనింగ్ రంగంలో సాంకేతిక ముందడుగు, కోట్లాది మందికి ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో దీనిని చేపట్టింది. ఈ మిషన్‌లో 1200లకు పైగా మైనింగ్ ప్రాజెక్టులు తీసుకురావాలన్నది కేంద్రం సంకల్పం. దేశీయంగా మరో 100 బ్లాక్‌లలో సంక్లిష్ట మినరల్ మైనింగ్ ప్రారంభించాలని భావిస్తోంది. ఈ ఐదేళ్ల లక్ష్య సాధనకు రూ.16 వేల కోట్లను వ్యయం చేయనుంది. కేంద్రం ప్రకటించిన మిషన్ వల్ల దేశీయ, అంతర్జాతీయంగా రూ.18 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనావేస్తోంది. అత్యధిక ప్రాధాన్యంతో దీనిని అమలు చేయాలనుకుంటున్న కేంద్రం.. సంక్లిష్ట మినరల్ మైనింగ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ఆసక్తి ఉన్న 24కు పైగా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపాలని భావిస్తోంది. దీంతో అటామిక్ మినరల్స్ పరిధిలో ఉన్న ఆరు ఖనిజాల మైనింగ్‌లో పాల్గొనేందుకు ప్రైవేటుకు అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో కలిపి వచ్చే ఐదేళ్లలో సంక్లిష్ట మినరల్స్ మైనింగ్‌లో దూసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది.

క్రిటికల్ మినరల్స్ అంటే?

ఖనిజాల్లో సాధారణమైనవాటితో పాటు అసాధారణమైనవి, సంక్లిష్టమైనవి కూడా ఉంటాయి. అంటే, మైనింగ్ చేసే సమయంలో వచ్చే సమస్యలు, ఆ తర్వాత వాటిని తరలించే సందర్భంలో వచ్చే సవాళ్లను దృష్టిలో పెట్టుకొని కొన్ని ఖనిజాలను క్రిటికల్ మినరల్స్(సంక్లిష్టమైనవి)గా పరిగణించి గుర్తించారు. అందులో 30 మినరల్స్ ఉన్నాయి. వీటిలో 14 ఖనిజాలను అటామిక్ మినరల్స్‌గా కేంద్రం ఎంఎండీఆర్ చట్టం-1957 ద్వారా నోటిఫై చేసింది. న్యూక్లియర్‌కి సంబంధించిన మినరల్స్ కూడా వీటిలో ఉండటంతో ఇప్పటి దాకా ప్రభుత్వ రంగ సంస్థలే ఆ ఖనిజాల మైనింగ్ చేయాలన్న నిబంధన ఉంది. అదానీ లాంటి కంపెనీలకు జగన్ ప్రభుత్వం బీచ్‌శాండ్ మినరల్స్ మైనింగ్ ఇద్దామని గతంలో ప్రయత్నించినా కేంద్రం నిబంధనల కారణంగా అది కార్యరూపం దాల్చలేదు. సంక్లిష్టమైన మినరల్స్‌లో 18 దేశీయ రక్షణ రంగ అవసరాలను తీర్చేవి ఉన్నాయి. వీటిని వ్యూహాత్మక ఖనిజాలుగా పరిగణిస్తున్నారు. వాటి వివరాలను ఇప్పటిదాకా కేంద్రం వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలే మైనింగ్ చేసి రక్షణ రంగ అవసరాలను భర్తీ చేస్తున్నాయి. అయితే, ఇటీవలికాలంలో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఇజ్రాయిల్- పాలస్తీనా, ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం సందర్భంగా తెరపైకి వచ్చిన అధునాతన శత్రు విధ్వంసక బాంబులు, క్షిపణులు వంటివి ప్రభుత్వ తక్షణ అవసరాలను గుర్తు చేస్తున్నాయి. రక్షణ రంగంలో ఉన్న ఉత్పాదక కొరతలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్వయం సమృద్ధి సాధించలని కేంద్రం భావిస్తోంది. దీనికి అత్యంత కీలకమైన వనరు సంక్లిష్ట మినరల్స్. ఇప్పటిదాకా వీటిని యూరప్, అమెరికా, రష్యా, ఆఫ్రికా తదితర దేశాల నుంచి దిగుమతి చేస్తున్నారు. లిథియం, బెరీలియం, టైటానియం, నోబియం, జిర్కోనియం, కాండిమమ్, గ్లకోనైట్, గ్రాఫైట్, నికెల్, యూరేనియంతో సంబంధం లేని పాస్ఫేట్, ఇంకా, అరుదైన ఖనిజాలు వీటిలో ఉన్నాయి. కొన్నింటిని బీచ్‌శాండ్ మైనింగ్ ద్వారా ప్రాసెస్ చేసి సేకరించవచ్చు. మరి కొన్నింటిని మైనింగ్ ద్వారానే తీసుకోవాలి. అయితే, దేశీయంగా బీచ్‌శాండ్ మైనింగ్ చాలా తక్కువగా ఉంది. ఇప్పుడు భవిష్యత్ అవసరాలు, సరికొత్త సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సాంకేతికత, పారిశ్రామిక ఉత్పాదకాలను పొందేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది.

ఐదేళ్ల లక్ష్యంతో మైనింగ్ మిషన్

ఐదేళ్ల కాల వ్యవధి(2024-25 నుంచి 2030-31) సంక్లిష్ట ఖనిజాల మైనింగ్‌లో దేశీయ అవసరాల్లో కనీసం 10 శాతం డిమాండ్‌ను అందుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా రక్షణ రంగ అవసరాలను కనీసం 50 శాతం తీర్చగలిగేలా నేషనల్ క్రిటికల్ మినరల్ మైనింగ్ మిషన్(ఎన్‌సీఎంఎం)ను ఖరారు చేసింది. ఇటీవల ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ భేటీలో ఈ మిషన్ కు ఆమోదం తెలిపారు. ఆ వెంటనే కేంద్ర గనుల శాఖ... మిషన్ అమలుపై నోటిఫికేషన్ జారీ చేసింది.

రాష్ట్రాల పాత్ర ఇదీ..

కేంద్రం ప్రకటించిన క్రిటికల్ మినరల్ జాబితాలో 24 ఖనిజాలు ఉన్నాయి. వీటి మైనింగ్‌కు సంబంధించి కేంద్రం అనుమతులు ఇచ్చిన తర్వాత, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వాలు మైనింగ్‌కు అవసరమైన అన్ని రకాల అవకాశాలు కల్పిస్తాయి. వీటిని ప్రాధాన్య ప్రాజెక్టులుగా పరిగణించి రాష్ట్రస్థాయిలో కీలక అనుమతులు ఇస్తాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టాల్సి వస్తే వాటిని తమ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల(ఏపీఎండీసీ లాంటివి)తో ప్రోత్సహించాలి. అవి అంతర్జాతీయ మైనింగ్ ప్రాజెక్టులు దక్కించుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలి.

అంతర్జాతీయ మైనింగ్‌లో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు దేశీయ మైనింగ్‌లో వెనుకబడ్డాయి. అవి ప్రాజెక్టులు దక్కించుకున్నా తిరిగి ఔట్ సోర్సింగ్ కింద ప్రైవేటుకే అప్పగిస్తున్నాయి. అయితే, కేంద్రం ప్రతిపాదించిన మిషన్ ద్వారా వీలైనంత మేరకు దేశీయంగా మైనింగ్ ప్రాజెక్టులు చేస్తూనే, అంతర్జాతీయ ప్రాజెక్టులు దక్కించుకోవాలని దిశానిర్దేశం చేసింది. అంటే, ఏపీఎండీసీ, ఎన్ఎండీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు క్రిటికల్ మినరల్స్ లభ్యత బాగా ఉన్న దేశాల్లో మైనింగ్ ప్రాజెక్టుల కాంట్రాక్టులు దక్కించుకోవాలి. కనీసం ఈ ఐదేళ్లలో 50 నుంచి 100 కాంట్రాక్టులు పొందాలి. దీనికి అవసరమైన రాయితీలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్రం రూ.1,600 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. మరో రూ.1,500 కోట్ల రాయితీలను సిద్ధం చేస్తోంది. ప్రైవేటు సంస్థలు కూడా అంతర్జాతీయంగా క్రిటికల్ మినరల్ మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని కేంద్రం స్పష్టం చేస్తోంది. ఇలా ప్రాజెక్టులు తీసుకొచ్చే ప్రైవేటు సంస్థలకు ప్రత్యేక రాయితీలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించనుంది. వీటి కోసం కేంద్రం ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయించింది. ఇటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థలు(28), ఇటు ప్రైవేటు రంగ సంస్థలు(24) వీలైనంత మేరకు సంక్లిష్ట మినరల్ మైనింగ్ ప్రాజెక్టు కాంట్రాక్టులు తీసుకోవాలని, వాటి ద్వారా వచ్చే ఖనిజాలను దేశీయ అవసరాలకు ఉపయోగించుకునేలా మిషన్‌ను రూపకల్పన చేసింది. వెసులుబాటును బట్టి విదేశీ ఎగుమతులకు వీలు కల్పిస్తారు. అంతర్జాతీయ మైనింగ్ ప్రాజెక్టుల ద్వారా దేశానికి వచ్చే ఖనిజాలపై దిగుమతి సుంకాలు ఉండవని కేంద్రం స్పష్టం చేసింది. దీంతోపాటు ఇతరత్రా ఎలాంటి సుంకాలు కూడా ఉండవని పేర్కొంది. ఈ క్రమంలో కేంద్రం రూ.4 వేల కోట్ల సబ్సిడీ ప్యాకేజీలను సిద్ధం చేసింది.

మిషన్‌లోని కీలకాంశాలు

- » 2024-25 సంవత్సరం నుంచి 2030-31 వరకు క్రిటికల్ మినరల్ మైనింగ్‌లో రూ.16 వేల కోట్ల వ్యయం చేస్తారు.
- » మైనింగ్ సెక్టార్‌లో రూ.18 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని కేంద్రం అంచనా. ఈ మిషన్ కార్యకలాపాల కోసం నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్(ఎన్ఎమ్ఈటీ)ని కేంద్రం ఏర్పాటు చేసింది. దీనిద్వారా మిషన్ కార్యకాలపాలు జరగనున్నాయి.
- » దేశీయంగా క్రిటికల్ మినరల్ మైనింగ్ కోసం ఎన్ఎమ్ఈటీ రూ.3 వేల కోట్లు ఖర్చు చేయనుంది. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రూ.4 వేల కోట్లు వ్యయం చేయనుంది.
- » దేశంలో కొత్తగా 1200 మైనింగ్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. వీటితోపాటు మరో 100 కొత్త మైనింగ్ బ్లాక్‌లు ప్రారంభించనున్నారు.
- » విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)కు అవకాశం కల్పిస్తారు.
- » అటామిక్ మినరల్స్‌లో ఉన్న 6 ఖనిజాల(లిథియం, బెరీలియం, టైటానియం, నోబియం, టాటాలమ్, జిర్కో)ను ఆ జాబితా నుంచి తొలగించారు. వీటి మైనింగ్‌కు ప్రైవేటు కంపెనీలకు అవకాశం కల్పిస్తారు.

పరిశోధనకు పెద్దపీట!

దేశీయంగా, అంతర్జాతీయంగా మైనింగ్ ద్వారా వచ్చే ఖనిజాలతో ప్రత్యేక హబ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో పరిశోధన, అధ్యయనం, వినియోగం తదితర కార్యాచరణల కోసం జాతీయంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. అంతిమంగా మైనింగ్ రంగంలో చేసే పరిశోధనల ఫలితాలతో కనీసం 100 పేటెంట్లు పొందాల్సి ఉంటుందని ఈ మిషన్ దిశానిర్దేశం చేసింది. మిషన్ అమలులో భాగంగా దేశీయంగా 4 ప్రాంతీయ పార్క్‌లను ఏర్పాటు చేయనున్నారు. మిషన్ అమలు కోసం ప్రాజెక్టులకు రాష్ట్రాల్లో, అంతర్జాతీయంగా ఎలాంటి ఆటంకాలు, అవరోధాలు తలెత్తకుండా చూసుకునేందుకు కేంద్రం కీలక అధికారాలతో కూడిన సాధికారిక కమిటీని ప్రకటించింది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో నీతి అయోగ్, కేంద్ర గనుల శాఖ సహా 17 శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. కేంద్రం సూచించే ఓ సంయుక్త కార్యదర్శుల నేతృత్వంలో మిషన్ సెక్రటేరియట్ ఏర్పాటు కానుంది.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో చోరీకి యత్నం

పిడుగురాళ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పల్నాడు జిల్లా పరిధిలో రైళ్లను ఆపి అర్ధరాత్రి దోపిడీ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున న్యూపిడుగురాళ్ల జంక్షన్ దాటిన తర్వాత తుమ్మలచెరువు రైల్వేస్టేషన్ చేరుకునే సమయంలో భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు 3.30 గంటల సమయంలో నిలిచిపోయింది. అప్పటికే రైలులో ప్రయాణిస్తున్న దుండగులు ఎస్-1 బోగీలో ప్రవేశించి మహిళలను బెదిరించారు. వారు కేకలు వేయడంతో పక్క బోగీలోని తెనాలి రైల్వే ఎస్ఐ వెంకటాద్రి, కానిస్టేబుళ్లు శేషయ్య, సురేంద్ర అక్కడికి చేరుకున్నారు. దుండగులను గుర్తించిన ఎస్ఐ గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరపడంతో వారు అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారివైపు పరుగులు తీశారు. ఈ వారంలో ఇదే ప్రాంతంలో దొంగలు మూడు సార్లు తెగబడడం గమనార్హం.

గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో విజిలెన్స్ తనిఖీలు!



చీమకుర్తి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా చీమకుర్తి పరిసర ప్రాంతాల్లో విస్తరించిన గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి చెందిన సూర్యా గ్రానైట్ క్వారీలో డంపర్ బోల్తాపడిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో గ్రానైట్ క్వారీల్లో నిబంధనలు ఏ మేరకు పాటిస్తున్నారు., కార్మికుల భద్రతపై తీసుకుంటున్న చర్యలు.., క్వారీయింగ్ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలను సమర్పించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఆ మేరకు జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.



ఇలా రికామీగా...

కళ్ళకు గంతలు కట్టుకొని
శూన్యంలో నడుస్తున్నాను

ఒక చేతిలో కత్తి
మరో చేతిలో డాలుతో
యుద్ధానికి సన్నద్ధమైన సైనికుడిలా

ఎన్నో బంధాల్ని వదిలేసి
ఎంతో కాలంగా
తిరుగుతున్నాను ఇలా రికామీగా

నీలి పూల లాంటి
నా కనురెప్పలపై
నాట్యం చేస్తున్నాయి
అల్లకల్లోల దృశ్యాలు

ఒక ఊహాపూరిత కోరిక
ఒక రసమయమైన భావన

నా స్మృతి పథం నుండి
జారిపోతున్నప్పుడు

మనసుతో మనసును
అనుసంధానించి
ఆత్మను ఆత్మతో
అనువాదం చేస్తున్నాను

ఇప్పుడు నన్ను నేను
విస్తరించుకున్నాను
నా ఆలోచనలు పురివిప్పి
నాట్యమాడుతున్నాయి

ఇప్పుడు నా రికామీ తిరుగుళ్ళన్నీ
యుద్ధవ్యూహాలు అయ్యాయి
కళ్ళకు గంతలున్నా
స్వప్న గమ్యం స్పష్టంగా కనిపిస్తోంది

నన్ను రక్షిస్తూ డాలు
యుద్ధం చేస్తూ నా చేతిలో కత్తి
రేపటి రోజు
ఆశ్చర్యకరమూ, కాంతివంతమూ
అయినది కావచ్చునేమో!

■ విల్సన్ రావు కొమ్మవరపు

✆ 89854 35515

జీవితం ఇలాగే

జీవితాన్ని కాస్త
చల్లని గాలికి ఆరేసుకోవాలి
నాలుగు ముచ్చట్లు నలుగురితో
పంచుకోవాలి
మన గుమ్మిలోని గింజలను
నలుగురితో కలిసి ఆరగించాలి
రేపటి పేజీ కనిపిస్తుందో లేదో
ఇప్పుడే రంగులు అద్దుకోవాలి
మనుషులలో మొలుస్తున్న
ముళ్ళను పీకవతల పారేయాలి
మట్టి పరిమళాలు పూయాలి
అవి ఊరు ఊరంతా వీస్తాయి హాయిగా
రోజన్నాక రాత్రి పగలు ఉన్నట్లు
జీవితం అన్నాక మంచి చెడులు ఉంటాయి
దేనికి వణుకు బెణుకు లేకుండా
వెళ్లడమే నేర్చుకోవాలి

■ గుండెల్లి ఇస్తారి

✆ 98499 83874



సోమవారం 30 జూన్ 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాలు

తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభ జూలై 1 ఉ.10గంటల నుండి ఎన్టీఆర్ కళామందిరం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ప్రారంభ సభలో వెలుదండ నిత్యానందరావు, యం. శంకరరెడ్డి, కసిరెడ్డి వెంకటరెడ్డి; మొదటి సమావేశంలో బిట్టు వెంకటేశ్వర్లు, శంకరనారాయణ, భమిడిపాటి విశ్వనాథం; రెండవ సమావేశంలో చిగిచర్ల కృష్ణారెడ్డి, పులికొండ సుబ్బాచారి, మసన చెన్నప్ప; ముగింపు సమావేశంలో కొలకలూరి ఇనాక్, కోట్ల హనుమంతరావు, టి. గౌరీశంకర్ తదితరులు పాల్గొంటారు.

తూమాటి సుధాకర్

కొలకలూరి సాహితీ వారోత్సవం

కొలకలూరి ఇనాక్ సాహితీ వారోత్సవం జూలై 1 నుంచి 7వ తేదీ వరకు త్యాగరాయగాన సభ, హైదరాబాద్‌లో జరుగుతాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడు రోజులపాటు కొలకలూరి ఇనాక్‌పై ఇతరులు రాసిన ఏడు పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుంది. పుస్తకాల రచయితలు కొలకలూరి మధుజ్యోతి, కల్లూరి ఆనందరావు, అరుణ గంధం, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, ఎ. రవీంద్రబాబు, కాత్యాయనీ విద్మహే, జి.యస్.ఆర్. కృష్ణమూర్తిల తోపాటు, పలువు ప్రముఖులు ఈ సాహితీ వారోత్సవంలో పాల్గొంటారు.

కళా వి.ఎస్. జనార్దన్‌మూర్తి

సాహిత్యానువాదంపై 'ఛాయా' సదస్సు

ఛాయ పబ్లికేషన్స్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'సాహిత్యానువాదం ప్రాముఖ్యత'పై సదస్సు జూలై 5 ఉ.10 గంటల నుంచి రూం.నెం. 121, ఆర్ట్స్ కాలేజ్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ అంశంపై ప్రొ. అరుణవ సిన్హా ప్రసంగిస్తారు. ఈ సదస్సులో ఛాయ ప్రతిష్ఠాత్మకంగా తెలుగు సాహిత్యంలో తీసుకుని వస్తున్న 'ఛాయ విదేశీ సిరీస్' విడుదలతోపాటు, వి.వి. గణేశానందన్ ఇంగ్లీష్ నవలకు తెలుగు అనువాదం 'మనుషులు మాయమయ్యే కాలం', సతీష్ చప్పరికె కన్నడ నవలకు తెలుగు అనువాదం 'ఘాంద్రుక్'ల ఆవిష్కరణ జరుగుతుంది. సభ నిర్వహణ అరుణాంక్ లత. సభలో ఎన్. కమలాకరశర్మ, సి. కాశీం, ఉమానూతక్కి, అనిల్ కుమార్, తారకేశ్వర్, కె. శ్రీనివాస్, సతీశ్ చప్పరికె, మోహన్‌బాబు తదితరులు పాల్గొంటారు.

ఛాయా పబ్లికేషన్స్


రావూరి భరద్వాజ పురస్కారం

రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారాన్ని బండి నారాయణ స్వామి, రావూరి కాంతమ్మ సాహిత్య సేవా పురస్కారాన్ని కన్నెగంటి అనసూయ స్వీకరించే కార్యక్రమం జూలై 5 సా.5గంటలకు శ్రీత్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి జస్టిస్ బి. శేషశయనారెడ్డి, సభాధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ. జె. చెన్నయ్య, రావూరి వెంకట కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారు.

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

చెక్కుచెదరని 'రక్త కన్నీరు' రికార్డు

ఒకే ఒక టీమ్, ఒకే ఒక వ్యక్తి సారథ్యంలో 1956 నుండి 1986 మధ్య కాలంలో 5432 ప్రదర్శనలతో టికెట్ పెట్టి మరీ ప్రజల్ని రప్పించిన నాటకం 'రక్త కన్నీరు'. దీన్ని అంత విజయవంతంగా నడిపిన చుండి నాగభూషణం పేరు దరిమిలా 'రక్తకన్నీరు నాగభూషణం'గా మారిపోయింది. పాతికేళ్ల కాలం పాటు తెలుగు రాష్ట్రాల్లో అప్రతిహత విజయాలతో సంచలనం కల్గించిన ఈ నాటకానికి మాతృక తమిళంలో యం. ఆర్. రాధా ప్రదర్శించిన 'రక్త కన్నీర్'. అప్పట్లో రైల్వేలో చిన్న ఉద్యోగం చేస్తూ సినిమా అవకాశాల కోసం మద్రాసు వెళ్లి చిన్నా చితకా వేషాలు మాత్రమే వేస్తున్న నాగభూషణం యం.ఆర్. రాధా 'రక్త కన్నీర్' నాటకాన్ని చూశారు. దానికి స్క్రిప్ట్ ఏదని అడిగితే స్క్రిప్ట్ లేదు, కాపీ రైటూ లేదు. దాంతో పాలగుమ్మి పద్మరాజు గారితో కలిసి అనేకసార్లు యం.ఆర్. రాధా నాటకాన్ని చూసిన నాగభూషణం ఆయన చేతే స్క్రిప్ట్ రాయించుకుని జైత్రయాత్ర ప్రారంభించారు.



ఈ నాటకం ప్రదర్శన ప్రదర్శనకూ డైలాగులు మారిపోతాయి. స్థానిక రాజకీయాలపైన, నాయకులపైన సెటైర్లు, చెణుకులు విసురుతూ జనరంజకంగా ప్రదర్శనలను రూపుదిద్దేవారు నాగభూషణం. ఈ నాటకంపై ఆధారపడి 50-60 కుటుంబాలు బతికేవి. నటీనటులు సాంకేతిక సిబ్బంది ఒక బస్సు లోనూ, ఆ వెనుక నాగభూషణం దంపతులు ఒక కారు లోనూ బయలుదేరేవారు. ప్రముఖ నటీమణులు వాణిశ్రీ, శారదలు మొదట్లో ఈ నాటకంలో నటించారు. డబ్బింగ్ జానకి, తెలంగాణ శకుంతల కూడా నటించారు. ప్రజా నాట్యమండలి కళాకారుడు బి. గోపాలం సంగీతం సమకూర్చేవాడు. నాటకంలో సుందరి పాత్ర కోసం ఎన్నుకున్న సీత అనే నటినే నాగభూషణం తన జీవిత భాగస్వామిగా చేసుకున్నారు.

> **ఈ నాటకం విజయ పరంపర కారణంగా సినిమాల్లో కూడా నాగభూషణానికి ముఖ్యమైన పాత్రలు వచ్చాయి. ఐతే అక్కడ ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి నెలా మొదటివారం మాత్రం సినిమాలకు కాల్షీట్లు ఇవ్వననే షరతుతో ఆ వారాన్ని నాటక ప్రదర్శనకు కేటాయించేవాడు.**

క్లుప్తంగా ఈ నాటక కథ - జమీందారీ కుటుంబానికి చెందిన గోపాలం ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి పాశ్చాత్య సంస్కృతిని నరనరానా జీర్ణించుకుని భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ఈసడించుకుంటూ సుందరి అనే వేశ్య వలలో పడతాడు. తల్లి పోరు పడలేక అయిష్టంగా ఇందిరను పెళ్లి చేసుకొని శోభనం రోజే ఆమెను వదిలేస్తాడు. సర్వసంపదలను సుందరికి కైంకర్యం చేసి చావుబతుకుల్లో ఉన్న తల్లిని చూడటానికి కూడా వెళ్లడు. గోపాలానికి కుష్టువ్యాధి సంక్రమించటం, సుందరి ప్రమాదంలో మరణించటం, ఆ ఇంట్లోవాళ్లు ఇతణ్ణి బయటకు గెంటటం, భిక్షగాడిగా మారిన గోపాలం అంత్యదశలో భార్య ఇందిరను గుర్తించి క్షమాపణ కోరి తన తప్పుకు ప్రాయశ్చిత్తంగా తన మిత్రుడు రమణతో ఇందిరకు పెళ్లి చేసి కన్నుమూయడం.. ఇదీ దీని కథ.



పురుషుల చెడు వ్యసనాలకు బానిసలై, ధనమదం, అహంకారంతో సాంసారిక జీవితాన్ని నాశనం చేసుకొంటూ స్త్రీల రక్త కన్నీరుకు కారణం కాకూడదనే ముగింపు గొప్ప సామాజిక ప్రయోజనాన్ని చేకూర్చింది. తన స్వంత ఊరైన నెల్లూరులో మొదటి ప్రదర్శనతో ప్రారంభించి చివరి ప్రదర్శనను కూడా నెల్లూరు లోనే ముగించారు నాగభూషణం. ప్రదర్శన ద్వారా వచ్చే డబ్బులో ఖర్చులు, నటీనటుల భత్యం పోను మిగిలిన డబ్బుని ఆయా ప్రాంతాలలోని కమ్యూనిస్టు పార్టీకి, ప్రజా సంఘాలకి పంచటమే గాక 70 దశకంలో పునర్నిర్మాణం గావించబడిన ప్రజా నాట్యమండలికి 19 సంవత్సరాల పాటు అధ్యక్షునిగా కూడా పని చేసి 1993లో ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు.

'రక్త కన్నీరు' నాటకం విజయ పరంపర కారణంగా సినిమాల్లో కూడా నాగభూషణానికి ముఖ్యమైన పాత్రలు వచ్చాయి. ఐతే అక్కడ ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి నెలా మొదటివారం మాత్రం సినిమాలకు కాల్షీట్లు ఇవ్వననే షరతుతో ఆ వారాన్ని నాటక ప్రదర్శనకు కేటాయించేవారు. 350 చిత్రాల్లో నటించిన నాగభూషణం ప్రతి నాయకుడి పాత్రకు అప్పటి వరకు ఉన్న ఫైటింగ్‌లు కత్తియుద్ధాలనే ఇమేజ్‌ని పక్కకు పెట్టి 'కన్నింగ్ విలనిజాన్ని' ప్రవేశపెట్టారు. నాగభూషణం తర్వాత రావుగోపాలరావు, కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్ తదితరులు ఈ ఒరవడిని కొనసాగించారు. 'రక్త కన్నీరు' నాటకాన్ని యం.ఆర్. రాధా తమిళంలో చలనచిత్రంగా నిర్మించి తెలుగు లోకి డబ్ చేయగా, యం.ఆర్. రాధాకు తెలుగులో నాగభూషణమే డబ్బింగ్ చెప్పారు. మళ్లీ తెలుగులో ఇలాంటి నాటకం రావాలని కోరుకుందాం.

■ చెరుకూరి సత్యనారాయణ

నా మొదటి పుస్తకం

మునాసు వెంకట్

ముందుమాటలు గానీ, ఆవిష్కరణలు గానీ, పరిచయ సభలు గానీ లేని నా మొదటి పుస్తకం 'ఎన' 1999 జూలైలో గోసంగి నీలి సాహితి ద్వారా 35 కవితలతో, 64 పేజీలతో వెలువడింది. ఇది అమ్మ నాయనలకు అంకితం. నా కవిత్వాన్ని పుస్తక రూపంలో చూసుకున్నప్పుడు నా గుండెల నిండా ఓ నిశ్శబ్ద వేడుక. దానిని అమ్మకు చూపించి ఆనందపడ్డ క్షణాలు మరువలేనివి. 'బహువచనం', 'చిక్కనవుతున్న పాట', 'పదునెక్కిన పాట', 'మేమే', 'మొగి' వంటి కవితా సంకలనాలలో వచ్చిన నా కవిత్వమంతా కలిపి 'ఎన'గా వచ్చింది. ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ ముఖచిత్రాన్ని వేశారు. అప్పటికే ఆయన 'మేమే', 'మొగి' కవితా సంకలనాలకు ముఖచిత్రాలు వేసి ఉండడంతో నా పుస్తకానికి కూడా ఆయననే ఎంచుకున్నాను.


తెలంగాణ జీవ కవిగా నాకు పేరు తెచ్చింది

'ఎన'లో కవిత్వమంతా తెలంగాణ ఉత్పత్తి కులాల భాష. ఈ పుస్తకం తెలంగాణ జీవ కవిగా నాకు పేరు తెచ్చింది. అంతకుముందే కొంతమంది మిత్రులు 'బహువచనం', 'మేమే', 'మొగి' కవితా సంకలనాలలో తెలంగాణ భాషను రాశారు. అది కూడా నా కవిత్వానికి ఒక కారణం. ఇంకా అప్పటికి తెలంగాణ మలిదశ రాజకీయ ప్రస్తావన జరగలేదు. 'ఎన' కవితా సంపుటి మీద అనేక వ్యాసాలు, ఉత్తరాలు రావడమే కాకుండా చాలా చర్చ కూడా నడిచింది. 'ఎన' కవితా సంపుటి రాకముందే ఆంధ్రజ్యోతిలో పబ్లిష్ అయిన 'దావా' అనే కవిత గురించి ప్రముఖ కవి సిద్ధార్థ ఆంధ్రప్రభలో తన 'ప్రెజెంట్ టెన్స్' శీర్షికలో అద్భుతంగా విశ్లేషించారు. 'ఎన' వచ్చినాక కూడా అదే ఫీచర్‌లో సిద్ధార్థ మరో రెండు వ్యాసాలు రాశారు.



నా కవిత్వపు లోలోపల నడుచుకుంటూ నా ఎద ముచ్చట్లు విన్న మంచి పాఠకుడు సిద్ధార్థ. ఆ తర్వాత ఆంధ్రజ్యోతిలో థింసా 'దళిత దిక్సూచి.. ఎన' పేరుతో అద్భుతంగా విశ్లేషించారు. 'చింత' సాహిత్య పత్రికలో దెంచనాల శ్రీనివాస్, ఏనుగు నరసింహారెడ్డి భిన్నకోణాల్లో రాశారు. 'ఎన' వచ్చిన తర్వాత దానిపై చాలా ఉత్తరాలు కూడా అందుకున్నాను. సి. నారాయణరెడ్డి చాలా ప్రశంసాపూర్వకమైన ఉత్తరం రాశారు. 'బ్రహ్మ మొహం లోంచి పాదాలు' అనే నా కవితను ఒక అపూర్వ సృష్టి అనీ, 'ఎన' ఒక పస ఉన్న కవితా సంపుటి అనీ, ఇందులో ఉన్న భాషని తాను కొత్తగా చదువుకుంటున్నాననీ ఆయన రాశారు. ఆ తర్వాత ఆవంత్స సోమసుందర్ నాకు ఒక ఉత్తరం రాస్తూ, "కవితా ప్రపంచంలో నా ఇన్నేళ్ల ప్రయాణంలో ఒక్క ముక్క కూడా అర్థం కాకుండా వచ్చిన కవితా సంపుటి మీదే" అన్నారు. బదులుగా నేను "మీ భాష వేరు, తెలంగాణ భాష వేరు. ఇప్పటికైనా అర్థం చేసుకున్నందుకు ధన్యవాదాలు" అని రాశాను. తెలంగాణ భాష పట్ల ఒక ఆత్మగౌరవ చర్చగా ఈ ఉత్తరాలను చూడొచ్చు. నగ్నముని 'ఎన'ను మెకనాస్ గోల్డ్‌గా అభివర్ణించారు. 'ఎన'లోని పద చిత్రాలను చూసి హెచ్చార్కె పెద్ద కవులతో నన్ను పోల్చి ప్రశంసించారు.

> **'ఎన' వచ్చిన తర్వాత దానిపై చాలా ఉత్తరాలు అందుకున్నాను. ఆవంత్స సోమసుందర్ ఒక ఉత్తరం రాస్తూ, "కవితా ప్రపంచంలో నా ఇన్నేళ్ల ప్రయాణంలో ఒక్క ముక్క కూడా అర్థం కాకుండా వచ్చిన కవితా సంపుటి మీదే" అన్నారు. బదులుగా నేను "మీ భాష వేరు, తెలంగాణ భాష వేరు. ఇప్పటికైనా అర్థం చేసుకున్నందుకు ధన్యవాదాలు" అని రాశాను.**



అంబటి సురేంద్ర రాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, శివారెడ్డి, వరవరావు, దర్భశయనం శ్రీనివాసాచార్య, అద్దేపల్లి రామ్మోహన్ రావు వంటి పెద్దవారంతా 'ఎన' ద్వారా నన్ను గుండెలకు హత్తుకున్నారు. దళిత కవి మిత్రులు ఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్ బాబు, పైడి తేరేష్‌బాబు... ఇంకా చాలా మంది కవి మిత్రులు, అభిమానులు నాకు ఉత్తేజాన్నిస్తూ ఉత్తరాలు రాశారు. 'ఎన' లోని కొన్ని కవితలు ఇంగ్లిష్‌లోకి హిందీలోకి అనువాదం అయ్యాయి. ఎక్కిళ్ళు ఎగదన్నుకొస్తుంటే పఠమెక్కి శిగమూగిందే నా 'ఎన' కవిత్వం.

✆ 99481 58163

కొడవటిగంటికి ఏకలవ్యశిష్యుణ్ణి!

– గంగిశెట్టి శివకుమార్

పిల్లల బాధ్యత సమాజ బాధ్యత అని నమ్మి బాల సాహిత్యంలో 58 ఏళ్లుగా ప్రయాణిస్తున్న సాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్. పిల్లల కథల్లో అడవులు, మృగాలు, రాజులే ఇతివృత్తాలుగా ఉన్నా అవి బాలలను అభ్యుదయం వైపు నడిపించగలగాలి, మంచి ఆలోచనలు కల్పించగలగాలి అంటారాయన. ఇప్పటి దాకా పది బాలల కథా సంపుటాలు వెలువరించిన శివ కుమార్ 2025 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో సంభాషణ.

బాలసాహిత్యంతో మీ పరిచయం గురించి చెప్పండి?



నెల్లూరు జిల్లా, రాపూరు మా సొంత వూరు. చెట్టు కింద బళ్ళో నా గురువులు తెలుగు చదవడం రాయడం నాలుగవ తరగతికే బాగా నేర్పించారు. అప్పటి నుండే మా ఊర్లో వున్న గ్రంథాలయానికి వెళ్ళి బాలసాహిత్యాన్ని చదవ సాగాను. అది గమనించి మా నాన్న బొమ్మల రామాయణం, భాగవతం, భారతం కొని తెచ్చి చదివించారు. ఏడవ తరగతి వరకు రాపూరులో చదివిన తర్వాత నాన్నకు ట్రాన్స్‌ఫర్ కావడంతో గూడూరు చేరాను. గూడూరు గ్రంథాలయం లోని బాల సాహిత్యం అంతా చదివాను. తిరుపతిలో యూనివర్సిటీలో ఎం.ఏ చదువుతున్నప్పుడు ప్రొఫెసర్ జి. నాగయ్య బాల సాహిత్యం మీద పరిశోధనకు ప్రోత్సహించి తానే గైడ్‌గా వ్యవహరించారు. బాలల పత్రిక 'చందమామ'లో రెండేళ్ళ పాటు ఉపసంపాదకుడిగా పనిచేశాను. ఎనిమిదవ తరగతి చదివేటప్పుడే మొదటి కథ రాశాను. ఇప్పటికీ రాస్తున్నాను. కొడవటిగంటివారికి నేను ఏకలవ్యశిష్యుణ్ణి. ఆయనలా రాయాలని ఇప్పటికీ ప్రయత్నిస్తుంటాను.

ఇక్కడ బాలసాహిత్యంపై కొంత చిన్నచూపు ఉంది, నిజమేనా?

కొంతమందిలో వుండవచ్చు. అందరిలో కాదు. చిన్ననాటి నుండే మౌలిక భావాలను నాటేది బాల సాహిత్యమే. మొక్కై వంగనిది మానై వంగదు కదా. ఇది చాలామంది ఇప్పుడు గుర్తించి బాల సాహిత్యాభివృద్ధికి దోహదం చేస్తున్నారు. కానీ ఇంకా చాలా జరగాలి. ప్రతి పాఠశాల లోనూ గ్రంథాలయం వుండాలి. పిల్లలకోసం వర్క్‌షాప్‌లు నిర్వహించాలి. తెలంగాణలో పిల్లల చేత రచనలు చేయించి పుస్తకాలుగా ప్రచురిస్తున్నారు. ఆ సంప్రదాయం ఇంకా పెరగాలి. పిల్లల పత్రికల ప్రచురణకు ప్రభుత్వం తోడ్పడాలి.

బాల సాహిత్యం అనగానే బాలలకు మాత్రమే అనీ అనుకోకూడదు. ఈ సాహిత్యాన్ని ఆసక్తిగా చదివే పెద్దలు కూడా ఉంటారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ప్రతి నెలా 'చందమామ' కోసం ఎదురు చూసేవారట. 'చందమామ' ముందు బాలల పత్రికగా ప్రారంభం అయినప్పటికీ క్రమంగా అది 'ఆబాలగోపాల పత్రిక' అయిందని చక్రపాణి గారు చెప్పేవారు.

ఇంటర్వ్యూ:
■ ఈతకోట సుబ్బారావు

కథా సాహిత్యంపై ప్రసంగం

తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ, రూం.నెం. 208లో జూన్ 30 మధ్యాహ్నం 'కథా సాహిత్యం – గ్రామీణ జీవనం' అంశంపై ఆర్. సి. కృష్ణస్వామి రాజు ప్రసంగిస్తారు.

తెలుగు సాహితీ సమితి

పెన్నా పురస్కారాలు

పెన్నా రచయితల సంఘం 2023, 2024 సంవత్సరాలకు గాను ప్రకటించిన కవిత్వ సంపుటాల పోటీలో పాయల మురళీకృష్ణ 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ', మిరప మహేష్ 'పడమటీది నాటకం' కవితా సంపుటులు ఎంపికయ్యాయి. జూలై రెండవ శనివారం నెల్లూరు టౌన్ హాల్ రీడింగ్ రూంలో పురస్కార ప్రదానం జరుగుతుంది.

గోవిందరాజు సుభద్రా దేవి

'మా కథలు 2024'

వేదగిరి రాంబాబు జయంతి నాడు అక్టోబర్ 14న వెలువడే 'మా కథలు 2024' సంకలనంలో ప్రచురణకు 2024లో పబ్లిష్ ఐన కథలను ఆగస్ట్ 18 లోపు అడ్రస్: సి.హెచ్. శివరామ ప్రసాద్, స్వగృహ అపార్ట్‌మెంట్, 'సి' బ్లాక్, జి-2, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్ – 500072కు పంపాలి. వివరాలకు: 93900 85292.

తెలుగు కథా రచయితల వేదిక

'కళామందిరం' వార్షికోత్సవం

తెలుగు భాషా సేవా కార్యక్రమాల కోసం పలమనేరులో నిర్మించిన కళామందిరం మూడవ వార్షికోత్సవ వేడుక జూలై 6న జరుగుతుంది. ఈ సందర్భంగా వందకు పైగా పద్యాలు చెప్పగలిగే 60 మంది పిల్లలకు బహుమతులతోపాటు, తెలుగు భాషా రక్షణకు కృషి చేస్తున్న 15 మందికి వార్షికోత్సవ పురస్కారాలతో సత్కారం ఉంటుంది.

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి

'ఓ మారు వెనక్కి వెళ్ళి రావాలి' కవిత్వం

కె. దివాకరాచారి కవితా సంపుటి 'ఓ మారు వెనక్కి వెళ్ళి రావాలి' ఆవిష్కరణ సభ జూలై 6 ఉ.10 గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. నిఖిలేశ్వర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. సభలో ఎన్. వేణుగోపాల్, నాళేశ్వరం శంకరం, కవి యాకూబ్, పి. జ్యోతి, ఆనంద్ ప్రసంగిస్తారు.

గుడిపాటి



నీవికగా మారాక

బ్రతుకంతా పదహారేళ్ళ ప్రాయంగా తోస్తుంది
బద్ధకమనేది దరిదాపులకైనా రాకుండా పారిపోతుంది
చిరుచిరుచీకట్లలోనే తెల్లవారుతుంది
చిరునవ్వులతోనే ప్రతిరోజూ మొదలవుతుంది

ప్రపంచం పరుగులు తీసే గమ్యాలన్నిటినీ
కంటిచివరి నుంచి చూసి మనసు తలతిప్పుకుంటుంది
మనోలోకమనే కొలనులో ఒక్క రాయైనా విసరకుండా
రోజు గడిచిపోవడం తెలుస్తుంది

కనుల నిండుగా ఒకటే రూపం
మౌనంగా మరల మరల అదే నామం
తిరుగుబోతు మనసుకు ఎటు వెళ్ళినా
అతని చేయి విడువననే పంతం
విరహంలా కనిపించే సంయోగం
విముక్తిని కోరని వైభోగం

సూర్యుడు వెళ్తున్నపుడూ
చంద్రుడు మెల్లమెల్లగా వస్తున్నపుడూ
కనుల ముందు మనోసంద్రాన్ని ఉప్పొంగజేసే
ఒకేఒక దరహాసం
కనులు మూసుకుంటే అతని గాఢాలింగనం
ఎపుడైనా ఒక కలవస్తే
అందులోనూ అతనిదే స్వైరవిహారం

■ టి. శ్రీవల్లీ రాధిక

ఇక వేగంగా..

బీవోటీ విధానంలో ఇన్నర్ రింగ్ రోడ్డు!

రంగం సిద్ధం చేసిన సీఆర్‌డీఏ

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూ సమీకరణ

- అవసరమైన భూములు 1,155.41 ఎకరాలు
- ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం, జీ కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లో..
- కృష్ణా జిల్లాలో గన్నవరం, పెనమలూరు మండలాల్లో భూ సమీకరణ!
- గ్రామ సభలు నిర్వహించేందుకు సన్నద్ధం
- పూర్తికాగానే పక్షం రోజుల్లో టెండర్ల ప్రక్రియ

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ అడుగులు ముందుకు వేస్తోంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో రోడ్డును నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో అవసరమైన 1,155.41 ఎకరాల భూములు సమీకరించేందుకు త్వరలో గ్రామ సభలు నిర్వహించనుంది. అవి పూర్తయిన పక్షం రోజుల్లోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనుంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) పనులకు సీఆర్‌డీఏ రంగం సిద్ధం చేస్తోంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మించేందుకు సిద్ధమవుతోంది. మూడు నెలల్లోపే దీనికి సంబంధించిన టెండర్లు పిలవనుంది. అమరావతి రెండో దశ భూ సమీకరణలో భాగంగా ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆటోమేటిక్‌గా భూ సమీకరణ జరిగిపోతుంది. దాదాపుగా 45 శాతం మేర భూములు ఐఆర్ఆర్‌కు సమకూరనున్నాయి. ఎటొచ్చీ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూములను తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రెండు జిల్లాల్లో కూడా భూ సమీకరణ కిందనే భూములను తీసుకోవాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. దీని కోసం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ పరిధిలోని మండలాల్లో గ్రామ సభలు నిర్వహించనుంది. గ్రామ సభల్లో ఐఆర్ఆర్ ఉద్దేశ్యాన్ని వివరించి, రైతులతో చర్చలు జరిపి వారి అభిప్రాయాలను తీసుకుంటుంది. గ్రామ పంచాయతీల తీర్మానాలను కూడా తీసుకుంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావటానికి మూడు నెలల డెడ్‌లైన్‌ను సీఆర్‌డీఏ నిర్దేశించుకుంది. డెడ్‌లైన్ పూర్తి కాగానే బీవోటీ విధానంలో టెండరు నోటిఫికేషన్‌ను వెలువరించనుంది. బీవోటీ విధానంలో కాబట్టి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు సంస్థ మాత్రమే చేపడుతుంది. ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మించే సంస్థకు నిర్ణీత కాలపరిమితి మేరకు నిర్వహణ చేపట్టి ఆ తర్వాత ప్రభుత్వానికి యాజమాన్య హక్కులను అప్పగిస్తుంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలోనే అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్‌వేలు, ఎయిర్‌పోర్టులు నిర్మిస్తున్నారు.

భూ సమీకరణ జరిగే ప్రాంతాలు?

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం మొత్తం 1,155.41 ఎకరాల భూములు అవసరమవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో మిగతా 6లో..

96.25 కిలోమీటర్లు.. 3,556.17 ఎకరాలు

ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) ప్రాజెక్టు అనేది గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు జిల్లాల పరిధిలో ఉంటుంది. మొత్తంగా 41 గ్రామాల్లో ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ సాగుతుంది. ఎన్టీఆర్ జిల్లాలో ఇన్నర్ రింగ్ రోడ్డు కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ మీదుగా కూడా వెళుతుంది. ఐఆర్ఆర్‌కు సంబంధించిన అలైన్‌మెంట్, డీపీఆర్‌ను గతంలోనే 'స్టుప్' కన్సల్టెన్సీతో సీఆర్‌డీఏ తయారు చేయించింది. ఐఆర్ఆర్‌ను 75 మీటర్ల వెడల్పుతో మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున నిర్మించాలని డీపీఆర్‌ను రూపొందించటం జరిగింది. ఈ ప్రాజెక్టు కోసం 3,556.17 ఎకరాల భూములు అవసరమని ప్రతిపాదించింది. అమరావతి రాజధానిలోని 27 ప్రధాన రహదారులన్నింటినీ అనుసంధానించేలా ఇన్నర్ రింగ్ రోడ్డుకు తుది డీపీఆర్‌ను ఇవ్వటం జరిగింది. స్టుప్ సంస్థ ఇచ్చిన డీపీఆర్ ప్రకారం.. ఐఆర్ఆర్‌ను రెండు దశల్లో చేపట్టేలా నిర్ణయించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఎన్టీఆర్ జిల్లాలో కేతనకొండ దగ్గర ప్రారంభమవుతుంది. కృష్ణా జిల్లాలో చోడవరం దగ్గర ముగుస్తుంది.





మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, ఈవో శీనా నాయక్‌కు బంగారు బోనం అందజేస్తున్న భాగ్యనగర్ ఉమ్మడి దేవాలయాల కమిటీ

బంగారు బోనం

కనకదుర్గమ్మకు సమర్పించిన భాగ్యనగర్ ఉమ్మడి దేవాలయాల కమిటీ

6





జమ్మిదొడ్డి నుంచి భారీ ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి బంగారు బోనంతో వెళ్తున్న భక్తులు



షీటర్లకు ఈ హాజరు



సత్యనారాయణపురంలో ప్రయోగాత్మకంగా అమలు

- పుస్తకాల్లో సంతకాలకు ఇక సెలవు
- త్వరలో అన్ని పీఎస్‌ల్లో అమలుకు రంగం సిద్ధం

ప్రతివారం షీటర్లు పుస్తకాల్లో చేసే సంతకాలకు పోలీసులు సెలవు ప్రకటించబోతున్నారు. హాజరుకు ప్రామాణికంగా ఉండే సంతకాలను ఇక 'ఈ' మెట్లు ఎక్కించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో షీటర్లకు 'ఈ' హాజరును ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. విజయవాడలో అత్యాధునిక హంగులతో నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్ సత్యనారాయణ పురంలో ఈ హాజరు ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లలో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న షీటర్లకు ప్రతి ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఒక్కో పీఎస్ పరిధిలో రౌడీ, కేడీ, సస్పెక్ట్ షీటర్లు ఉంటారు. వారిని ప్రతి ఆదివారం స్టేషన్‌కు పిలుస్తారు. ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు ఈ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తారు. స్టేషన్‌లో ఉన్న పుస్తకంలో వాళ్లంతా సంతకాలు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత వారు కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి వెళ్లాలి. ఇక్కడ టాస్క్‌ఫోర్స్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

పుస్తకాలకు ముగింపు

వివిధ అంశాల్లో సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తున్న కమిషనరేట్ అధికారులు షీటర్ల విషయంలో పుస్తకాలకు ముగింపు పలకాలని నిర్ణయించారు. వివిధ కేసుల్లో ఉన్న నిందితుల వివరాలను పూర్తిగా డిజిటలైజేషన్ ఎప్పటికప్పుడు చేస్తున్నారు. నిందితుల ఫొటోలు, వేలిముద్రలు, ఐరిష్ అంతా డిజిటల్ గూటిలో భద్రంగా ఉంచుతున్నారు. పాత నేరగాళ్ల వివరాలను అప్‌డేట్ చేసి ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ వివరాలను సీసీటీఎన్ఎస్(క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్)లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సీసీటీఎన్ఎస్‌ను మిగతా 6లో..

ఎఫ్ఎస్ఎల్‌కు అద్విక కంప్యూటర్లు

హైదరాబాద్‌లో రెండు కార్యాలయాలు

- విజయవాడ కార్యాలయంలో కొనసాగుతున్న విచారణ
- ఏజెంట్లను పిలిపించి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): అధిక వడ్డీల చెల్లింపును ఎరగా వేసి కోట్లాది రూపాయలు వసూలు చేసిన అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. విజయవాడ ఎన్టీఆర్ కాలనీలో ఉన్న కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను పోలీసులు సీజ్ చేశారు. కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య ఇక్కడే కాకుండా హైదరాబాద్‌లో రెండు చోట్ల కార్యాలయాలు నడుపుతున్నట్టు నిర్ధారించారు. ఈ రెండు కార్యాలయాల బాధ్యతలను ఇద్దరు తమ్ముళ్లకు అప్పగించినట్టు తెలిసింది. ఇప్పటికే ఒక బృందం హైదరాబాద్‌లో ఉండగా, తాజాగా మరో బృందం విజయవాడ నుంచి ఆదివారం బయలుదేరి వెళ్లింది. ఆ రెండు కార్యాలయాల్లో ఉన్న కంప్యూటర్లను సీజ్ చేసి ఇక్కడికి తీసుకొచ్చిన తర్వాత ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని నిర్ణయించారు. ఇప్పటికే కంప్యూటర్లు,



నగరంలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం

ల్యాప్‌టాప్‌ల్లో ఉన్న వివరాలను మొత్తం ఆదిత్య తీసేశాడు. ఇదిప్పుడు పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. ఎలాంటి వివరాలు లేకుండా లెక్కలు తేల్చడం వారికి కష్టంగా మారింది.

బయటకు వస్తున్న బినామీ బాగోతం

ఆదిత్య అంటే లక్షలు కాదు... కోట్లు. అతడితో ఏ డీల్ అయినా కోట్లలోనే ఉంటుంది. ఓ ఏజెంట్ పోలీసుల వద్ద చేసిన వ్యాఖ్య మిగతా 6లో..

'అద్విక' నిధులు ఎక్కడ?

- ఆదిత్య పేరున ఉన్న ఖాతాలన్నీ ఖాళీ

అధిక వడ్డీని ఆశగా చూపి జనం నుంచి అద్విక వసూలు చేసిన కోట్లాది రూపాయలు ఎక్కడ ఉన్నాయి? ఆ కంపెనీ ఎండీ ఆదిత్య బ్యాంకు ఖాతాలన్నీ ఖాళీగా ఉండడం వెనుక ఏం జరిగింది? పోలీసులకు అనేక అనుమానాలను కలిగిస్తున్న ప్రశ్నలివి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రూ.లక్షకు నెలకు రూ.6వేలు వడ్డీని చెల్లిస్తానని చెప్పి అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ ఆదిత్య 1200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇవన్నీ ప్రాథమిక లెక్కలేనని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ కంపెనీకి సంబంధించి ఆదిత్య ఏడు బ్యాంకు ఖాతాలను తెరిచాడు. ఆ ఖాతాలన్నీ ఆయన పేరు మీదే ఉన్నాయి. ఇందులో నాలుగు జాతీయ బ్యాంకుల్లో, మూడు ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్నాయి. ఆయా బ్యాంకుల నుంచి ఈ ఖాతాల వివరాలను పోలీసులు రప్పించుకున్నారు. ఈ ఖాతాల్లో నిల్వలు పెద్దగా లేవని, దాదాపుగా చాలా ఖాతాలు ఖాళీగా ఉన్నాయని పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు సాగిన దర్యాప్తులో ఆదిత్య ఈ నిధులను హవాలా మార్గంలో దుబాయిలోని కబానా ట్రేడింగ్ కంపెనీకి మళ్లించినట్టు తేలిన విషయం తెలిసిందే. ఈ డబ్బులతో ఆదిత్య భారీగా బంగారం కొనుగోలు చేసినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ బంగారాన్ని ఎక్కడ దాచాడన్న విషయంపై కూపీ లాగుతున్నారు. దీనిపై పదేపదే విచారించినా తాను ఎలాంటి బంగారం కొనుగోలు చేయలేదని ఆదిత్య చెప్పినట్టు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఆ డబ్బంతా ఎక్కడ దాచాడన్న విషయాన్ని బయట పెట్టాల్సి ఉంటుంది. ఒక బృందం దీనిపైనే పనిచేస్తోంది.


నిర్లక్ష్యపు జాడ్యం!

జిల్లా పరిషత్ కార్యాలయానికి నిర్లక్ష్యపు జాడ్యం పట్టుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఆరు నెలల కాలంలో పది మంది వరకు జూనియర్ అసిస్టెంట్లు బదిలీపై వస్తే నేటి వరకు వారికి సీట్లు కేటాయించకపోవడంతో రోజూ వచ్చి ఖాళీగా కూర్చుని వెళ్తున్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన డీడీవోల జీపీఎఫ్, ఎంపీడీవోల సర్వీస్‌మేటర్, ఉద్యోగుల పీఎఫ్ తదితర ఫైళ్లు సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా పరిషత్‌లో అస్తవ్యస్తంగా పాలన

బదిలీపై ఆరు నెలల కాలంలో 10 మంది జూనియర్ అసిస్టెంట్ల రాక

- నేటి వరకు కేటాయించని విధులు, బాధ్యతలు!
- కార్యాలయానికి వచ్చి ఖాళీగా కూర్చుని వెళ్తున్న ఉద్యోగులు
- పెండింగ్‌లో డీడీవోల జీపీఎఫ్, ఎంపీడీవోల సర్వీస్‌మేటర్, ఉద్యోగుల పీఎఫ్ ఫైళ్లు
- జెడ్పీలో అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు





జెడ్పీ కార్యాలయం

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం: జిల్లా పరిషత్‌కు ఆరు నెలలు, మూడు నెలలు, గత 20 రోజుల వ్యవధిలో జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులు 10 మందికిపైగా బదిలీపై వచ్చారు. వీరికి ఇంత వరకు ఎక్కడ పనిచేయాలో చెప్పకుండా, జెడ్పీలోని వివిధ విభాగాలకు కేటాయించకుండా అధికారులు వదిలేశారు. దీంతో బదిలీపై వచ్చిన ఉద్యోగులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏదైనా అత్యవసరమైన పని ఉంటే వీరిని కొన్ని సెక్షన్‌లలో ఒకటీ రెండు రోజులు వాడుకుని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో పదిమందికిపైగా ఉద్యోగులు కార్యాలయానికి వచ్చి మిగతా 6లో..

సూపరింటెండెంట్ల పదోన్నతుల వేళ జాప్యమే!

మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే సూపరింటెండెంట్లకు పదోన్నతులు ఇచ్చే సమయంలో గత రెండు, మూడు సంవత్సరాలుగా వారి పనితీరు, ఎదుర్కొన్న ఆరోపణలు, అవినీతి అంశాలు, ఏసీబీ కేసులు తదితర వివరాలు గుట్టుచప్పుడు కాకుండా తెలుసుకుని ఉన్నతాధికారులకు అన్ని ఆధారాలతో నివేదికలు పంపాలి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల జెడ్పీ కార్యాలయాల నుంచి ఈ నివేదికలు ముందస్తుగానే పంపగా, కృష్ణాజిల్లా నుంచి మాత్రం ఆలస్యంగా పంపారని జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేసే ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. జిల్లా పరిషత్‌లో పరిపాలన సజావుగా సాగేందుకు ఖాళీగా ఉంటున్న ఉద్యోగులకు సీట్లు కేటాయించి, వారితో పనిచేయిస్తేనే పరిపాలన కొంతమేర అయినా గాడిలో పడుతుందని, జిల్లాస్థాయి అధికారులు ఈ అంశంపై దృష్టిసారించాలని జెడ్పీ ఉద్యోగులు కోరుతున్నారు.

మాటు వేశాడు.. మట్టుపెట్టాడు



హతుడు రాము(ఫైల్)

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణ హత్య

- తలపై కొట్టి హత్య చేసినట్టు అనుమానం
- ఎ.కొండూరు మండలం రేపూడిలో ఘటన
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

ఎ.కొండూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన ఎ.కొండూరు మండలం రేపూడిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణ కథనం ప్రకారం.. కూనపరాజుపర్వ గ్రామానికి చెందిన ఒక మహిళకు ఎ.కొండూరు మండలం మాధవరం గ్రామానికి చెందిన అదూరి చార్లెస్‌తో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. అయితే రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన కట్టా రాము (46) పరిచయం అవ్వడంతో అతనితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అప్పటి నుంచి చార్లెస్‌ను దూరం పెడుతూ వచ్చింది. ఈ క్రమంలో రాముపై చార్లెస్ కక్ష పెంచుకొన్నాడు. తన ప్రియురాలిని తనకు కాకుండా చేసిన రామును ఎలాగైనా మట్టు మిగతా 6లో..

కనకదుర్గా నగర్‌లో ఆక్రమణల తొలగింపు పూర్తి

- భక్తులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు
- ఈవో శీనానాయక్ వెల్లడి



6

రాజధానిలో పనుల పరిశీలనకు

- ప్రపంచ బ్యాంకు బృందం రాక

పారదర్శకంగానే ఆశా నియామకాలు

» డీఎం అండ్ హెచ్‌వో సుహాసిని

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్త ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది వ్యక్తులు డబ్బులు వసూలుచేస్తూ మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆశాకార్యకర్తల నియామకం కోసం ఈనెల 25న నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ మార్గదర్శకాల ప్రకారం నియామక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. జిల్లా హెల్త్‌సొసైటీ ద్వారా మెరిట్ ఆధారంగా నియామకాలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

ప్రతాప్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స



వినోద్ భువియన్‌తో డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాంచీకి చెందిన వినోద్ భువియన్‌కు ప్రతాప్ ఆసుపత్రి వైద్యులు అరుదైన చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. బాధితుడు విశాఖపట్నంలో పనిచేస్తుండగా కాలికింద భాగంలో తీవ్ర గాయమైంది. స్థానిక వైద్యులను సంప్రదించగా కాలును తీసేయాలని సూచించగా.. బాధితుడు విజయవాడ రామచంద్రనగర్‌లోని ప్రతాప్ ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించాడు. డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల(చీఫ్ ప్లాస్టిక్ సర్జన్), జాస్తి నవీన్‌చంద్ర(ఆర్థోపెడిక్) క్లిష్టమైన మైక్రో వాస్కులర్ ఏఎల్టీ ఫ్రీఫ్లాప్, ఇలిజారోవ్ రింగ్ ఫిక్సేటర్ శస్త్రచికిత్సను నిర్వహించి కాలును పునరుద్ధరించారు. బాధితుడు రెండువారాల్లో తిరిగి నడుస్తున్నట్టు డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల తెలిపారు.

న్యాయవాదులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

విజయవాడ లీగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాద వృత్తి జీవనాధారంగా ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని సీపీఐ న్యాయవాదుల శాఖ మహాసభ తీర్మానించింది. 14వ మహాసభ ఆదివారం సూర్యారావుపేటలోని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ఎంఏ షరీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడి సాధించుకొన్న చట్టాలను నిర్వీర్యం చేస్తు ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ పరం చేస్తున్నాయని అన్నారు. జూలై 16, 17 తేదీల్లో నగర మహాసభలు, ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబరులో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగనున్నాయని వివరించారు. సీపీఐ న్యాయవాదుల శాఖ నూతన కార్యదర్శిగా చలసాని అజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కె.మధుసూధనరావు, జి.శ్రీనివాసరావు ఎంపికయ్యారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం విజయవంతం చేయాలి

» పశ్చిమ విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఇది మంచి ప్రభుత్వం.. అనే నినాదంతో జూలై 2 నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన విధానాలు తెలుసుకోవాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని చిన్ని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. వన్‌టౌన్ పంజా సెంటర్‌లోని షాజహూర్ ముసాఫర్‌ఖానాలో ఆయన పశ్చిమ నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న పథకాలన్నింటినీ, గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మోసాలను ప్రతి టీడీపీ కార్యకర్త, నాయకుడు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ, సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగుల్‌మీరా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బడుగు బలహీనవర్గాల వారు సంతోషంగా ఉన్నారని చెప్పారు. నాగుల్‌మీరా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు సీహెచ్ శ్రీనివాసరావు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, కార్పొరేటర్లు ఉమ్మడి వెంకటేశ్వరరావు, అబ్దుల్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్ : భారతీయ సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో నెలనెలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'దృశ్యావేదిక' ఆధ్వర్యంలో ఆదివారం సంప్రదాయ నృత్య, సమాజాన్ని ఆలోచింపజేసే నాటికను ప్రదర్శించారు. మొదటి భాగంగా జయశ్రీ కూచిపూడి కథ నృత్య నిలయం శిష్యులు పలు అంశాలు ప్రదర్శించారు. చదలవాడ ఆనంద్ నృత్యరూకల్పన అందించారు. రెండో భాగంగా స్వర్ణ సూర్య డ్రామా లవర్స్, హైదరాబాద్ వారు 'సాహితీ సూక్తం' అనే సామాజిక నాటికను ప్రదర్శించారు. ఉదయ్ భాగవతుల రచించి, దర్శకత్వం వహించారు. కళాకారులను దృశ్యవేదిక సత్కరించింది.

ఎఫ్ఎస్ఎల్‌కు అద్విక కంప్యూటర్లు

(5వ పేజీ తరువాయి)

ఇది. పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న బాధితులతో మాట్లాడినప్పుడు కొత్త కొత్త విషయాలు బయట పడుతున్నారు. అద్వికలో పెట్టుబడులు పెట్టిన వారిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పేర్లు బయటపడుతున్నాయి. వాళ్లంతా స్నేహితులు, పరిచయస్తుల పేర్ల మీద ఈ పెట్టుబడులు పెట్టించారని ప్రచారం జరుగుతోంది. దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ఈ విభాగం నుంచే ఎక్కువగా ఫోన్లు వస్తున్నాయి. అసలు ఆదిత్యపై కేసు నమోదు చేశారా, ఖాతాలు ఏమైనా స్తంభింపచేశారా, ఆ ఖాతాల్లో ఎంత మొత్తం నగదు నిల్వలు ఉన్నాయి అన్న వివరాలను చాలా శ్రద్ధగా అడిగి తెలుసుకుంటున్నారు. కొంతమంది కోసం రాజకీయ నేతలు ఫోన్లు చేస్తున్నారు.

కార్యాలయంలో సుదీర్ఘ విచారణ

ఆదిత్యను పోలీసులు ఎన్టీఆర్ కాలనీలో ఉన్న అద్విక కార్యాలయంలో ఆదివారం సుదీర్ఘంగా విచారించారు. సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదరరావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు, మాచవరం ఎస్ఐలు ఉదయం నుంచి రాత్రి వరకు విచారించారు. ఆదిత్య ఫోన్‌ను సీజ్ చేసిన పోలీసులు అందులో వాట్సాప్ చాటింగ్‌ను కాంటాక్ట్ నంబర్లవారీగా పరిశీలిస్తున్నారు. దీని ద్వారా అద్వికలోకి భారీగా పెట్టుబడులను రప్పించిన పది మంది ఏజెంట్లను గుర్తించారు. వాళ్లందరిని అద్విక కార్యాలయానికి పిలిపించారు. ఒక్కొక్కరి వాంగ్మూలం తీసుకున్నారు. ఎవరెవరి నుంచి ఎంతెంత సొమ్ములను ఇందులో పెట్టుబడిగా పెట్టించారో రాబట్టారు. కొంతమంది ఏజెంట్లు కమీషన్ల రూపంలో ఆదిత్య నుంచి భారీగానే లాగేసినట్టు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఏజెంట్‌గా వ్యవహరిస్తూ రూ.25కోట్లు పెట్టుబడులుగా పెట్టించాడు.

రాజధానిలో పనుల పరిశీలనకు

ప్రపంచబ్యాంకు బృందం రాక

» నేడు సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం

» రాజధానిలో నిర్మాణాలు, రోడ్ల పరిశీలన

» నిధుల కోసం బ్యాంకులు, రుణసంస్థలతో సీఆర్‌డీఏ చర్చలు

» మూడు నెలల్లో ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల పరిశీలనకు ప్రపంచ బ్యాంకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ మిషన్ టీమ్ విజయవాడ వచ్చింది. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, అధికారులతో సోమవారం ఈ బృందం ప్రాజెక్టు పనులపై సమీక్ష జరపనుంది. ఇటీవలే ప్రపంచబ్యాంకు సీఆర్‌డీఏకు రూ.5 వేల కోట్ల నిధులిచ్చింది. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన తర్వాత పనులు కూడా జరుగుతున్నాయి. వీటిలో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టేవి సింహభాగం ఉన్నాయి. ఈ పనులకు సంబంధించి ప్రపంచబ్యాంకు బృంద సభ్యులు అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటారు. సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం తర్వాత ప్రపంచబ్యాంకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్టు మిషన్ టీమ్ రాజధానిలో క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల పనులను పర్యవేక్షిస్తుంది. హెచ్‌వోడీ టవర్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, అఖిలభారత సర్వీసు (ఏఐఎస్) టవర్లు, మంత్రులు, హెచ్‌వోడీల బంగళాలతో పాటు రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తుంది. ఈ పరిశీలనను బట్టి మలివిడత నిధుల విడుదలకు సానుకూలత ఏర్పడుతుంది.

రుణ సంస్థలతో సీఆర్‌డీఏ చర్చలు

అమరావతిలో ప్రస్తుతం సొంత నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు పనులు, ఇంకా తలపెట్టాల్సిన అనేక ప్రాజెక్టు పనులకు సంబంధించి అవసరమైన నిధుల కోసం సీఆర్‌డీఏ అధికారులు రుణ సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే బ్యాంకుల కన్సార్టియంతో చర్చలు ప్రారంభించారు. బ్యాంకులు రుణాలు ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాల పూచీకత్తుగా రుణాలు ఇవ్వటం జరగదు. ఆ స్థలాల్లో ఏదైనా నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటే, రుణాలు ఇస్తాయి. ఇప్పటికిప్పుడు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాలంటే గ్రౌండ్ వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. అందుకే సీఆర్‌డీఏ అధికారులు రాజధాని భూముల్లో నిర్మాణ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణల ప్రకారం రెసిడెన్షియల్, కమర్షియల్ స్పేస్ అభివృద్ధికి ముందుకు వచ్చే సంస్థలకు సంబంధించి త్వరగా అగ్రిమెంట్లు కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. భూముల్లో నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంటే రుణాలు వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఆర్‌డీఏ అధికారులు బ్యాంకింగ్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. బ్యాంకర్లతోనే కాకుండా ప్రైవేట్ ఫైనాన్షియల్ సంస్థలు, విదేశీ సంస్థలు, ఇతర పద్ధతుల్లో కూడా నిధుల సమీకరణ జరిపేందుకు కసరత్తులు చేస్తున్నారు.

వర్గరహిత దృక్పథమే శ్రీశ్రీ కవిత్వం : ఇంతియాజ్

విజయవాడ కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆకలిరాజ్యం సినిమాలో శ్రీశ్రీ కవితలు విని ఆయన సాహిత్యంపై అభిమానం పెంచుకున్నానని, వర్గభేదాలు లేని సమాజాన్ని ఆయన ఆశించారని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అన్నారు. నగరంలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ భవనంలో జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ డిజిగ్రేటెడ్ సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభికి సత్కార సభ జరిగింది. ఆత్మీయ అతిథిగా ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఇంతియాజ్ పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ న్యాయవాది చేకూరి శ్రీపతిరావు చేతుల మీదుగా పట్టాభికి శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం పుస్తకాన్ని అందజేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, డాక్టర్ వెన్నా వల్లభరావు, శ్రవణం కనకారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, చింతా వెంకటేశ్వర్లు, సుదర్శనరాజు, ఎం.అంజయ్య మహాప్రస్థానం పుస్తకాన్ని అతిథులకు బహూకరించారు. ఇంతియాజ్ రచించిన పుస్తకాలను పట్టాభికి అందించారు. సత్కార గ్రహీత పట్టాభి ప్రసంగించారు.





జేసీబీలతో కనకదుర్గానగర్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

కనకదుర్గా నగర్‌లో..

ఆక్రమణల తొలగింపు పూర్తి

» భక్తులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు

» ఈవో శీనానాయక్ వెల్లడి

ఇంద్రకీలాద్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6న అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తురాలిని కొబ్బరికాయ ధరపై ప్రశ్నించినందుకు వీధి వ్యాపారులు దాడిచేసి గాయపరచిన ఘటనపై దుర్గగుడి ఈవో తీవ్రంగా స్పందించారు. ఘటనపై వన్‌టౌన్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. దీంతో అనధికార వ్యాపారాలపై అధికార యంత్రాంగం ఆరా తీసింది. దేవస్థానం టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలపై దేవస్థానం రికార్డులు పరిశీలించగా.. అర్జున వీధి నుంచి రథంసెంటర్ మార్గంలో సుమారు రూ.2కోట్లు దేవస్థాన నిధులతో 2016లో కొనుగోలు చేసిన స్థలం విషయం వెలుగుచూసింది. దీనిపై ఈవో ఆరా తీయగా అప్పట్లో రూ.కోట్లతో కొనుగోలు చేసిన స్థలం ఆక్రమణలకు గురికావడం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన ఈవో ఆక్రమణల తొలగింపుపై దేవదాయ శాఖ కమిషనర్, కలెక్టర్, పోలీసు, మునిసిపల్ కమిషనర్‌లకు ఈనెల 12న లేఖ రాశారు. 19న సంయుక్త సర్వే నిర్వహించి, స్థలం ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు సూచించారు. స్వచ్ఛందంగా పలువురు వ్యాపారులు ఖాళీచేసి తమ సామగ్రిని తీసుకువెళ్లారు. శనివారం నుంచి ఆదివారం వరకు ఆక్రమణల తొలగింపు కొనసాగింది. దేవస్థానం టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు జేసీబీలతో చదును చేసి, దేవస్థానం సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. దీనికోసం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్, ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో కోర్‌టీమ్ ఏర్పాటు చేశారు. వీరు ఆక్రమణల తొలగింపుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ దుర్గారావు ఆధ్వర్యంలో అడిషనల్ డీసీపీ రామకృష్ణ పర్యవేక్షణలో పోలీస్ భద్రత కొనసాగించారు.

ఆక్రమణ తొలగింపుపై ఈవో వివరణ

ఇంద్రకీలాద్రి ప్రాంత ఆక్రమణల తొలగింపు విషయంలో అన్ని విధాలుగా ఆలోచించి ముందుకుసాగుతున్నాం. అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయడానికే ఆక్రమణలు తొలగించాం. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలతో భక్తులు అసహనానికి గురవుతున్నారు. ఆక్రమణల తొలగింపుతో సుమారు వంద కార్లకు పార్కింగ్ స్థలం వచ్చింది. చిరు వ్యాపారుల సామగ్రిని ఇతర ప్రదేశాలకు తరలించడానికి ఆటోలు, మినీ వ్యాన్‌లు దేవస్థానమే ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యం కోసం మున్ముందు మరింత అభివృద్ధి పనులు చేపడతాం.

ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయి పురస్కారాలు

» మూడు విభాగాల్లో పోటీలు

» ఎంట్రీలకు చివరి తేదీ జూలై 31

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా విశేష ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్ల నుంచి జిల్లాస్థాయి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31వ తేదీలోగా ఎంట్రీలు పంపాల్సి వుంటుందని తెలిపారు. మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయని, మొదటివిభాగంలో జిల్లాలోని పర్యాటకప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్టీఆర్, యోగాంధ్ర అంశాలు, రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం-2, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో లపై పోటీ వుంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ (రూ.10 వేలు), ద్వితీయ (రూ.7 వేలు), తృతీయ (రూ.4 వేలు) బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక విభాగం నుంచి మూడు ఫొటోలు, మొత్తం తొమ్మిది ఫొటోలు పంపవచ్చన్నారు. 2024, జూన్ 12 నుంచి 2025 జూలై 31 మధ్య తీసిన ఫొటోలు, సైజు 12/10 ఉండి.. ఎన్టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలన్నారు. ఉత్తమ ఫొటోల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని, ఎంట్రీలను డీపీఆర్వో కార్యాలయం చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా పంపవచ్చని, ఇతర వివరాలకు 9121215373లో సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



కళ్లేపల్లి మధుసూదన్‌రాజు దంపతులను సత్కరిస్తున్న విద్యాసాగర్

గ్రంథాలయాల పునరుద్ధరణలో

కళ్లేపల్లి పాత్ర మరువలేనిది

» ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

విద్యాధరపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూతపడుతున్న గ్రంథాలయాలను పునరుద్ధరించిన వ్యక్తి కళ్లేపల్లి మధుసూదనరాజు అని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం విద్యాధరపురం సితార సెంటర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో గ్రేడ్-3 అధికారి, గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదన్‌రాజు ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా అలపర్తి విద్యాసాగర్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, మధుసూదన్‌రాజు గ్రంథాలయ శాఖలో చిరుద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి గ్రంథాలయ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేయటం అసాధారణ విషయమన్నారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ, మధుసూదనరాజు గ్రంథాలయాల పురోభివృద్ధికోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల సంచాలకులు కృష్ణమోహన్ మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయటమే కాకుండా ప్రభుత్వంతో చర్చించి మూతపడుతున్న గ్రంథాలయాలను పునరుద్ధరించిన నాయకుడు మధుసూదన్‌రాజు అని కొనియాడారు. అనంతరం మధుసూదన్‌రాజు, పార్వతి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ బండారు హనుమంతరావు, సినీ నటుడు శోభన్‌బాబు మేనల్లుడు వేగే రాజా, గ్రంథాలయాల డిప్యూటీ డైరెక్టర్ పీర్ అహ్మద్, వివిధ జిల్లాల గ్రంథాలయాల అధ్యక్షులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సెమినార్‌కు నలుగురు చైర్‌పర్సన్ల ఎంపిక

జగ్గయ్యపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హర్యానాలోని గురుగ్రామ్‌లో జులై 3, 4 తేదీల్లో భారత పార్లమెంట్, హరియాణా ప్రభుత్వ సహకారంతో 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అంశంపై నిర్వహిస్తున్న జాతీయస్థాయి సెమినార్‌కు జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, తిరువూరు మునిసిపాలిటీ నుంచి కొలికలపూడి నిర్మల, కొండపల్లి మునిసిపాలిటీ నుంచి చెన్నుబోయిన చిట్టిబాబులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

మాటు వేశాడు.. మట్టు పెట్టాడు

(5వ పేజీ తరువాయి)

పెట్టాలని నిర్ణయించుకుని అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం రాము సదరు మహిళతో కలిసి ఎ.కొండూరు మండలం రేపూడి శివారులో ఎన్ఎస్పీ కాలువ పక్కన ఉన్న ఒక మామిడి తోటలోకి వెళ్లాడు. అక్కడ వీరు ఉన్న విషయాన్ని పసిగట్టిన చార్లెస్ చాటుగా వెళ్లి బండరాయితో రాము తలపై బలంగా మోదడంతో రాము అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. రాము చనిపోయిన తర్వాత చార్లెస్, సదరు మహిళా అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాము కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో అటువైపుగా వెళ్తున్న వారు మామిడి తోటలో నుంచి దుర్వాసన రావడం గమనించి పోలీసులకు ఆదివారం సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు రాము మృతదేహంగా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడే పంచనామా నిర్వహించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యపు జాడ్యం!

(5వ పేజీ తరువాయి)

ఖాళీగా కూర్చుని వెళ్లిపోతున్నారు. జెడ్పీ అధికారులు మాత్రం బదిలీపై వచ్చిన ఉద్యోగులకు ఆయా విభాగాల్లో సీట్లు మాత్రం కేటాయించకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ పంపిన ఫైళ్లను జెడ్పీ సీఈవో నిబంధనలకు విరుద్ధమని పక్కన పెట్టడం, సీఈవో నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ వద్దకు వెళ్లిన ఫైళ్ల ఆమోదానికి నోచుకోకపోవడం ఆనవాయితీగా మారిందని జెడ్పీ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

అధికారుల సర్వీస్ మేటర్ ఫైళ్లు పెండింగ్‌లోనే..

జిల్లా పరిషత్‌లో గత రెండు, మూడు సంవత్సరాలుగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పరిపాలనలో అనుభవం ఉండి, ఫైళ్లను చకాచకా తయారు చేసే నైపుణ్యం ఉన్న సీనియర్ ఉద్యోగులంతా వివిధ కారణాలతో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి బయటి ప్రాంతాలకు బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. వారి స్థానంలో జూనియర్‌లు వచ్చారు. వీరికి ఆయా సెక్షన్‌లలో పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించకపోవడంతో జిల్లాపరిషత్ యాజమాన్యంలో పనిచేసే అధికారులు, సిబ్బందికి సంబంధించిన ఫైళ్లు దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉండి పోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

డీఎల్‌డీవోలు స్వయంగా వచ్చి ఫైళ్లు చూసుకునే దుస్థితి

ఇటీవల కాలంలో డీఎల్‌డీవో(డీడీవో)లకు సంబంధించి జీపీఎఫ్ ఫైళ్లు జిల్లా పరిషత్‌కు వచ్చాయి. వీటిని సరిచూసి పంపాల్సి ఉండగా పెండింగ్‌లో పెట్టారు. దీంతో డీఎల్‌డీవోలు స్వయంగా జెడ్పీ కార్యాలయానికి వచ్చి సంబంధిత ఫైళ్లను సరిచేసుకున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్ ఖాతాల వివరాలు తెలియజేసేవారే లేరని, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ఫైళ్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండి పోయాయని ఉద్యోగులు అంటున్నారు. జిల్లాలో పనిచేసే ఎంపీడీవోల సర్వీస్ మేటర్ ఫైళ్లు కూడా దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఎంపీడీవోలు జెడ్పీ డిప్యూటీ సీఈవో వద్దకు వెళ్లి లేదా ఫోన్‌లో సంప్రదించి తమ సర్వీస్‌మేటర్‌లకు సంబంధించిన అంశాలను త్వరితగతిన పూర్తిచేయాలని పదేపదే కోరుతున్నారని తెలిసింది.

ఇక వేగంగా..

(5వ పేజీ తరువాయి)

ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో దాములూరులో 29.9 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలో 7.17 ఎకరాలు, జూపూడిలో 0.23 ఎకరాలు, కేతనకొండలో 58.33 ఎకరాలు, కొండపల్లిలో 93.40 ఎకరాలు, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో 100.65 ఎకరాలు, కొటికలపూడిలో 37.41 ఎకరాలు, నవీపోతవరంలో 30.33 ఎకరాలు, త్రిలోచనాపురంలో 20.15 ఎకరాలు, జమీ మాచవరంలో 3.31 ఎకరాలను సమీకరించనున్నారు. జీ కొండూరు మండలంలో కవులూరు గ్రామంలో 74.83 ఎకరాలు, వెలగలేరు గ్రామంలో 2.85 ఎకరాలు, విజయవాడ రూరల్ మండలంలో దోనె ఆత్కూరు గ్రామంలో 19.43 ఎకరాలు, కొత్తూరు గ్రామంలో 55.15 ఎకరాలు, నున్నలో 96.86 ఎకరాలు, పాతపాడులో 48.57 ఎకరాలు, తాడేపల్లిలో 16.25 ఎకరాలు, నిడమానూరులో 73.96 ఎకరాలను సమీకరించనున్నారు. కృష్ణా జిల్లా విషయానికి వస్తే గన్నవరం మండలం పరిధిలో రామచంద్రాపురంలో 5.25 ఎకరాలు, వెదురుపావులూరు గ్రామంలో 132.86 ఎకరాలు, సావారిగూడెంలో 18.71 ఎకరాలను సమీకరిస్తారు. పెనమలూరు మండలం చోడవరం గ్రామంలో 85.91 ఎకరాలు, గంగూరులో 5 ఎకరాలు, పెనమలూరులో 49.62 ఎకరాలు, పోరంకిలో 89.27 ఎకరాల చొప్పున సమీకరించనున్నారు.

షీటర్లకు ఈ హాజరు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించడానికి ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా నియమించారు. ఇటీవల అత్యాధునిక హంగులతో నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఒక బయోమెట్రిక్ పరికరం ఏర్పాటు చేశారు. బహుళ ఉపయోగాలు ఉండేలా దీన్ని అమర్చారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి హోంగార్డు వరకు హాజరు నమోదుకు ఈ బయోమెట్రిక్ పరికరం ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఇందులోకి షీటర్లను తీసుకొచ్చారు. ప్రతివారం కౌన్సెలింగ్ నిర్వహించినప్పుడు కేటగిరి వారీగా కాగితాలను చూసుకుని ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. వచ్చిన వాళ్లతో పుస్తకాల్లో సంతకాలు చేయించుకుంటున్నారు. ఈ ప్రక్రియ వల్ల సమయం వృథా అవుతోంది. ఇప్పుడు కౌన్సెలింగ్‌కు వచ్చిన షీటర్లను బయోమెట్రిక్ ముందు నిలబెడుతున్నారు. వారి ఐరిస్‌స్కాన్ అవ్వగానే హాజరు నమోదవుతోంది. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు 16, డెకాయిట్ షీటర్లు 5, కేడీ సీట్లు 6, సస్పెక్ట్ 58, క్రైం సస్పెక్ట్ 75 మంది ఉన్నారు. ఆదివారం కౌన్సెలింగ్‌కు వచ్చిన వాళ్లందరితో ఐరిస్ ద్వారా హాజరు నమోదు చేశారు. ఎంతమంది కౌన్సెలింగ్‌కు వచ్చారు, ఎంతమంది గైర్హాజరు అయ్యారన్న విషయం అధికారులకు కంప్యూటర్‌లో టక్కున తెలుస్తుంది.

బంగారు బోనం

ఇంద్రకీలాద్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న కనకదుర్గమ్మకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ భాగ్యనగర్ మహంకాళీ జాతర ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆదివారం మేళతాళాలతో అంగరంగ వైభవంగా తరలివచ్చి బంగారు బోనం సమర్పించింది. 500 మంది భక్తులు నగరంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. తొలుత జమ్మిదొడ్డిలో బంగారు బోనానికి కమిటీ సభ్యులతో కలిసి దుర్గగుడి ఈవో శీనానాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అట్టహాసంగా ఊరేగింపు బయలుదేరింది. బంగారు బోనం ఎత్తుకున్న మహిళలు అమ్మవారి నామస్మరణ చేస్తూ దుర్గామల్లేశ్వర దేవస్థానం సమకూర్చిన చిన్నారుల నెమలి నృత్యాలు, గరగ నృత్యాలు, తప్పెట్లు, కోలాటాలు, సంప్రదాయ భజనలతో ముందుకు సాగారు. జమ్మిదొడ్డి నుంచి బ్రాహ్మణ వీధి, రథం సెంటర్, దుర్గాఘాట్, ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకున్నారు. కొండపైన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఈవో శీనానాయక్ వేద మంత్రోచ్ఛరణల నడుమ బంగారు బోనాన్ని స్వీకరించి అమ్మవారికి సమర్పించారు. తెలుగు రాష్ట్రాలు పాడిపంటలతో, సుఖ శాంతులతో వర్ధిల్లేలా ఆశీర్వదించాలని బంగారు బోనం సమర్పించిన కమిటీ సభ్యులు కోరుకున్నారు.

వీనులవిందుగా 'తెలియని రాగం పలికింది'

విజయవాడ కల్చరల్ : 'తెలియని రాగం పలికింది' అనే సంగీత విభావరి వీక్షకులకు మధురానుభూతిని అందించింది. నగరంలోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ గాయకులు మేకల పురుషోత్తమ ప్రసాద్, శిరీష, విష్ణుప్రియ, మల్లీశ్వరి తదితరులు తమ గాత్రంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. వ్యాఖ్యాతగా బిల్లా అశోక్ ఆకట్టుకున్నారు. ఆయన్ను డ్రీమ్ ఆడియో సంస్థ ఘనంగా సత్కరించి 'బహుగళ గాన కళానిధి' అనే బిరుదును అందజేసింది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102,110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

ఆదమరిస్తే అంతే..!

భారతీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చూ డడానికి చిన్న సమస్య గానే ఉన్నా ఆదమరిస్తే ప్రాణాలకే ప్రమాదకరంగా మారుతుంది. గురు నానక్ రోడ్డు నుంచి వాసవీ నగర్ కాలనీలోని వెళ్లే దారిలో అండర్ గ్రౌండ్ డ్రెయిన్ సమీపం లో రోడ్డు ధ్వంసం కావడంతో గుంత ఏర్పడింది. వాసవీ నగర్ కాలనీకి ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రధాన రోడ్డులో గుంత ఏర్పడి రాకపోకలకు ప్ర మాదకరంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రమాదం జరగకుండా ఏర్పాటు చేసిన బారికేడ్

అథ్లెట్లకు ఎంపీ శివనాథ్ అభినందన

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 29: రాష్ట్రాన్ని యోగాంధ్రప్రదేశ్‌గా చేసేందుకు సహకరించిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం యోగాసన అథ్లెట్స్ ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 21న విశాఖలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న అథ్లెట్స్ పీ వెంకట త్రివేణి, పీ భార్గవి, ఎం అక్షయ్, బీ అనూష, ఏ పూజితను, న్యూఢిల్లీలో గత ఏప్రిల్‌లో జరిగిన 2వ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన టీకే రాములు, బీ శిరీష, కావశ్రీ, డీ ధీరజ్ కృష్ణను ఎంపీ అభినందించారు. ఈ సందర్భంగా అథ్లెట్స్ మనోహర్, గణేష్ ప్రదర్శించిన ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనను ఎంపీ తిలకించారు. అనంతరం యోగా అసోసియేషన్ సభ్యులు అక్టోబర్‌లో యోగా కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్టు వివరించగా అందుకు అన్ని విధాల సహకారం అందిస్తానని అన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ రాధిక, గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, పర్వతనేని ప్రేమకుమార్ పాల్గొన్నారు.



కృష్ణలంక పాత పోలీసు స్టేషన్ రోడ్డు నుంచి ఊరేగింపుగా కనకదుర్గమ్మకు ఆషాఢ సారెను తీసుకెళ్తున్న మహిళలు

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

కృష్ణలంక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక పాత పోలీసు స్టేషన్‌రోడ్డులోని రెడ్డెం వెంకటరెడ్డి, చెంచులక్ష్మి దంపతులు మేళతాళాల మధ్య ఊరేగింపుగా కనకదుర్గమ్మకు ఆదివారం ఆషాఢ సారెను తీసుకెళ్లారు. దాదాపు 200 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెంచులక్ష్మి మాట్లాడుతూ ఏటా తమ సత్‌సంఘం మహిళలు దాదాపు 200 మందితో కలిసి కనకదుర్గమ్మకు ఆషాఢ మాసంలో సారెను ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వెన్నా సీతారామిరెడ్డి, నరసమ్మ, శ్రీను, లక్ష్మి, తిరుపతమ్మ, పద్మ, సైకం శివకుమారి, కల్యాణిలక్ష్మి, నమీర పాల్గొన్నారు.



యూత్ జూడో బూత్ జూడో రెండో విడతలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

కృష్ణలంకలో యూత్ జూడో బూత్ జూడో

- ప్రజా సమస్యలు తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు

కృష్ణలంక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సిటీ కాంగ్రెస్ కమిటీ పర్యవేక్షణలో జిల్లా, నగర యువజన కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో యూత్ జూడో బూత్ జూడో రెండో విడత కార్యక్రమం ఆదివారం జరిగింది. ఇందిరమ్మ నగర ప్రజాబాటను స్థానిక 22వ డివిజన్‌లో నేతలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొన్నారు. మహిళలు తమ సమస్యలు వారికి వివరించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ అర్జీలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడతామన్నారు. ఏఐసీసీ సభ్యులు వీ గురునాథం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పీటర్ జోసెఫ్, ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ అన్సారీ, నగర ప్రధాన కార్యదర్శులు అశోక్ షారోన్, సిటీ వాణిజ్య విభాగం ఛైర్మన్ కుసుమంచి గణేష్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జాన్ మక్కల్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పిల్లలు

మొక్కల రక్షణలతో మన భవిష్యత్తు

- సీఐవో రాష్ట్ర అధ్యక్షుడు రఫీఖ్

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 10 లక్షల మొక్కలు నాటే పర్యావరణ ఉద్యమాన్ని ప్రారంభించామని చిల్డ్రెన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీఖ్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఓ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'మట్టిలో చేతులు హృదయంలో దేశం' అనే నినాదం జూన్ 25 నుంచి జూలై 26 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాఠశాలలు, మదర్సాలు, మసీదులు, ఇళ్ల వద్ద మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ నిజామీ, ఎం అక్బర్ బాషా, ముషాహిద్ బేగ్, సీఐవో రాష్ట్ర కన్వీనర్ ఫిర్ద్ అక్తర్ పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన

ధర్నాచౌక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తమకు జీతాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 4 నుంచి శానిటేషన్, డ్రైనేజీ కార్మికులు, వెహికల్ డిపో డ్రైవర్లు, క్లీనర్లు ఈ సమ్మెకు ప్రత్యక్షంగా సంఘీభావం తెలపనున్నట్టు చెప్పారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి టీ ప్రవీణ్, కోశాధికారి స్టీఫెన్‌బాబు పాల్గొన్నారు.



లోపల వైపున తాళం వేసిన వివేకానంద పార్క్, గంజాయి బ్యాచ్ వదిలి వెళ్లిన బ్యాగ్, సిగరెట్ పీకలు, వ్యర్థాల గుట్టలు

గంజాయి బ్యాచ్ అడ్డాగా పార్కులు

పటమట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 11వ డివిజన్ వివేకానంద కాలనీలో తరచూ మైనర్లు వివేకానంద కాలనీలోని పార్క్ గోడలు దూకి లోనికి ప్రవేశించి గంజాయి తాగుతున్నారు. స్థానికులు ప్రశ్నిస్తుండటంతో పారిపోతున్నారు. దీనికి కారణం హైస్కూల్ రోడ్డులోని అప్పారావు పార్క్ వెనుక తెంగెళ్లమూడి వారి వీధిలో ఉన్న వివేకానంద పార్క్ కలిసి ఉండటమే. కొన్ని నెలలుగా ఈ పార్కులు మూసి ఉండటంతో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. ఎప్పుడు చూసినా పార్క్ ముందూ వెనుక తాళం కప్ప వేలాడుతూనే కనిపిస్తుంది. లోపల పిల్లలాడుకునేందుకు ఆట పరికరాలు, పెద్దలు కూర్చునేందుకు బెంచీలున్నాయి. ఉద్యాన శాఖ అధికారులు నిర్లక్ష్యంతో పార్క్ కళావిహీనంగా తయారైంది. వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. హైస్కూల్ రోడ్డులో పార్క్ పక్కనే ఖాళీ ప్రదేశం నుంచి పార్క్‌లోకి ప్రవేశిస్తున్నారు. లక్ష్మీపతి అప్పారావు పార్క్‌లో లైట్లు వెలగపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పార్క్‌లను ఉపయోగంలోకి తేవాలని కోరుతున్నారు.

త్వరలోనే బాగు చేస్తాం: చంద్రశేఖరరావు, డీడీహెచ్

ఉద్యానశాఖ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. కొత్తగా చార్జి తీసుకున్నాను. రెండు, 3 రోజుల్లో పార్క్‌ను బాగు చేయిస్తాం.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

రోగ నిర్ధారణలో అల్ట్రా సౌండ్ ప్రథమస్థానం: డాక్టర్ లక్ష్మి

భారతీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్యవిధానంలో రోగ నిర్ధారణ పరీక్షల్లో అల్ట్రా సౌండ్ ప్రథమ స్థానంలో ఉందని నాగార్జున ఆసుపత్రి వైద్యులు, అనస్తీషియాలజీ (మత్తు మందు) విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ అన్నారు. ఇండియాన్ రేడియోలాజికల్, ఏపీ చాప్టర్ ఇమేజింగ్ అసోసియేషన్, ఆయుష్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం భారతీనగర్‌లోని నోవాటెల్‌లో రాపిడ్ 2025 ది వైద్య సదస్సు (ఆధునిక వైద్యవిధానం) జరిగింది. నాగార్జున ఆసుపత్రి వైద్యులు, డాక్టర్ లక్ష్మీ, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ సూర్యదేవర కేశవరావు బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అల్ట్రా సౌండ్ విధానంలో నైపుణ్యతను ఎలా పరీక్షించాలనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ కే హరి, డాక్టర్ మోహన్‌సాయి, రేడియాలజిస్ట్ డాక్టర్ దండమూడి శ్రీనివాస్, కార్డియాలజిస్టు డాక్టర్ రఘురాం, డాక్టర్ శ్రీకాంత్, తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపులకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- కాపు రిజర్వేషన్ పోరాట సమితి నేతలు

గాంధీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు జనాభా ప్రాతిపదికన 12శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కాపు నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాపు రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమావేశం జరిగింది. సమితి రాష్ట్ర కన్వీనర్లు రావి శ్రీనివాస్, చనమల్ల ప్రసాద్ మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులతో పాటు విద్యా, ఉద్యోగాల్లోనూ 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్‌లోని బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ, ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ తదితర కులాల్లోని పేదలకు ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. జూలై 4న వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయన విగ్రహాలకు నివాళులర్పించి కాపు రిజర్వేషన్ల వినతిపత్రాలను సమర్పించాలని తీర్మానించామన్నారు. మెర్ల నాగ సత్యనారాయణ, కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇండోసోల్ సోలార్‌కు భూసేకరణ తక్షణమే విరమించాలి

- వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ నిర్బంధాలను లెక్కచేయకుండా శాంతియుత నిరసన ప్రదర్శనను విజయవంతం చేసిన కరేడు గ్రామస్థులను రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు. కరేడు గ్రామస్థులకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు సంఘాలు అండగా నిలుస్తాయన్నారు. ప్రదర్శన సందర్భంగా మహిళలపై జూలుం ప్రదర్శించిన పోలీస్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆయన డిమాండ్ చేశారు. ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూసేకరణ తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నిరసనలో పాల్గొన్న యూనియన్ నేతలు

మహాటీవీపై దాడిని ఖండించిన ఏపీయూడబ్ల్యూజే

గాంధీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మహాటీవీ ప్రధానకార్యాలయంపై బీఆర్ఎస్ నేతలు చేసిన దాడిని ఏపీయూడబ్ల్యూజే నేతలు తీవ్రంగా ఖండిచారు. ఈ దాడిని మీడియాస్వేచ్ఛపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ మేరకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. కర్రలు, రాడ్లు, రాళ్లతో కార్యాలయంపై దాడి చేసి భయానక వాతావరణం సృష్టించారని, చానళ్లలో వచ్చే ప్రసారాలపై అభ్యంతరాలపై చట్టబద్ధంగా ఎదుర్కోవాలే కానీ నేరుగా రౌడీలతో దౌర్జన్యాలకు దిగడం సరైంది కాదని హితవు పలికారు. విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రవి, డీ వెంకటేశ్వరరావు, ఐజేయూ సభ్యుడు ఎస్కే బాబు, సామ్నా రాష్ట్రనేత సీహెచ్ రమణారెడ్డి పాల్గొన్నారు.



కనకదుర్గా కాలనీ సమీపంలో కాలువలో పేరుకున్న వ్యర్థాలు, కరెన్సీ నగర్‌కాలనీ సమీపంలో మురుగు కాలువలో రంగు మారిన నీరు



కమ్యూనిటీ హాల్ పక్కనే గుట్టలుగా వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

అనధికార డంపింగ్ యార్డ్‌తో అగచాట్లు

పటమట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 11వ డివిజన్ తంగెళ్లమూడి వారి వీధి కనకమేడల రవీంద్రకుమార్ కమ్యూనిటీ హాల్ పక్కన భవన నిర్మాణ వ్యర్థాలను గుట్టలు, గుట్టలుగా వేస్తున్నారు. దీంతో అది అనధికార డంపింగ్ యార్డ్‌గా మారిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ప్రైవేటు వ్యక్తులు జేసీబీలను, ట్రాక్టర్లను అక్కడే నిలుపుతున్నారు. కమ్యూనిటీ హాల్‌ను శుభకార్యాలకు ఇచ్చే తరుణంలో ఇలాంటి వ్యర్థాల వల్ల ఎవరూ అద్దెకు తీసుకునే అవకాశం ఉండకపోవచ్చని పలువురు చెబుతున్నారు.

దోమలకు ఆవాసంగా కాలనీలు

భారతీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రధాన అవుట్ పాల్ డ్రెయినేజీ (మురుగుకాలువ) పూడికతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 3,4,10 డివిజన్‌లోని పలు ప్రధాన కాలనీలైన విజయనగర్ కాలనీ, భారతీనగర్, శ్రీరామ చంద్రనగర్, కరెన్సీనగర్, కనకదుర్గనగర్ కాలనీల మీదుగా మురుగు కాలువ ప్రవహిస్తూ కనకదుర్గ నగర్ కాలనీలోని శివారున ఉన్న పుల్లేటి కాలువలో కలుస్తుంది. ప్రస్తుతం ఈ కాలువ పలుచోట్ల చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో నీరు సరిగా ప్రవహించే దారి లేక రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు వల్ల దోమలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా విజృంభిస్తున్నాయి. ఎక్కడ అనారోగ్యానికి గురవుతామోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భారతీనగర్ కాలనీ సమీప కాలువలో వ్యర్థాలు



వాసవీ నగర్ కాలనీ మెయిన్ రోడ్డులో తీసిన గుంత

తవ్వారు.. వదిలేశారు..!

భారతీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పదోవ డివిజన్ పరిధిలోని వాసవీ నగర్ కాలనీ మెయిన్ రోడ్డులోని మంచినీటి పైపులీకవుతోంది. వీఎంసీ వాటర్ వర్క్స్ సిబ్బంది పైపు మరమ్మతులకు రెండు వారాల క్రితం గుంత తీసి పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. దీంతో అది ప్రమాదకరంగా మారింది. ప్రజలు రాకపోకలు సాగించాలంటే గుంత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండా అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సమాచారం తెలుసుకొనేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

ఘనంగా బ్లాక్‌బక్స్ లీడర్‌షిప్

లబ్బీపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఐటీ, ఐఆడీటీ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం బ్లాక్‌బక్స్ లీడర్‌షిప్ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐటీ, ఈ అండ్ సీ డిపార్ట్‌మెంట్, స్పెషల్ సెక్రటరీ డాక్టర్ సుందర్ బాలకృష్ణ మాట్లాడుతూ విద్యా రంగం, పరిశ్రమ మధ్య వారధిగా మారే ఎక్స్‌లెన్స్ సెంటర్లు ఎంతో విలువైనవన్నారు. బ్లాక్ బగ్స్ సీఈవో అనురాధ మాట్లాడుతూ క్యాంపస్‌లను సాంకేతికతతో సమృద్ధిగా చేయాల్సి అవసరం ఉందని అందుకోసం విర్చువల్ ల్యాబ్స్, సీవోఈఎస్, ఇంటర్న్‌షిప్స్, ఏఐ ఆధారిత పీజీ ప్రోగ్రామ్స్ అమ లు చేస్తున్నామన్నారు. రాజ్‌కుమార్ బోనగిరి, నాగరాజు దేవరకొండ పాల్గొన్నారు.

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship Programme

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programs at selected private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree or diploma program in architecture and engineering, such as Mechanical Engineering, Electrical Engineering & Electronics Engineering and production Engineering, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in selected colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh.



Prizes & Rewards:
- For engineering and architecture students: INR 1,00,000 or 75% of the annual fees (whichever is less)
- For diploma students: INR 40,000 or 90% of the annual fees (whichever is less)

Last Date: 15-07-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/BSFS4

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarship 2025-26 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: "Students enrolled in the BBA, BFIA, B.Com. (H,E), BMS, IPM, B.A. (Economics), BBS, or any other finance-related degree courses are eligible.
- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. (70% marks for PwD students)
- The annual family income of the applicants should be less than INR 6 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RMKSP5

buddy4study.com

నిన్న మొన్నటి దాకా ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల మొదటి చాయిస్ కంప్యూటర్ సైన్స్. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వచ్చిన తరువాత పరిస్థితి మారింది. మార్కెట్‌లో ఉద్యోగాలు తగ్గడం మొదలయ్యాయి. పులిమీద పుట్రలా అమెరికా జాబ్ మార్కెట్ ఇబ్బందులతో మరింత క్షీణించింది. దీంతో సీఎస్సీ చదవాలనే విద్యార్థుల ఆలోచనలు మారి కోర్ సబ్జెక్టుల వైపు దృష్టి సారించడం మొదలుపెట్టారు. అంతే కాకుండా విద్యార్థులను ఇటువైపు మళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోర్ బ్రాంచెస్‌లు ఎలా ఉంటాయో వివరిస్తున్నారు రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణరావు. ఆయన గతంలో ఎంసెట్ కన్వీనర్‌గా, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా పనిచేశారు.



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్లలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్లలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, టీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా ఇలా పలు సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు

దిక్సూచి

ఎస్ఎస్‌సీ కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ, గ్రాడ్యుయేట్ లెవెల్ నోటిఫికేషన్

గ్రాడ్యుయేట్ లెవెల్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లోని 14,582 ఖాళీలను భర్తీ చేయనున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కొన్ని పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.
వయస్సు: 2025 ఆగస్టు 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
చివరి తేదీ: 2025 జూలై 4

ఎంపిక విధానం:
- టైర్-1 సీబీటీ ఆబ్జెక్టివ్ పరీక్ష
- టైర్-2 సీబీటీ - ఆబ్జెక్టివ్ పరీక్ష + స్కిల్ టెస్టులు
- డాక్యుమెంట్ వెరిఫికేషన్

వెబ్‌సైట్: https://ssc.gov.in/



కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ పూర్తిచేసిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 3131 ఖాళీలు ఉన్నాయి
- లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
- డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఏ)

అర్హత: ఇంటర్మీడియేట్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్ విద్యార్థులూ అర్హులు. కొన్ని పోస్టులకు మాత్రం ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.
వయస్సు: 2026 జనవరి 1వ తేదీ నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1999 జనవరి 1 నుంచి 2008 జనవరి 1వ తేదీన జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 15 సంవత్సరాల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
చివరి తేదీ: 2025 జూలై 18
వెబ్‌సైట్: https://ssc.gov.in/

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

మధ్యతరగతి కుటుంబాల కథ



సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని ప్రధాన పాత్రల్లో శ్రీ గణేశ్ తెరకెక్కించిన చిత్రం '3బీహెచ్‌కే'. శాంతి టాకీస్ బేనర్‌పై అరుణ్ విశ్వ నిర్మించారు. జూలై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ ' తండ్రీకొడుకుల అనుబంధాన్ని బొమ్మరిల్లు సినిమాలో చూశారు. అలాంటి అనుబంధాన్నే ఇప్పుడు '3బీహెచ్‌కే' చిత్రంలో చూస్తారు' అని అన్నారు. నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ 'మనమందరం మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చాం. ఇల్లు కట్టుకోవాలనే కల అందరికీ ఉంటుంది. ఇల్లు అనేది ఒక గౌరవం. కుటుంబ సభ్యులంతా ఒకే చోట కూర్చొని చూడదగిన చిత్రమిది' అని అన్నారు. చిత్రదర్శకుడు శ్రీ గణేశ్ మాట్లాడుతూ 'మా సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. చాలా ప్రేమతో ఈ సినిమా తీశాం. ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని అన్నారు. చిత్ర నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ 'ఈ చిత్రం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని అన్నారు.

భారతీయ సినీరంగం గర్వించే విషయం

- పవన్‌కల్యాణ్



హీరో కమల్ హాసన్ ఆస్కార్ కమిటీలో సభ్యుడిగా ఎంపికవ్వడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సినీరంగం గర్వించే విషయమని ప్రశంసించారు. "ప్రపంచమంతా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల కమిటీలో సభ్యుడిగా పద్మభూషణ్ కమల్ హాసన్ ఎంపికవ్వడం భారతీయ సినీరంగం గర్వించదగ్గ విషయం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన నటుడిగా, దర్శకుడిగా, కథకుడిగా భారతీయ, ప్రపంచ సినిమాపై చెరగని ముద్ర వేశారు. సినిమా మేకింగ్ విషయంలో ఆయనకు ఉన్న పట్టు స్ఫూర్తిదాయకం. ప్రపంచ సినిమాకు ఆయన ఇలాగే మరింత కాలం సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. కాగా, 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఇటీవల విడుదల చేసిన కొత్త కమిటీ సభ్యుల జాబితాలో భారత్ నుంచి కమల్ హాసన్‌తో పాటు నటుడు ఆయుష్మాన్ ఖురానా, దర్శకురాలు పాయల్ కపాడియా, ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు ఉన్నారు. హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో వీరు పాలుపంచుకోనున్నారు.

సీక్వెల్ రాబోతోంది



యూత్‌ను విపరీతంగా ఆకట్టుకున్న సినిమాల్లో 'ఈ నగరానికి ఏమైంది' ఒకటి. విశ్వక్ సేన్ కథానాయకుడిగా తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ చిత్రానికి కొనసాగింపు భాగం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఆదివారం ఈ సినిమాకు సీక్వెల్ రాబోతుందని ప్రకటించారు మేకర్స్. 'ఈఎన్ఈ రిపీట్' అనేది టైటిల్. 'ఏలినాటి శనిపోయింది. కన్యారాశి టైమ్ వచ్చింది' అనేది ట్యాగ్‌లైన్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. మొదటి పార్ట్‌కు పనిచేసిన చిత్రబృందమే ఈ సీక్వెల్‌లోనూ భాగమవుతున్నారు. తరుణ్‌భాస్కర్ దాస్యం దర్శకత్వంలో డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మించనున్నారు. విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమతం, వెంకటేశ్ కాకుమాను ప్రధాన పాత్రలు పోషించనున్నారు.

యువతను ఆకట్టుకునేలా...



నూతన నటుడు సాయికృష్ణ హీరోగా వెంకటరమణ పసుపులేటి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలె ప్రారంభించిన ఈ సినిమాకు 'పవర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "యువతను ఆకట్టుకునే కథాంశంతో పాటు అద్భుతమైన సాంకేతిక విలువలతో చిత్రం ఉంటుంది. టాలీవుడ్‌లో కొత్త ఒరవడి సృష్టిస్తుంది" అని అన్నారు. ఆ చిత్రానికి ఎడిటర్: నందమూరి హరి, సినిమాటోగ్రఫీ: బి.ఎస్.కుమార్, సంగీతం: శంకర్ మహదేవన్.

షఫాలీ మృతికి కారణమిదేనా?



'కాంటా లగా' సాంగ్ ఫేమ్ షఫాలీ జరివాలా(42) ఆకస్మిక మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్న సంగతి తెలిసిందే. ఆమె గుండెపోటుతో మరణించారని మొదట వార్తలు వచ్చాయి. ఆమె కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు మృతికి గల పూర్తి కారణాలను ఇంకా వెల్లడించలేదు. మరోవైపు అందంపై ఉన్న మమకారమే ఆమె ప్రాణాలు కోల్పోయేలా చేసిందని నెట్టింట వార్తలు వస్తున్నాయి. ఆమె కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్సను తీసుకుంటున్నట్లు సమాచారం. శుక్రవారం ఇంట్లో పూజ ఉండడంతో ఆమె ఆ రోజంతా ఉపవాసం ఉన్నారని.. ఖాళీ కడుపుతో యాంటీ ఏజింగ్ ఔషధాలు, ఇంజెక్షన్లు తీసుకోవడంతో అవి వికటించి గుండెపోటుకు దారి తీసుంటాయని వార్తలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం
30 జూన్ 2025

ఈ ఆసనాలతో బీపీ నియంత్రణ

నేడు ఎంతో మందిని వేధిస్తున్న సమస్య రక్తపోటు. ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలి, ఉద్యోగ ఒత్తిడి వంటి అనేక కారణాలతో ఈ సమస్య పెరిగిపోతుంది. అయితే కొన్ని ఆసనాలతో బీపీని నియంత్రణలో ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలివీ.

శవాసనం: ఈ ఆసనం ఒత్తిడిని తగ్గించి, ప్రశాంతతను పెంచుతుంది. దాంతో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఈ ఆసనంతో మెదడు పనితీరు కూడా మెరుగుపడి జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



- ముందుగా నేలమీద వెల్లికిలా పడుకుని కాళ్లను దూరంగా చాచాలి. రెండు చేతులను కూడా శరీరానికి దూరంగా చాపాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. కళ్లు మూసుకుని శ్వాసమీద మనసు నిమగ్నం చేయాలి. అయిదు నుంచి పది నిమిషాల తరువాత మామూలు స్థితికి రావాలి.



ఉత్తానాసనం: ఈ ఆసనం మెదడుకు రక్త ప్రసరణ బాగా జరిగేలా దోహదం చేస్తుంది. ఒత్తిడిని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. దాంతో రక్తపోటు తగ్గుతుంది.

- నేలమీద నిటారుగా నిల్చోవాలి. ముందుకు వంగి తలను పాదాల వరకు తీసుకురావాలి. ఈ క్రమంలో కాళ్లు నిటారుగా ఉండేలా చూసుకోవాలి. నిమిషం నుంచి రెండు మూడు నిమిషాలు తరువాత మెల్లిన సాధారణ స్థితిలోకి వచ్చేయాలి.

భుజంగాసనం: ఇది మెదడుతో పాటు శరీరం మొత్తానికీ రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని సమర్థంగా నిర్వహించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది.



- ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. అరచేతులను నేలకు ఆనించి వాటి ఆధారంతో మెడ, నడుము పైభాగాన్ని ఎత్తాలి. నడుము కింద భాగం మాత్రమే నేలకు ఆనాలి. ఇలా 20-30 సెకన్ల పాటు ఉండి నెమ్మదిగా మాములు స్థితికి రావాలి.



వృక్షాసనం: ఇది శరీరాన్ని దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు రక్తపోటును నియంత్రిస్తుంది.

- రెండు కాళ్లను దగ్గరగా ఉంచి నిల్చోవాలి. మెల్లగా ఓ కాలిని పైకి లేపి ఇంకో కాలి తొడ మీద ఆనించి ఒక కాలి మీద నిలబడాలి. ఇప్పుడు నెమ్మదిగా రెండు చేతులను తల పైకి తీసుకెళ్లి నమస్కారం పెట్టే భంగిమలో ఉంచాలి. కొన్ని నిమిషాల తరువాత సాధారణ స్థితికి రావాలి.

సేతుబంధాసనం: ఈ ఆసనం మెదడుకు ప్రశాంతతకు చేకూర్చి రక్తపోటును నియంత్రణలో ఉంచేలా సహాయపడుతుంది.



- ముందుగా నేలపై వెల్లికిలా పడుకోవాలి. మోకాళ్లను మడిచి భుజాలు, చేతులను నేలమీద ఆధారం చేసి నడుమును పైకి లేపాలి. ఇలా 20-30 క్షణాల పాటు ఉండి మామూలు స్థితికి రావాలి.



ఆడపిల్ల పుడితే పురిటిలోనే చంపుతున్న అమానవీయ ఘటనలు ఈనాటికీ వార్తల్లో చూస్తున్నాం.

కొడుకు ట్రాన్స్ మహిళగా మారినందుకు ఇంటి నుంచి గెంటేస్తున్న తల్లిదండ్రులు కోకొల్లలు.

అలాంటిది తన కుమారుడు విష్ణుతేజ స్వలింగ సంపర్కుడు అని తెలిసినా... ఆ వాస్తవాన్ని స్వాగతించారు... **బోయపాటి అంజలి.**

అంతేకాదు, కొడుకు చేపట్టిన గే హక్కుల ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. అంతర్జాతీయంగా జూన్... ఎల్జీబీటీక్యూ సమూహానికి హక్కుల పరిరక్షణ ఉత్సవాల మాసం. ఈ సందర్భంగా అంజలి 'నవ్య'తో చెబుతున్న విశేషాలివి.

పిల్లల లైంగికతకు వారు బాధ్యులా?

"మా అబ్బాయి బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగంలో చేరాలి. వాడికి నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకొని పిల్లాపాపలతో సంతోషంగా జీవించాలి'... ఇలా అందరు అమ్మల్లాగానే నేనూ అనుకున్నాను. అది సాధ్యం కాదని తెలిసిన తర్వాత నా ఆలోచనా విధానాన్ని మార్చుకున్నాను. మా అబ్బాయి నేరుగా నాతో ఎప్పుడూ తాను 'గే' అని చెప్పలేదు. కానీ తన లైంగిక అస్తిత్వాన్ని, అభిప్రాయాలను రకరకాల రూపాలలో నాకు అర్థమయ్యేలా చేయడానికి ప్రయత్నించాడు. ముఖ్యంగా నేషనల్ జియోగ్రఫిక్ ఛానల్‌లో ప్రసారమయ్యే హోమోసెక్సువల్ స్వభావం కలిగిన పక్షులు, జంతువుల కథనాలు చూపించి, ప్రకృతిలో స్వలింగ సంపర్కం సహజమే అనే అవగాహన కలిగించడం లాంటివి. నేను చదువుకున్నది పదో తరగతి అయినా... వైజ్ఞానిక శాస్త్ర విశేషాలు తెలుసుకోవడం నాకు చాలా ఆసక్తి. సమాజంలో విభిన్న లైంగిక ప్రవృత్తులు ఉంటాయన్న అవగాహన నాలో ఉంది. కాబట్టి మా అబ్బాయి నాతో చెప్పాలనుకున్న విషయాన్ని నేను అంతే సులభంగా, సున్నితంగా గ్రహించాను. వాడిని యథాతథంగా అంగీకరించాను.

నచ్చినట్టు ఉండమన్నాను...

మా అబ్బాయి 'గే' అని తెలిసిన తర్వాత, 'మానసిక చికిత్స తీసుకో...' 'ఆలోచన మార్చుకో!' లాంటి ఒత్తిళ్లు వాడి మీద నేను ఎప్పుడూ తీసుకురాలేదు. ఆ లైంగికత అన్నది వాడికై వాడు కోరుకున్నది కాదు కదా! మరి మార్చుకోమని ఎలా అంటాం? 'నిజానికి హోమోసెక్సువల్ లైంగిక భావన ప్రకృతికి విరుద్ధం కాదు. అలాంటి వారిని లైంగికత మార్చుకోవాలని బలవంతపెట్టడమే అసహజం' అని తెలుసుకున్నాను. అందుకే నా బిడ్డ ఆలోచనలను, అభిప్రాయాలను పూర్తిగా స్వాగతించాను. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం... అప్పటికి వాళ్ల నాన్న చనిపోయి నాలుగు నెలలు. 2018 సెప్టెంబరులో అనుకుంటా... ఐపీసీ సెక్షన్ 377ను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. టెలివిజన్‌లో ఆ వార్తలు చూస్తూ విష్ణు ఎంతగా భావోద్వేగానికి లోనయ్యాడో మాటల్లో చెప్పలేను. అప్పుడు వాడితో ఒక్కటే అన్నాను.. "నువ్వు పూర్తి స్వతంత్రుడివి. నీకు నచ్చినట్టు బతుకు నాన్నా" అని. కనిపెంచిన బిడ్డ కళ్ల ముందే మానసికంగా కుంగిపోతూ, ఆత్మహత్య ప్రయత్నాలు చేస్తూ కుమిలిపోతున్నప్పుడు మనం మాత్రం చూస్తూ సంతోషంగా ఉండగలమా? నా బిడ్డ మరొకరికి ద్రోహం చేయడంలేదు. నేరం చేయలేదు. మరి వాణ్ణి ఎందుకు తప్పుగా చూడాలి? నా బిడ్డ 'గే' అయినా, వాడికి తోచిన మంచి పనులు చేస్తూ సంతోషంగా ఉంటే చాలు. ఒక తల్లిగా అంతకుమించి నాకు మరే కోరికలూ లేవు.

అప్పుడు బంగారు గొలుసు ఇచ్చాను...

విష్ణుతేజ ఎమ్మెస్సీ పోస్టు గ్రాడ్యుయేషన్‌లో బయోటెక్నాలజీ పూర్తిచేశాడు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఆట, పాటల్లోనూ బాగా యాక్టివ్. నలుగురికి మంచి చేయాలన్నది వాడి ఆలోచన. ఒకవైపు ఎల్జీబీటీక్యూ ఉద్యమాలతో కలసి నడుస్తూనే తనలాంటి వారి హక్కుల కోసం ప్రత్యేకంగా పని చేయాలని ఉందన్నాడు. అందుకు కనీసం లక్షరూపాయలు అయినా అవసరమవుతాయని చెప్పాడు. మరొక నిమిషం ఆలోచించకుండా నా బంగారపు గొలుసు తీసి ఇచ్చాను. దాన్ని తాకట్టు పెట్టగా వచ్చిన సొమ్ముతో ఒక ఆఫీసు తీసుకున్నాడు. మూడేళ్లుగా 'అస్తిత్వం ఫౌండేషన్' ద్వారా 'గే' సంరక్షణ, సంక్షేమం కోసం రకరకాల కార్యక్రమాలు చేస్తున్నాడు. ముకుందమాల అనే మహిళ కూడా నాలాంటి తల్లే. ఆమె కుమార్తె ట్రాన్స్‌మహిళ. ఈ ఫౌండేషన్ నిర్వహణలో విష్ణుతేజకు ఆమె సహకారం కూడా తోడవడంతో తాను కోరుకున్న విధంగా ముందుకు వెళుతున్నాడు. ఎల్జీబీటీక్యూ సమావేశాలకు, ప్రైడ్ మంత్ ప్రోగ్రామ్స్‌కు నన్నూ తరచుగా తీసుకెళుతుంటాడు. వాళ్ళు నన్ను ఎంతగా ఆదరించి, అభిమానిస్తారంటే... నాలో వాళ్ల అమ్మను చూసుకుంటారు.

కన్నబిడ్డకన్నా ఎక్కువా?

మా సొంతూరు ఒంగోలు. మాది పరువు, మర్యాదలు, పట్టింపులకు విలువ ఇచ్చే ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం. నా భర్త సివిల్ కాంట్రాక్టరు. అనారోగ్యం కారణంగా ఐదేళ్ల కిందట ఆయన చనిపోయారు. విష్ణు లైంగికత గురించి వాళ్ల నాన్నగారికి కొంత అవగాహన ఉంది. దాంతో ప్రవర్తన మార్చుకోమని గట్టిగా మందలించిన సందర్భాలు ఉన్నాయి. అందరిలాగే విష్ణు కూడా మొదట్లో కుటుంబ హింస భరించాడు. వాటన్నిటినీ దాటి తన అస్తిత్వాన్ని బహిరంగంగా ప్రకటించాడు. ఆ విషయం మా బంధుమిత్రులకు తెలిసినా... చాలామంది మా ఎదుట బయటపడలేదు. ఒకరిద్దరు మాత్రం "వాణ్ణి ఎందుకు అలా వదిలేశావు? పెళ్లిచేస్తే మారతాడు' అని సలహాలిచ్చారు. అలాంటి మూర్ఖపు సలహాలు, సూచనలను నేనెప్పుడూ పట్టించుకోలేదు. వారి కోసం మా అబ్బాయిని వదులుకుంటామా? నాకు నా బిడ్డకన్నా బంధువులు ఎక్కువ కాదు. తమ లైంగికతకు పిల్లలు బాధ్యులు కారు. కనుక భిన్న లైంగికతలను అర్థం చేసుకొని తల్లిదండ్రులు వారికి మద్దతుగా ఉండాలి.



కుమారుడు విష్ణుతేజతో

జీవితాంతం ఒక తోడు...

మా అబ్బాయి 'గే' స్నేహితులు ఒకరిద్దరు ప్రాజెక్టుల పని మీద విదేశాలకు వెళ్లి జంటలుగా తిరిగివచ్చారు. వారంతా అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుంటారు. స్వలింగ సంపర్కుల జంట అయినా... సాధారణ భార్యాభర్తలాగే చాలా అన్యోన్యంగా ఒకరికొకరు చాలా ప్రేమగా మెలగడం చూసి నిర్ఘాంతపోయాను. 'మా అబ్బాయి కూడా ఎవరినైనా తనకు ఇష్టమైన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎంచుకుంటే బావుంటుంది కదా' అనిపించింది. అదే ఆలోచన వాడితో చెప్పాను. కానీ అవతలి నుంచి సమాధానం రాలేదు. వాడు ఒంటరిగా మిగిలిపోకూడదు అన్నది నా అభిమతం. నేను మాత్రం ఎంతకాలం వాడి మంచిచెడులు చూస్తాను? అందుకే విష్ణును అర్థంచేసుకొని వాడికి జీవితాంతం తోడుగా ఉండే ఒక వ్యక్తిని... అదీ వాడికి నచ్చిన అబ్బాయినే చూసుకొని కలసి బతకమని బతిమాలుతున్నాను. అదే సమయంలో మనుషుల్లో రకరకాల ప్రవృత్తులుంటాయి. గే కమ్యూనిటీలోనూ అంతా నమ్మకస్తులే ఉంటారను కోలేం. రోజూ నేర వార్తల్లో రకరకాల వికృత పోకడలు చూస్తున్నాం కదా.! అందుకే విష్ణుకు ఎప్పుడు ఎలాంటి ఆపద ఎదురవుతుందేమోనన్న భయంకూడా నాలో లేకపోలేదు. కుటుంబం, సమాజంతో పాటు కొన్ని సందర్భాలలో... తన సమూహంతోనూ పోరాడాల్సిన సందర్భం తనకు ఎదురుకావచ్చు. కాబట్టి "అందరినీ అమాయకంగా నమ్మకు" అని హెచ్చరిస్తూ ఉంటాను.

• సాంత్వన్

నైట్ షిఫ్టులు చేస్తే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

మారిన పరిస్థితుల దృష్ట్యా నేడు నైట్ షిఫ్టులు సాధారణమైపోయాయి. ఈ షిఫ్టుల వలన డిప్రెషన్, మధుమేహం, ఊబకాయంతో పాటు గుండె జబ్బుల ప్రమాదం ఎక్కువని తెలిసినప్పటికీ చేయక తప్పని పరిస్థితులు. కాబట్టి రాత్రి వేళల్లో పనిచేసే వారు ఆరోగ్యం కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఈ సంగతులేంటో తెలుసుకుందాం..



నిద్ర తప్పనిసరి: రాత్రంతా పనిచేసి పగటి పూట పడుకున్నా ఎలాంటి అవాంతరాలు లేకుండా 7-8 గంటలు తప్పకుండా నిద్రపోవాలి. కాబట్టి పడుకునేటప్పుడు గదిలోకి ఎలాంటి శబ్దాలు, వెలుతురు చొరబడకుండా జాగ్రత్త తీసుకోండి.

బయటి ఫుడ్ వద్దు: నైట్ షిఫ్టుల కారణంగా నీరసం, నిస్సత్తువ ఉండడం సహజం. దాంతో ఇంట్లో వంట పని, ఇంటి పని చేసుకోలేక చాలా మంది బయటి ఆహారం తినేస్తుంటారు. కానీ అలా చేస్తే మరిన్ని ఆరోగ్య సమస్యలు దరిచేరతాయి. అందుకే ఇంటి భోజనం తినడానికే ప్రాధాన్యమివ్వాలి. కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

టీ, కాఫీ వద్దు: నైట్ షిఫ్టుల్లో నిద్ర రాకుండా చాలా మంది టీ, కాఫీలు ఎక్కువగా తాగేస్తుంటారు. కానీ వీటిలోని చక్కెర వలన మధుమేహం బారిన పడతారు. అందుకే ఇష్టారీతిన ఎప్పుడు పడితే అప్పుడు టీ, కాఫీలు తాగేయకూడదు.

వ్యాయామం: శరీర దారుఢ్యం కోసం వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. కాబట్టి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. అలాగే యోగా చేయడం వలన మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

దుస్తుల నుంచి దుర్వాసనా?

వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. దాంతో ఉతికిన దుస్తులు సరిగ్గా ఆరక దుర్వాసన వస్తాయి. అలాగే అల్మారాల్లోని దుస్తుల నుంచి కూడా వాసన వస్తుంది. ఇలా కాకుండా ఉండాలంటే చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరి. అవేంటో తెలుసుకుందాం..



- నిమ్మరసం ఈ సమస్యను చక్కగా పరిష్కరిస్తుంది. ఒక చెంచా నిమ్మరసంలో కొంచెం నీరు కలిపి ఓ స్ప్రే బాటిల్‌లో పోయాలి. ఆ నీటిని వాసన వస్తున్న బట్టల మీద స్ప్రే చేసి గాలికి ఆరబెట్టాలి. నిమ్మరసం వాసన కలిగించే ఫంగస్ చంపి దుర్వాసనను తొలగిస్తుంది.
- వెనిగర్ కూడా దుర్వాసనకు కారణమయ్యే ఫంగస్‌ను నివారించడంలో బాగా పనిచేస్తుంది. వెనిగర్‌ను దుస్తుల మీద చల్లి నీళ్లతో శుభ్రం చేసి ఆరేస్తే దుర్వాసన నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వర్షాకాలంలో అల్మారాల్లో ఉన్న బట్టలు కూడా దుర్వాసన వెదజల్లుతాయి. అలాంటప్పుడు అల్మారాల మూలల్లో కొంచెం బేకింగ్ సోడా వేస్తే మంచి ఫలితముంటుంది.
- అల్మారాలను బ్లీచింగ్ ద్రావణంలో ముంచిన వస్త్రంతో తుడిచి ఆరిన తరువాత దుస్తులను సర్దుకోవాలి. ఇలా చేసినా దుర్వాసన రాదు.
- వాడేసిన బట్టలను ఎప్పటికప్పుడు ఉతకడం, వాషింగ్ మెషీన్‌లో ఉతికిన బట్టలను వెంటనే ఆరేసినా దుర్వాసన రాదు.
- తడిసిన బట్టలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా వెంటనే ఉతికేయాలి. గాలి బాగా తగిలే ప్రదేశంలో ఆరేస్తే దుస్తుల నుంచి వాసన రాకుండా ఉంటుంది.

సంప్రదాయ అభి'రుచి'

ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన తమ ఊర్లో ప్రతిచోటా పాశ్చాత్య ఆహారమే కనిపించడం 28 ఏళ్ళ **మనీషా ఠాకూర్**ను ఆలోచింపజేసింది.

స్థానిక సంప్రదాయ వంటకాల ప్రత్యేకతను చాటి చెప్పాలనే ఆమె తపన కొత్త ప్రయత్నానికి నాంది పలికింది.

హిమాచల్‌ప్రదేశ్‌లోని సల్బక్ గ్రామంలో మనీషా ఏర్పాటు చేసిన కేఫ్ ఇప్పుడు ఒక పర్యాటక ఆకర్షణగా మారింది.



"కొన్నాళ్ళ క్రితం ఢిల్లీ నుంచి నా స్నేహితులు కొందరు మా ఊరు వచ్చారు. వీధులన్నీ తిరిగి వచ్చాక... "మీ ప్రాంతం, నీ ఆతిథ్యం అన్నీ బాగానే ఉన్నాయి. కానీ వీధుల్లోకి వెళ్ళి ఏదైనా తినాలనుకుంటే... నూడుల్స్, మంచూరియా లాంటివే తప్ప మరేం దొరకడం లేదేమిటి? ఇవి ఎక్కడైనా ఉండేవేగా! ఇక్కడి స్పెషల్స్ ఏమిటి" అని అడిగారు. ఆ మాట నిజమే. 'ఒక పర్యాటక ప్రాంతానికి వెళ్తాం. స్థానిక రుచుల్ని అస్వాదించాలనుకుంటాం. కానీ అక్కడ కూడా పాశ్చాత్య రుచులు లేదా పట్టణ ప్రాంతాల్లో కనిపించే పదార్థాలే కనిపిస్తే? మన ప్రత్యేకతను ఎందుకు కాపాడుకోలేకపోతున్నాం?...' ఈ ప్రశ్న నన్ను ఎంతోకాలం వేధించింది.

అన్నీ ఒకే రకంగా...

మాది హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని బిర్ బిల్లింగ్ అనే చిన్న గ్రామం. అది సుప్రసిద్ధమైన పర్యాటక ప్రదేశం. ప్రతి సంవత్సరం ఎంతోమంది టూరిస్టులు మా ఊరును సందర్శిస్తూ ఉంటారు. ఇక్కడి మార్కెట్‌లో నడుస్తూ ఉంటే ప్రతి చోటా ఒకే రకం ఆహారాన్ని అమ్మే దుకాణాలు కనిపిస్తాయి. కరోనా తరువాత నగరాల నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన స్థానిక యువకులు ఏర్పాటు చేసినవి కూడా ఎక్కువే ఉన్నాయి. స్థానికులు కూడా కొన్నేళ్ళుగా వీటి మీద మోజు పెంచుకుంటూ... తమ సంప్రదాయ వంటల్ని క్రమంగా విస్మరిస్తున్నారు. ఇదే కొనసాగితే ఆ వంటల్లో చాలావరకూ మరుగునపడే ప్రమాదం ఉంది. అందుకే మా ప్రాంత సంప్రదాయిక వంటలను మళ్ళీ అందరికీ రుచి చూపించాలని, ప్రోత్సహించాలని అనుకున్నాను. మాకు సమీపంలో ఉన్న సల్బక్ గ్రామంలో 'హర్ కేఫ్' పేరిట ఒక రెస్టారెంట్ ఏర్పాటు చేశాను.

స్థానిక మహిళలతో...

మా జిల్లా పేరు కంగ్రా. ఈ ప్రాంతంలో జరిగే ఉత్సవాలు, వివాహాలు, ఇతర వేడుకల్లో మధ్యాహ్న సమయంలో ఇచ్చే విందును 'కంగ్రీధమ్' అంటారు. దీనిలో భాగంగా చేసే వంటకాలు చాలా వైవిధ్యంగా, ఎంతో రుచిగా, ఆరోగ్యకరంగా ఉంటాయి. ఇప్పుడు వాటి స్థానంలో వేరే ప్రాంతాల వంటకాలు చోటు చేసుకుంటున్నాయి. వాటిని పరిరక్షించడం కోసం మా రెస్టారెంట్‌లో కంగ్రీధమ్ వంటకాలతో పాటు ఇదివరకు ఇళ్ళలో సాధారణంగా చేసుకున్న చిరుతిండ్లు, ఉపాహారాలను కూడా మెనూలో ఉంచాం. దాదాపు అన్నీ కట్టెల పొయ్యి మీదే వండుతున్నాం. వంటలు, ఇతర పనులు పూర్తిగా స్థానిక మహిళలే చేస్తారు. వారు తయారు చేసే పచ్చళ్ళు, పొడులను కూడా విక్రయిస్తున్నాం. ఇది వారికి ఉపాధి మాత్రమే కాదు, సాధికారతవైపు వేసే ఒక చిన్న అడుగు కూడా. ఇప్పుడు మా ఊరు వచ్చిన పర్యాటకులకు మా రెస్టారెంట్ ఒక ప్రత్యేక ఆకర్షణ. ప్రతి వంటకం గురించి వారు ఆసక్తిగా అడుగుతూ ఉంటారు. వారిలో మహిళలను మా కిచెన్‌లోకి ఆహ్వానించి... వంటకాల తయారీ పద్ధతుల గురించి చెబుతున్నాం. స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండే రెస్టారెంట్ అలంకరణను కూడా వారు మెచ్చుకుంటున్నారు. అలాగే స్థానికులు కూడా తరచుగా 'హర్ కేఫ్'కు వస్తున్నారు. ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు వెళ్ళినవారు... మా ఊరు వచ్చినప్పుడు స్థానిక రుచుల్ని మా రెస్టారెంట్‌లో ఆరగిస్తున్నారు. వాటి రెసిపీల గురించి ఆరా తీస్తున్నారు. ఇంతకన్నా సంతోషం కలిగించే విషయం ఇంకేముంటుంది?".

> మా జిల్లా పేరు కంగ్రా. ఈ ప్రాంతంలో జరిగే ఉత్సవాలు, వివాహాలు, ఇతర వేడుకల్లో మధ్యాహ్న సమయంలో ఇచ్చే విందును 'కంగ్రీధమ్' అంటారు. దీనిలో భాగంగా చేసే వంటకాలు చాలా వైవిధ్యంగా, ఎంతో రుచిగా, ఆరోగ్యకరంగా ఉంటాయి. ఇప్పుడు వాటి స్థానంలో వేరే ప్రాంతాల వంటకాలు చోటు చేసుకుంటున్నాయి.



ఇవి అతిగా తింటే అనర్థమే

గుమ్మడి గింజల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిసిందే. అయితే ఏదైనా సరే అతిగా తీసుకోవడం అనర్థాలకు దారితీస్తుంది. గుమ్మడి గింజలు కూడా అంతే. వీటిని అతిగా తినడం ఆరోగ్యానికి చేటని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ వివరాలివీ..

- గుమ్మడి గింజల్లో ఫైబర్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి దోహదం చేస్తుంది. అయితే ఈ గింజలు ఎక్కువ మోతాదులో తీసుకోవడం వలన కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్, డయేరియా సమస్యలు తలెత్తుతాయి.
- ఈ విత్తనాల్లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి వీటిని అతిగా తీసుకుంటే బరువు పెరిగే ప్రమాదం ఉంది.
- గుమ్మడి గింజలు అధిక రక్తపోటును నియంత్రిస్తాయి. కాబట్టి లోబీపీ ఉన్న వారు ఎక్కువగా తీసుకుంటే నీరసంతో అనారోగ్యం బారిన పడతారు.
- ఇవి తింటే కొందరికి చర్మంపై దురద, దద్దుర్లు వంటి అలర్జీలు రావచ్చు.
- ఇక చిన్న పిల్లలకు గుమ్మడి గింజలు ఇచ్చేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలు వాటిని నమిలి మింగేలా చూడాలి. లేకపోతే గొంతులో ఇరుక్కుని ఇబ్బంది పడే అవకాశముంటుంది.




26,000 పైన బుల్లిష్

(జూన్ 30-జూలై 4 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,634-24,825 పాయింట్ల మధ్యన కదలాడి 526 పాయింట్ల లాభంతో 25,638 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,426, 25,162, 25,054, 24,916 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,000 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,300

నిరోధ స్థాయిలు: 25,850, 25,950, 26,050 (25,750 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,525, 25,425, 25,325 (25,625 దిగువన బేరిష్)

అప్రోచ్ శాస్త్రి

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	565	విజయవాడ	590
వరంగల్	567	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	95
వరంగల్	90	గుంటూరు	100
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	85
కర్నూలు	90	నెల్లూరు	90
విశాఖపట్నం	84	అనంతపురం	90
గోదావరి	95		

టోరెంట్ ఫార్మా చేతికి జేబీ కెమికల్స్

డీల్ విలువ రూ.19,500 కోట్లు

న్యూఢిల్లీ: భారత ఫార్మా రంగంలో మరో భారీ డీల్ చోటు చేసుకుంది. జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్‌ను టోరెంట్ ఫార్మా రూ.19,500 కోట్లకు కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం జేబీ కెమికల్స్ ఈక్విటీలో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ కేకేఆర్ అనుబంధ సంస్థ.. టావ్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ పీటీఈ లిమిటెడ్‌కు ఉన్న 46.39 శాతం వాటాను రూ.11,917 కోట్లకు, జేబీ కెమికల్స్ ఉద్యోగుల వద్ద ఉన్న 2.8 శాతం వాటాను రూ.719 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య స్పష్టమైన ఒప్పందం కుదిరినట్టు టోరెంట్ ఫార్మా ఆదివారం ప్రకటించింది. ఇందుకోసం టోరెంట్ ఫార్మా జేబీ కెమికల్స్ ఒక్కో షేరుకు రూ.1,600 చొప్పున చెల్లించనుంది. ప్రజల వద్ద ఉన్న మరో 26 శాతం వాటాను ఒక్కో షేరు రూ.1,639.18 చొప్పున రూ.1,799.35 కోట్లకు కొనేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఈ కొనుగోలుతో ఫార్మా రంగంలో తమ స్థానం మరింత పటిష్ఠం కావడంతో పాటు కాంట్రాక్ట్ రీసెర్చ్, తయారీ రంగంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని టోరెంట్ ఫార్మా తెలిపింది.


దాన ధర్మాలకు మరో రూ.51,300 కోట్లు

వారెన్ బఫెట్

న్యూయార్క్: అమెరికా కుబేరుడు, స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. అమెరికా కేంద్రంగా పనిచేసే ఐదు స్వచ్ఛంద సేవా సంస్థలకు తన నిర్వహణలోని బెర్క్‌షైర్ హాత్‌వేకు చెందిన 600 కోట్ల డాలర్ల (సుమారు రూ.51,300 కోట్లు) విలువైన 1.24 కోట్ల షేర్లను విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు. దీంతో 2006 నుంచి ఈ ఐదు సంస్థలకు బఫెట్ విరాళంగా ఇచ్చిన షేర్ల విలువ 6,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.5.13 లక్షల కోట్లు) చేరింది. సోమవారం ఈ షేర్లను ఆయా స్వచ్ఛంద సేవా సంస్థల పేరు మీద బదిలీ చేయనున్నట్టు బఫెట్ తెలిపారు.

వస్తున్నాయ్ 'జొమాటో' విమానాలు

ముంబై/న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో సహ వ్యవస్థాపకుడు దీపీందర్ గోయెల్.. ల్యాట్ ఏరోస్పేస్ భాగస్వామ్యంలో ప్రాంతీయ విమానయానంలో ప్రవేశించే యోచన చేస్తున్నారు. జొమాటో సహ వ్యవస్థాపకురాలు సురభి దాస్ లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో ఈ విషయం వెల్లడించారు. దేశంలోని 450 ఎయిర్‌స్ట్రిప్‌లలో 150 మాత్రమే పని చేస్తున్నాయి. అంటే మూడింట రెండు వంతులు ఇప్పటికీ వృధాగానే పడి ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవడం వల్ల ఇప్పటికీ రోడ్డు లేదా రైలు మార్గాల్లో ప్రయాణిస్తూ గంటలు, రోజులు వృధా చేసుకుంటున్న సగటు జీవులకు తక్కువ వ్యయంతో విమానాల్లో తిరిగే అవకాశం కల్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. తాము ప్రారంభించాలనుకుంటున్న ల్యాట్ ఏరోస్పేస్ విమానాలు ఒక పార్కింగ్ లాట్‌తో సమానమైన విస్తీర్ణం ఉండే ఎయిర్-స్ట్రిప్‌లలో టేకాఫ్, ల్యాండింగ్ కాగలవని ఆమె చెప్పారు.



నయారా ఎనర్జీకి రాస్‌నెఫ్ట్ గుడ్‌బై!

- అమ్మకానికి రిలయన్స్‌తో చర్చలు
- వాల్యుయేషన్ విషయంలో రాని స్పష్టత

న్యూఢిల్లీ: దేశ పెట్రోలియం రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని వడినార్ వద్ద రెండు కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన నయారా ఎనర్జీ రిఫైనరీ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని రష్యా చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు ఈక్విటీలో ఈ కంపెనీకి 49.13 శాతం వాటా ఉంది. ఈ వాటాను విక్రయించేందుకు రాస్‌నెఫ్ట్ అధికారులు గత ఏడాది కాలంలో మూడు సార్లు ముంబై, ఢిల్లీ వచ్చి వివిధ కంపెనీలతో చర్చలు జరిపినట్టు సమాచారం. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)తో కూడా ప్రస్తుతం ఇందుకోసం ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే దీనిపై రెండు కంపెనీలు అధికారికంగా నోరు మెదపడం లేదు. రాస్‌నెఫ్ట్‌తో పాటు ఈ రిఫైనరీలో 24.5 శాతం వాటా కలిగిన మరో రష్యా కంపెనీ యూసీపీ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ కూడా తన వాటా అమ్మకానికి పెట్టినట్టు తెలుస్తోంది.

2017లో ఎస్సార్ నుంచి కొనుగోలు: ఎస్సార్ ఆయిల్‌గా ఉన్న ఈ రిఫైనరీ ప్రాజెక్ట్ ఈక్విటీలో మెజారిటీ వాటాను రష్యా కంపెనీలు 2017లో 1,290 కోట్ల డాలర్లకు కొనుగోలు చేశాయి. అమెరికా, ఈయూ ఆంక్షలతో ఈ రిఫైనరీ ప్రాజెక్టు లాభాలను తమ దేశానికి తరలించడం రష్యా కంపెనీలకు ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. దీంతో నయారా ఎనర్జీ కంపెనీ నుంచి తప్పుకోవడమే మేలనే నిర్ణయానికి వచ్చాయి. ఇందుకోసం ఆర్ఐఎల్‌తో సహా సౌదీ అరామ్కో, అదానీ గ్రూప్, ఓఎన్‌జీసీ/ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)లను రష్యా కంపెనీలు సంప్రదించాయి. అయితే ఈక్విటీలో తమ వాటాకు రష్యా కంపెనీలు 2,000 కోట్ల డాలర్లు (సుమారు రూ1.7 లక్షల కోట్లు) అడిగినట్టు సమాచారం. ఇది చాలా ఎక్కువనే అంచనాతో ఈ కంపెనీలు నయారా కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు.

రిలయన్స్‌కే లాభం

గుజరాత్‌లోని వడినార్ రిఫైనరీతో పాటు నయారా ఎనర్జీ కంపెనీకి దేశవ్యాప్తంగా 6,750 పెట్రోలు బంకులు ఉన్నాయి. ఈ రిఫైనరీకి దగ్గరలోనే రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏటా 6.82 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న రెండు రిఫైనరీలు నిర్వహిస్తోంది. నయారా ఎనర్జీ కూడా తోడైతే పెట్రో రిఫైనింగ్‌లో ఐఓసీకి ఉన్న 8.08 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని మించిపోవచ్చని రిలయన్స్ కోరిక. అయితే రష్యా కంపెనీలు అడుగుతున్న 2,000 కోట్ల డాలర్లు చాలా ఎక్కువని రిలయన్స్ కూడా పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. దీంతో రష్యా కంపెనీలు తాము ఆశించే మొత్తాన్ని 1,700 కోట్ల డాలర్లకు తగ్గించాయి. ఇది కూడా చాలా ఎక్కువని రిలయన్స్ భావిస్తున్నట్టు సమాచారం.

ఈ వారం దూకుడుగానే..!

దేశీయ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా చలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో పరిస్థితులు సద్దుమణగడం, ముడి చమురు ధరలు తగ్గటం, భారత్‌తో వాణిజ్య ఒప్పందం చివరి దశకు చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పటం సానుకూల అంశాలు. పైగా గత వారం నిఫ్టీ కీలకమైన 25,200 నిరోధ స్థాయిని దాటి 25,637 వద్ద స్థిరపడింది. ఎఫ్ఐఐలు మళ్లీ కొనుగోళ్ల బాట పట్టాయి. ప్రస్తుతం బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్స్, రిఫైనరీ, ఎయిర్‌లైన్స్ రంగాల షేర్లు బుల్లిష్‌గా ఉన్నాయి. రియల్టీ, ఐటీ షేర్లు బేరిష్‌గా ఉన్నాయి. ఇన్వెస్టర్లు 'పడితే కొనుగోలు చేయటమే వ్యూహా'న్ని (బై ఆన్ డిప్స్) అనుసరించటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఏసీసీ లిమిటెడ్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. షార్ట్ మూమెంటమ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ షేరు కీలకమైన రూ.1,850 స్థాయిలో మరోసారి మద్దతు తీసుకుంది. గత శుక్రవారం రూ.1,920 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,900 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,050/2,120 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,865 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ బ్యాంక్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కన్సాలిడేట్ అవుతోంది. ప్రైస్ యాక్షన్ చాలా టైట్‌గా కొనసాగుతోంది. షార్ట్, మీడియం టర్మ్ మూమెంటమ్, వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.1,462 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,430/1,450 శ్రేణిలో ప్రవేశించి రూ.1,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ1,400 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ ఎంటర్‌ప్రైజెస్: ఈ ఏడాది మార్చి నుంచి ఈ షేరు స్వల్పకాల అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ఆరు నెలల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. క్రమంగా మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.2,646 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,600 స్థాయిలో ప్రవేశించి రూ.2,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,545 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 15 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. రక్షణ రంగంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగటమే ఇందుకు కారణం. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. స్వల్పకాల మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,890 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,860 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,820 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏషియన్ పెయింట్స్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ఇప్పుడిప్పుడే కన్సాలిడేషన్ జరుగుతోంది. స్వల్పకాలిక మూమెంటమ్ పెరుగుతోంది. ముడి చమురు ధరలు తగ్గుతుండటంతో మళ్లీ మదుపరులు ఈ కౌంటర్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.2,358 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,320/2,300 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,275 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

తదుపరి నిరోధం 26,000


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కరెక్షన్‌లో పడినా కీలకమైన 25,000 స్థాయిలో బలమైన పునరుజ్జీవంతో వారం గరిష్ఠ స్థాయి 25,640 సమీపంలో ముగిసింది. ఆరు వారాల కన్సాలిడేషన్ అనంతరం మార్కెట్ బలమైన ర్యాలీతో బ్రేకౌట్ సాధించింది. అలాగే మిడ్ క్యాప్-100 సూచీ కూడా 1,400 పాయింట్ల మేరకు లాభపడి ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 60,000 చేరువకు వస్తోంది. స్మాల్ క్యాప్-100 సూచీ 780 పాయింట్ల లాభంతో 19,000 సమీపంలో నిలిచింది. గత వారం నిట్టనిలువుగా ర్యాలీని సాధించినందు వల్ల ఈ వారంలో తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేట్ కావచ్చు. టెక్నికల్‌గా ట్రెండ్ పాజిటివ్‌గానే ఉన్నా అప్రమత్త ట్రెండ్‌కు ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. ప్రధాన నిరోధ స్థాయిలు 26,000, 26,100. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు. మరింత సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌కు గురైనా సానుకూలత కోసం మైనర్ మద్దతు స్థాయి 25,500 వద్ద నిలదొక్కుకోవాలి. అంతకన్నా దిగజారితే మైనర్ బలహీనత ఏర్పడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 25,000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ 1,200 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించి ఆల్ టైమ్ హై 57,450 వద్ద ముగిసింది. మానసిక అవధి 58,000. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు. ఆ పైన మాత్రమే అప్‌ట్రెండ్ కొనసాగుతుంది. బలహీనపడినా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 57,000 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తున్నందు వల్ల ట్రేడర్లు అప్రమత్తం కావాలి. మరింత అప్‌ట్రెండ్ కోసం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. వీక్లీ చార్టుల్లో బ్రేకౌట్ కనిపిస్తున్నందు వల్ల ఫుల్‌బ్యాక్ రియాక్షన్‌కు కూడా ఆస్కారం ఉంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,760, 25,850
మద్దతు	25,560, 25,500

స్పోర్ట్స్

అల్కారజ్, జొకోవిచ్



హ్యాట్రిక్‌పై అల్కారజ్ గురి

వింబుల్డన్ నేటి నుంచి

25వ గ్రాండ్‌స్లామ్ వేటలో జొకోవిచ్

మహిళల ఫేవరెట్లు గాఫ్, సబలెంక

లండన్: డబుల్ డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్ మరోసారి వింబుల్డన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. సోమవారం నుంచి జరిగే గ్రాస్‌కోర్ట్ గ్రాండ్‌స్లామ్‌లో రెండో సీడ్ అల్కారజ్ విజేతగా నిలిస్తే.. దిగ్గజం రోజర్ ఫెడరర్ తర్వాత హ్యాట్రిక్ సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు. గతేడాది అల్కారజ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ తన 25వ టైటిల్ కలను నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో ఉన్నాడు. కానీ, ఇటీవలి ఫామ్‌తోపాటు జొకో ఫిట్‌నెస్ చూస్తుంటే కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆరో సీడ్‌గా బరిలోకి దిగుతున్న జొకో తొలి రౌండ్‌లో అలెగ్జాండర్ ముల్లర్‌తో తలపడనున్నాడు. అయితే, క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ జాక్ డ్రేపర్ రూపంలో నొవాక్‌కు అసలుసిసలు సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. ఇది గట్టెక్కితే సెమీస్‌లో టాప్ సీడ్ జానిక్ సినర్‌తో ఆడాల్సి రావచ్చు. తొలి రౌండ్‌లో లూకా నర్డీ (ఇటలీ)తో సినర్, ఫాబియో ఫొగ్నిని (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నారు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మెద్వెదెవ్, ఆండీ రుబ్లేవ్, హోల్గర్ రూన్ కూడా సత్తా చాటాలనుకొంటున్నారు.



ప్రాక్టీస్ సెషన్‌లో గాఫ్, సబలెంకా

లైన్ జడ్జిలు లేకుండా..

147 ఏళ్ల వింబుల్డన్ చరిత్రలో తొలిసారి లైన్ జడ్జిలు లేకుండా టోర్నీ జరగనుంది. టెక్నాలజీకి పెద్దపీట వేసిన నిర్వాహకులు ఎలక్ట్రానిక్ లైన్ కాలింగ్ సిస్టమ్‌ను తొలిసారి ఉపయోగించనున్నారు. ఇందుకోసం 450 ట్రాకింగ్ కెమెరాలను కూడా ఉపయోగించనున్నారు. అంతేకాకుండా సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లను రెండు గంటలు ఆలస్యంగా అంటే.. సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. ప్రైజ్‌మనీని కూడా గతేడాదితో పోల్చితే 11 శాతం పెంచారు.

మహిళల పోటీ రసవత్తరం

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ అరియానా సబలెంక, ఫ్రెంచ్ ఓపెన్ విజేత కొకొ గాఫ్, 8వ సీడ్ ఇగా స్వియటెక్ మధ్య పోటీ తీవ్రంగా ఉంది. 2016లో సెరెనా విలియమ్స్ ఏడో టైటిల్ సాధించిన తర్వాత.. వరుసగా కొత్త చాంపియన్లే వస్తున్నారు. కాగా, డిఫెండింగ్ చాంప్ బార్బరా క్రెజికోవా పేలవ ఫామ్ కొనసాగుతుండడంతో ఆమెపై పెద్దగా అంచనాలు లేవు. సబలెంక ముందుకు సాగితే.. క్వార్టర్స్‌లో మాడిసన్ కీస్‌ను ఎదుర్కోవాల్సి రావచ్చు. గతేడాది రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పౌలినీకి క్వార్టర్స్‌లో క్విన్‌వెన్ జాంగ్ రూపంలో గట్టిసవాల్ ఎదురుకావచ్చు. రెండో సీడ్ కొకొ గాఫ్.. తొలి రౌండ్‌లో దయానా ఎస్ట్రీమ్‌స్కాతో, కుదర్మెటోవాతో స్వియటెక్ తలపడనున్నారు. రిబకినా, మిర్రా ఆండ్రీ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకొంటున్నారు.

మన మహిళలకు రెండో విజయం

ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్స్



చియాంగ్ మాయ్ (థాయ్‌లాండ్): ఏఎఫ్‌సీ మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత సీనియర్ జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత మహిళలు 4-0తో తైమూర్ లెసెతె జట్టును చిత్తు చేశారు. వింగర్ మనీషా కళ్యాణ్ (12, 80ని.) రెండు, అంజూ (58ని.), లిండా కోమ్ (86ని.) చెరో గోల్ సాధించారు. తొలి మ్యాచ్‌లో మనోళ్లు 13-0తో మంగోలియాపై నెగ్గారు. ఈ రెండో విజయంతో..మొత్తం ఆరు పాయింట్లతో భారత మహిళలు గ్రూప్ టాపర్‌గా నిలిచారు.



సెమీస్‌లో నిఖత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌తో సహా ముగ్గురు తెలంగాణ బాక్సర్లు సెమీఫైనల్లోకి ప్రవేశించారు. ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రెండో రోజు పోటీల్లో 48-51 కిలోల విభాగంలో నిఖత్ 5-0తో కల్పన (సాయ్)పై తిరుగులేని విజయం సాధించి పతకానికి చేరువైంది. 57-60 కి., కేటగిరీలో జి. నిహారిక 5-0తో ప్రియాంక (చండీగఢ్)పై, 60-65 కి., విభాగంలో యషి శర్మ 3-2తో సరిత రాయ్ (ఉత్తరప్రదేశ్)పై నెగ్గి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నారు. 45-48 కి., మంజు రాణి, 70-75 కి., లవ్లీనా తమ బౌట్లలో గెలిచి, ముందంజ వేశారు.



ఫైనల్లో తన్వీ, ఆయుష్

● యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్

లోవా (యూఎస్): భారత వర్ధమాన షట్లర్లు తన్వీ శర్మ, ఆయుష్ షెట్టి యూఎస్ ఓపెన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో 16 ఏళ్ల తన్వీ 21-14, 21-16తో ఏడో సీడ్ పోలినా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. తుది పోరులో బివిన్ జాంగ్‌తో తన్వీ అమీతుమీ తేల్చుకోనుంది.



పురుషుల సింగిల్స్ సెమీస్‌లో ఆయుష్ 21-23, 21-15, 21-14తో టాప్ సీడ్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)పై పోరాడి గెలిచాడు. ఫైనల్లో మూడో సీడ్ బ్రియాన్ యంగ్‌తో ఆయుష్ తలపడనున్నాడు.

అభిరామ్‌కు 3 స్వర్ణాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో వెన్నం అభిరామ్ మూడు పసిడి పతకాలు కొల్లగొట్టాడు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఈ పోటీల్లో అభిరామ్ 10 మీటర్ల రైఫిల్ సబ్ యూత్, జూనియర్, పురుషుల యూత్ విభాగంలో అన్ని ఈవెంట్లలోనూ 396/400 పాయింట్లు సాధించి ప్రథమ స్థానం సాధించాడు.

మళ్లీ క్రికెట్ ఆడగలనా?

డాక్టర్‌కు పంత్ ప్రశ్న



న్యూఢిల్లీ: ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాక బతుకుతాడో? లేడో? అనే స్థితిలోనూ కీపర్ రిషబ్ పంత్ తన కెరీర్ గురించే ఆలోచించాడట. అతడికి ముంబైలో చికిత్స అందించిన ఆర్థోపెడిక్ సర్జన్ దిన్షా పార్థివాలా ఈ విషయాన్ని చెప్పాడు. 2022 డిసెంబరులో ఢిల్లీ నుంచి స్వస్థలం రూర్కీకి వెళ్తుండగా పంత్ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. 'పంత్ ఆ ప్రమాదం నుంచి బయటపడడం నిజంగా అదృష్టమే. ఇలాంటి సంఘటనల్లో ప్రాణాలతో బయటపడడం చాలా అరుదు. ఇక్కడికి తీసుకువచ్చినప్పుడు అతడి కుడి మోకాలు స్థానభ్రంశమైంది. మెడ నుంచి మోకాలి వరకు చర్మం పూర్తిగా దెబ్బతింది. కానీ కుడి కాలికి రక్తసరఫరా ఆగకపోవడం పంత్‌కు కలిసివచ్చింది. లేకుంటే అతడి కాలు తీసేయాల్సి వచ్చేది. ఇక తను ఇక్కడ అడ్మిట్ అయిన సమయంలో 'నేను మళ్లీ క్రికెట్ ఆడగలనా?' అని అడిగాడు. కానీ పంత్ తల్లి మాత్రం మా బాబు మళ్లీ నడుస్తాడా? అని ప్రశ్నించింది' అని పార్థివాలా వివరించాడు.

ఇంగ్లండ్ మహిళల జట్టుకు జరిమానా

నాటింగ్‌హామ్: భారత మహిళల జట్టుతో శనివారం జరిగిన తొలి టీ20లో స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్ జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. నిర్ణీత సమయం కంటే ఇంగ్లండ్ 2 ఓవర్లు వెనుకంజలో ఉంది.

ఆస్ట్రియన్ గ్రాండ్‌ప్రీ విజేత నోరిస్

స్పీల్‌బర్గ్ (ఆస్ట్రియా): మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ ఆస్ట్రియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములావన్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేసులో మెక్‌లారెన్‌కే చెందిన ఆస్కార్ పియాస్ట్రిని వెనక్కినెట్టి టాప్‌లో నిలిచాడు.

సిక్స్ కొట్టి.. కుప్పకూలి

క్రికెటర్ హఠాన్మరణం

ఫిరోజ్‌పూర్ (పంజాబ్): క్రికెట్ మ్యాచ్ ఆడుతూ గుండెపోటుతో ఆటగాడు మరణించిన విషాద ఘటన ఆదివారం ఇక్కడ చోటు చేసుకుంది. స్థానిక డీఏవీ స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో హర్జిత్ సింగ్ అనే ఆటగాడు సిక్సర్ కొట్టాడు. అనంతరం మరో ఎండ్‌లో ఉన్న బ్యాటర్‌తో మాట్లాడేందుకు పిచ్ మధ్యలోకి వెళ్లాడు. అక్కడ మోకాళ్లపై కొన్ని క్షణాలు కూర్చొని ఎడమవైపు ఒరిగిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకున్న హర్జిత్‌కు సీపీఆర్ చేసి రక్షించేందుకు సహచర క్రికెటర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హర్జిత్ గుండెపోటుతో మరణించినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు.

పట్టుబిగించిన దక్షిణాఫ్రికా

బులవాయో: జింబాబ్వేతో తొలి టెస్ట్ రెండోరోజే దక్షిణాఫ్రికా పూర్తిగా పట్టు బిగించింది. ముల్డర్ (4వికెట్లు), యూసుఫ్, కేశవ్ మహరాజ్ (చెరి 3 వికెట్లు) రాణించడంతో జింబాబ్వే 251 పరుగులకే ఆలౌటైంది. విలియమ్స్ (137) శతకం సాధించాడు. దీంతో సఫారీలకు 167 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆదివారం ఆఖరికి వికెట్ నష్టానికి 49 పరుగులు చేయడంతో సఫారీల ఆధిక్యం 216 పరుగులకు చేరింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 418/9 వద్ద డిక్లేర్ చేసింది.

200 వికెట్ల కేశవ్: తాత్కాలిక కెప్టెన్ కేశవ్ మహరాజ్ టెస్ట్‌ల్లో 200 వికెట్లు సాధించిన తొలి సఫారీ స్పిన్నర్‌గా రికార్డులకెక్కాడు. రెండోరోజు ఆటలో జింబాబ్వే సారథి ఇర్విన్‌ను అవుట్ చేసిన 35 ఏళ్ల కేశవ్ ఈ ఫీట్ అందుకున్నాడు.

అప్పుడు గుండె ఆగినంత పనైంది..





న్యూఢిల్లీ: భారత జట్టు రెండో టీ20 ప్రపంచకప్‌ను సాధించి ఈనెల 29కి ఏడాది పూర్తయ్యింది. దక్షిణాఫ్రికాతో జరిగిన నాటి ఫైనల్లో భారత్ విశ్వకప్ గెల్చుకుంది. ఆ మ్యాచ్ చివరి ఓవర్‌లో సూర్యకుమార్ బౌండరీ లైన్ దగ్గర చక్కగా బ్యాలెన్స్ చేసుకుంటూ పట్టిన క్యాచ్ అత్యంత ముఖ్యమైంది. అయితే ఆ క్యాచ్ రివ్యూ సమయంలో తాము పడిన ఆందోళన అంతా ఇంతా కాదని అప్పటి కెప్టెన్ రోహిత్ తెలిపాడు. 'సూర్య క్యాచ్‌ను థర్డ్ అంపైర్ చెక్ చేస్తున్నప్పుడు మాకు గుండె ఆగినంత పనైంది. నిజానికి ఆ బంతి వెళ్లిన తీరుకు కచ్చితంగా బౌండరీ లైన్ దాటాల్సిందే. కానీ అప్పుడు వీచిన బలమైన గాలులకు బంతి కాస్త గ్రౌండ్‌లోకి వచ్చినట్టుంది. అలాగే థర్డ్ అంపైర్ నిర్ణయం చూసేందుకు కూడా నాకు ధైర్యం చాల్లేదు. అందుకే అవుటా? నాటౌటా? అనేది నువ్వే చూసి చెప్పు అని సూర్యతో అన్నా' అని రోహిత్ గుర్తుచేసుకున్నాడు. మరోవైపు సఫారీలకు 30 బంతుల్లో 30 రన్స్ కావాల్సిన వేళ పంత్ హఠాత్తుగా మోకాలి నొప్పంటూ సైగ చేయడంతో మ్యాచ్ కాసేపు ఆగింది. అయితే రోహిత్ మాత్రం పంత్‌ది నిజమైన నొప్పే అని భావించాడట. కానీ ప్రత్యర్థిలయను దెబ్బతీసేందుకు పంత్ పన్నిన వ్యూహమని తర్వాత తెలిసిందని రోహిత్ చెప్పాడు.

అందరం రోడ్డెక్కాలి!



కుటుంబ సారథుల నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు.. 'తొలి అడుగు' విజయవంతం చేద్దాం: లోకేశ్

అమరావతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నెల రోజులు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ పార్టీ శ్రేణులు, నేతలకు పిలుపిచ్చారు. కుటుంబ సాధికార సారథుల నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు అందరం రోడ్డెక్కాలని, అందరూ పాల్గొనాలని స్పష్టం చేశారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏడాది హనీమూన్ పూర్తయిందని చెప్పారు. తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని.. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని యాప్‌లో నమోదు చేయాలని.. మై టీడీపీ యాప్ ద్వారా మీరు చేసిన పనులు నాయకత్వానికి తెలియజేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో 94 శాతం సీట్లను ప్రజలు గెలిపించారని, దీనికి ప్రధాన కారణం.. గత పాలకుల అహంకారం, వారి పని విధానమని చెప్పారు. 151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారమే.. దీనిని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. 'ఈ గెలుపు వెనుక కార్యకర్తల కష్టం ఉంది. నేను యువగళం పాదయాత్ర ప్రారంభించినప్పుడు కబ్ (క్లస్టర్, యూనిట్, బూత్) వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఇది వచ్చాకే బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమైంది' అని చెప్పారు. క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల్లో యువతకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయి నుంచే మహిళలను ప్రోత్సహించేందుకు కబ్‌లో కో కన్వీనర్ పదవి తీసుకొచ్చామన్నారు. కమిటీలు వేసే ముందు స్థానిక నాయకత్వంతో మాట్లాడాలని సూచించారు. 90% కుటుంబ సారథులు, 82% బూత్‌లు, 80% యూనిట్లు, 80% క్లస్టర్లు పూర్తయ్యాయని.. అనుబంధ విభాగాలను బలోపేతం చేయాల్సిన అవసరముందని తెలిపారు. పనిచేసే వారికే ఆయా కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జూలై 5 నాటికి కమిటీలన్నీ పూర్తి చేయాలన్నారు. కష్టపడిన కార్యకర్తలను మరవొద్దని అందరినీ కోరుతున్నామన్నారు. వారిని విస్మరించకుండా ఉండేందుకే పరిశీలకులను వేశామని చెప్పారు. కుప్పంలో సంస్థాగత నిర్మాణం వల్లే చంద్రబాబు వరుసగా విజయం సాధిస్తున్నారని.. కచ్చితంగా సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..

నిర్ణేతలు ప్రజలు..

ఎవరూ శాశ్వతం కాదు. మనం ఎక్కడ కూర్చోవాలో ప్రజలే నిర్ణయిస్తారు. పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. 164 మంది టీడీపీ కూటమి ఎమ్మెల్యేల్లో 88 మంది మొదటిసారి గెలిచారు. మంత్రివర్గంలో 25 మందిలో 17 మంది మొదటిసారి గెలిచినవారు ఉన్నారు. ఇక్కడున్న వారిలో చాలా మంది ప్రతిపక్షంలో ఉండగా వేధింపులకు గురైన వారూ, అక్రమ కేసులు నమోదైన వారు, జైలుకెళ్లిన వారు కూడా ఉన్నారు. ఇవాళ సెల్యూట్ కొడుతున్న పోలీసులే.. మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు పెట్టి వేధించారు. పార్టీ కార్యాలయంపై దాడిచేస్తే పట్టించుకోలేదు. మనం మాత్రం అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలి. మొన్న ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించడాన్ని వెళ్లినప్పుడు పొగాకు రైతుల సమస్య గురించి తెలుసుకున్నాను. వెంటనే చంద్రబాబుతో పాటు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాం. ఈ రోజు నేను ఒక్క పెట్టుబడి తీసుకొచ్చేందుకే అహర్నిశలు కష్టపడుతున్నా. మన నియోజకవర్గ పని కోసం ఇంకెంత కష్టపడాలి? మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. పార్టీయే మనకు సుప్రీం.. దేశం, ప్రపంచం మొత్తం తిరిగినా తిరిగి వచ్చేది పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికే. అందుకే ప్రతి జిల్లాలో, నియోజకవర్గంలో పార్టీ కార్యాలయం నిర్మించాలని చెప్పాం. జాతీయ స్థాయిలో బీజేపీకి తప్ప ఇంత పెద్ద కార్యాలయం మరే పార్టీకి లేదు. మనది ఒక వ్యవస్థ.

సీనియర్ల అనుభవం, యువత శక్తి జోడించాలి..

సీనియర్ల అనుభవాన్ని, యువత శక్తినీ జోడించాల్సిన అవసరముంది. సీనియర్లే నాలుగు దశాబ్దాలు పార్టీని ముందుకు తీసుకెళ్లారు. దామాషా ప్రకారం పదవులివ్వాలి. అందరినీ కలుపుకొని పోవాలి. నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణం బాగా చేసిన వారిలో మంత్రి నిమ్మల రామానాయుడు నంబర్‌వన్‌గా ఉన్నారు. మంగళగిరి ఐదో స్థానంలో ఉంది. మనలో పోటీతత్వం రావాలి. బాగా పనిచేసిన కార్యకర్తలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించాలి. నా నియోజకవర్గ పర్యటనలో ముందుగా బాగా పనిచేసిన కార్యకర్తలను సత్కరిస్తాం. నెల పాటు తు.చ. తప్పకుండా అందరం డోర్ టు డోర్ వెళ్లి విజయవంతం చేద్దాం.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా..

సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూడా తల్లికి వందనం అమలు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించాం. ఆర్థిక వనరులు సమకూర్చుకుని, అహర్నిశలు కష్టపడి అద్భుతమైన కార్యక్రమాలు చేస్తున్నాం. అన్నీ చేశామని చెప్పడం లేదు. పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

ఇంటింటికీ వెళ్లండి..

ప్రభుత్వం చేస్తున్న మేలు చెప్పండి

- పదవులను బాధ్యతగా భావించాలి
- 'తొలి అడుగు'లో టీడీపీ నేతలు

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పదవులు అలంకారం కాదని, బాధ్యతగా భావించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. 'కూటమిలో మనం పెద్దన్న పాత్ర పోషించాలి. భాగస్వాములతో పొరపొచ్చాలు లేకుండా సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి. సమన్వయం ఉంటే ఎంత పెద్ద కార్యక్రమమైనా విజయవంతం అవుతుందనడానికి యోగాంధ్ర కార్యక్రమం నిదర్శనం. కేంద్ర క్యాబినెట్‌లో యోగాంధ్ర సక్సెస్ గురించి, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి. 57 నియోజకవర్గాలు సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో వెనుకబడ్డాయి' అని అన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి: పెమ్మసాని



ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును ఇంటింటికి వెళ్లి చెప్పాలని, అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. అమరావతిపై అపోహలను తొలగించాలని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మనం ముందుకు వెళ్లాలంటే కంపెనీలు రావాలన్నారు. ప్రభుత్వంపై నమ్మకం కలగాలని, ప్రతి నాయకుడు తమ తమ ప్రాంతాల్లో కంపెనీల ఏర్పాటుకు కృషి చేసి, ఉద్యోగ కల్పనకు సహకరించాలని కోరారు. స్కూళ్లు, హాస్టళ్లు, ఆసుపత్రుల పరిశీలనతో పాటు ప్రజా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందేలా నాయకులు నడుచుకోవాలన్నారు.

విజయం పార్టీ కార్యకర్తల కష్టం: కొల్లు



2024 ఎన్నికల్లో మనం సాధించిన విజయం పార్టీ కార్యకర్తల కష్టమని సగర్వంగా చెప్పగలమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తోట చంద్రయ్య లాంటి కార్యకర్తల ప్రాణ త్యాగాల వల్లనే మనం గెలిచామన్నారు. ఈ విజయాన్ని ఇలాగే కొనసాగించాలంటే కార్యకర్తల్ని కాపాడుకోవాలన్నారు. మనం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు.

ప్రజల వద్దకు వెళ్లాలి: టీజీ భరత్



నాటి చంద్రబాబు విజన్ 2020ని ఆదర్శంగా తీసుకుని తన నియోజకవర్గంలో విజన్ యాత్ర చేపట్టానని, డోర్ టు డోర్ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నానని మంత్రి టీజీ భరత్ తెలిపారు. గడప గడపకు వెళ్లినప్పుడు గ్రౌండ్ రియాలిటీ తెలుస్తుందని, అప్పుడే ప్రజలకు చేరువ కావొచ్చని, ప్రజా నాయకుడు కావచ్చని అన్నారు. టీవీలు, సోషల్ మీడియా ద్వారా మనకు తెలిసేది 50 శాతం మాత్రమేనని, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలన్నారు.

చంద్రబాబు భరోసా ఇచ్చి గెలిపించారు: బైరెడ్డి శబరి



నంద్యాలలో తాను ఓడిపోతానని భయపెట్టారని, మన అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించారని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. చంద్రబాబు తనను ఎంపీగా కాకుండా కార్యకర్తగా పనిచేయాలని సూచించారని, తాను కార్యకర్తగా ప్రజల వద్దకు వెళ్లి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్నానని తెలిపారు. మహిళల పురోగతితోనే సమాజ వికాసం సాధ్యమని నమ్మి వారికి పెద్ద పీట వేసిన చరిత్ర టీడీపీదేనన్నారు.

చంద్రబాబు మాటలు స్ఫూర్తినిచ్చాయి: గురజాల జగన్‌మోహన్

నాడు జన్మభూమి కార్యక్రమం పెట్టినప్పుడు చంద్రబాబు మాటలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, ఆదర్శంగా తీసుకుని పుట్టిన గడ్డకు ఏదైనా చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. విజనరీ లీడర్ చంద్రన్న సారథ్యంలో రాష్ట్రం, తెలుగు ప్రజలు ప్రపంచ పటంలో మేటిగా ఉండేందుకు తన వంతు పనిచేస్తానన్నారు.

నామోషీ వద్దు

'తొలి అడుగు'తో జనంలోకి వెళ్లండి



టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొన్న మంత్రులు నిమ్మల, సంధ్యారాణి , అనిత, ఆనం, అనగాని, కేశవ్, రవికుమార్, డోలా తదితరులు



- గత ప్రభుత్వం చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం దిశగా నడిపిస్తున్నాం. ఏడాదిలో అన్నీ చేశానని చెప్పడం లేదు. ఏడాదిలో తొలి అడుగు మాత్రమే వేశాం. ఇంకా చేయాల్సింది చాలా ఉంది.
- తప్పుడు ప్రచారాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. నిజం గడప దాటేసరికి.. అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది. అందుకే వాస్తవాలను పదే పదే ప్రజలకు వివరించాలి.

\- టీడీపీ అధినేత చంద్రబాబు

సంక్షేమం.. అభివృద్ధిలో మనమే టాప్

దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఏడాదిలో రూ.9.34 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రమోట్ చేస్తున్నాం. దేశంలోనే మొదటిసారి క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. సంక్షేమంలోను.. అభివృద్ధిలోనూ దేశంలో మనమే అగ్రభాగాన ఉంటాం. పాలసీలు ఎంత మంచివైనా.. అమల్లో తూట్లు పొడిస్తే సమస్యలు వస్తాయి. పొరపాటు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను.. ఎన్నికల ముందు కాదు.. నిత్యం ప్రజల్లో చర్చనీయాంశం చేయాలి.

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): 'ఏ ప్రభుత్వమైనా చేసిన పనులు చెప్పుకోవాలి.. ఏ నాయకుడైనా ప్రజల్లోకి వెళ్లడానికి నామోషీపడకూడదు' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. పనిచేయడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉండడమూ ముఖ్యమేనని.. చేసిన మంచి పనులను పదే పదే వారికి తెలియజెప్పాలని.. అదే సమయంలో చేయలేకపోయిన పనులు ఎందుకు చేయలేదో వివరించాలని తెలిపారు. చేసిన మంచిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పుకోలేకపోవడం మన లోపమని.. అందుకే ఈసారి.. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చెప్పేందుకే జూలై 2 నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. జాతీయ అధ్యక్షుడు మొదలు కిందిస్థాయి కార్యకర్త వరకు నెల రోజులపాటు రాష్ట్రంలోని ప్రతి ఇంటి తలుపూ తట్టాలని.. చేసిన మంచి వివరించాలని తెలిపారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. నేతలు, శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వైసీపీ చెప్పే అబద్ధాలను తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. ఇంకా ఏమన్నారంటే..

చేసింది చెప్పుకోలేక ఓడిపోయాం..

గతంలో మనం పనిచేయక ఓడిపోలేదు.. చేసింది చెప్పుకోలేకే ఓడిపోయాం. 1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఆర్థిక సంస్కరణలతో అభివృద్ధిని పరుగులు పెట్టించా. నాడు రాజకీయం వదిలేశాం. చేసిన పనులు ప్రజలకు చెప్పలేకపోయాం. 2019లోనూ అదే పొరపాటు పునరావృతమైంది. మనం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు వైసీపీ కుట్రలనూ ప్రజలకు వివరించాలి. ప్రజలు 94 శాతం స్ట్రయిక్ రేటుతో మనల్ని గెలిపించారు. దానిని కాపాడుకోవలసిన బాధ్యత మనపైనే ఉంది. దక్షిణ భారతంలో ఏపీది విభిన్నమైన పరిస్థితి. రాష్ట్రాదాయంలో సేవల రంగం కీలకం. దీని నుంచి ఎక్కువ ఆదాయం రావలసి ఉన్నా కేవలం 46 శాతమే వస్తోంది. కాబట్టి ఈ రంగానికి ప్రాధాన్యమివ్వాలి. వ్యవసాయం నుంచి 35 శాతం రాబడి వస్తోంది. ఈ రంగాన్నీ అభివృద్ధి చేయాలి.

అప్పుడు అప్రమత్తంగా ఉండి ఉంటే..

నాడు అధికారం కోసం కోడికత్తి డ్రామా, బాబాయి హత్య వంటివి చేశారు. తర్వాత అధికారం నిలబెట్టుకోవడానికి గులకరాయి డ్రామా ఆడారు. నేడు సంఘ విద్రోహశక్తులను కూడగడుతున్నారు. గతంలో మాదిరిగా ప్రత్యర్థులు తప్పుడు ప్రచారం చేసే అవకాశం ఈసారి ఇవ్వకూడదు. 2019 ఎన్నికల సమయంలో వివేకాని హత్య చేసి సాక్షిలో గుండెపోటుతో చనిపోయారని ప్రసారం చేశారు. నేనూ నిజమని నమ్మాను. మనం ఎన్నికల హడావుడిలో ఏమరుపాటులో ఉండగా.. హత్య చేసినవారు జాగ్రత్తపడ్డారు. వివేకా కూతురు వచ్చి పోస్టుమార్టం చేయాలని అడుగగా.. గొడ్డలివేటని తేలడంతో వెంటనే మాటమార్చి నా తండ్రిని, బాబాయిని చంపి నన్ను అనాథను చేశారంటూ కొత్త డ్రామా మొదలెట్టారు. నాపై నిందలేశారు. ఆ సమయంలో 2 గంటల సమయం కేటాయించి, ఏమాత్రం అప్రమత్తంగా ఉండి సరిగ్గా వ్యవహరించినా.. హత్యచేసిన వారిని పట్టుకుని ప్రజల ముందు నిలబెట్టేవాళ్లం. ఎన్నికల్లో ఓటమిపాలయ్యేవాళ్లమూ కాదు.

గంజాయి బ్యాచ్‌లకు పరామర్శా?

ఆర్థిక ఉగ్రవాదులతో దేశానికి, రాష్ట్రానికి ఎంతో ప్రమాదం. రౌడీలు రాజకీయ ముసుగు వేసుకున్నప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదం. రాజకీయ నాయకులు పరామర్శలు చేయడంలో తప్పు లేదు. కానీ గంజాయి బ్యాచ్‌లను, రౌడీషీటర్లనా పరామర్శించేది! తన కారు కిందే కార్యకర్త పడిపోతే పక్కనపడేసి వెళ్లిపోయారంటే ఏం చెప్పాలి? దీనికి సంబంధించిన ఆధారాలు లభ్యమైన తర్వాత కూడా తప్పుడు ఆరోపణలు చేస్తారా? ఓ పాస్టర్ ప్రమాదంలో చనిపోతే.. పోలీసులే చంపారని రాద్ధాంతం చేస్తున్నారు. దేశంలో ఏ పార్టీ కూడా వైసీపీలా బరితెగించి ప్రవర్తించడం లేదు. తప్పుచేసిన వారిని కఠినంగా శిక్షిస్తాం. ఎవరినీ వదిలిపెట్టం.

తానా.. ఆటా.. అంటే టాటానే!

వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కౌంట్ డౌన్ పెట్టుకుని పనిచేస్తున్నాం. ఇప్పటికే ఏడాది పూర్తయింది. రెండో ఏడాది ప్రారంభమైంది. వచ్చే నెల రోజులూ ప్రజల్లో ఉంటూ ప్రతి ఇంటి గడపను తొక్కాలి. చాలా మంది తానా.. ఆటా అంటూ ఫారిన్ ట్రిప్పులకు వెళ్తున్నారు. తానా, ఆటా అంటే టాటా చెప్పేస్తా.

\- చంద్రబాబు

మళ్లీ అదే విషం..

గతంలో అమరావతిపై విషం చిమ్మారు. ఇప్పుడు మళ్లీ అదే చేస్తున్నారు. మైనింగ్ ఆదాయం చూపి అప్పు తెస్తే లేఖలు రాస్తున్నారు. మనం వారిలా మద్యం ఆదాయం తాకట్టు పెట్టో, ప్రభుత్వ ఆస్తులు తనఖాపెట్టో అప్పులు తేవడం లేదు. కేంద్ర నిబంధనలకు అనుగుణంగానే రుణ సమీకరణ చేస్తున్నాం. అప్పులతో సంక్షేమం చేయడం కాదు.. అభివృద్ధితో సంపద సృష్టించి సంక్షేమం చేయాలనేది మన ఆలోచన. గడచిన ఐదేళ్లలో ఏ పనీ చేయని వారు ఇప్పుడు రీకాల్ అంటూ మాట్లాడుతున్నారు. ఎవరిని రీకాల్ చేయాలి? ఒక మాజీ సీఎం రప్పా రప్పా నరికితే తప్పు లేదంటారా? బూతులు మన విధానం కాదు. టీడీపీ ఉమ్మడి కుటుంబంలాంటిది. ఎర్రన్నాయుడు పార్టీ కోసం పనిచేశారు. ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రి అయ్యారు. బాలయోగి చనిపోయేనాటికి హరీశ్ చిన్నవాడు. 2024 ఎన్నికల్లో ఎంపీగా సీటు ఇచ్చి గెలిపించుకున్నాం. అదీ బంధాలకు టీడీపీ ఇచ్చే విలువ. కేంద్రంలో కీలకంగా వ్యవహరించేలా చాలాసార్లు టీడీపీకి అవకాశాలు వచ్చాయి. అయినా మనం బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయం. మనకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. కేంద్రం సహకారం లేనిదే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఏడాదిలో బయటకు తెచ్చే వాళ్లం కాదు. విశాఖ స్టీల్ ప్లాంటును లాభాలబాట పట్టించే అవకాశం ఉండేది కాదు. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు. సుస్థిర ప్రభుత్వం చాలా ముఖ్యం. సింగపూర్‌లో 60 ఏళ్లుగా ఒకే పార్టీ.. నలుగురు ప్రధానులు. 2019లో టీడీపీ గెలిచి ఉంటే రాష్ట్రం రూపురేఖలు మారిపోయేవి.



వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాటామంతీ

టార్గెట్ 2029

- 2024లో మొహమాటాలకు తావులేకుండా గెలుపే లక్ష్యంగా టికెట్లు ఇచ్చాం.. దానివల్లే చాలా మంది యువత, తొలిసారి ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచారు. 2029లోనూ ఇదే వ్యూహం. పనితీరు బాగా లేనివారికి గుడ్‌బై.
- కార్యకర్తలతో ప్రజాప్రతినిధులు అనుసంధానం కావాలి. మనకు అధిష్ఠానం వారే. ఎంతో మంది నేతలు పార్టీ మారినా.. కార్యకర్తలు మాత్రం 45 ఏళ్లుగా పార్టీ జెండా మోస్తున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏడు గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఏడాది పాలన విజయాలపై ప్రజల్లోకి వెళ్లి వివరించడంపై పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సమావేశం ప్రారంభంలో మాట్లాడిన చంద్రబాబు.. ముగింపులో సుమారు 2 గంటలు ప్రసంగించారు. ముగింపు సమావేశంలో తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు చురకలు అంటించారు. పనిచేయకుండా సలహాలకే పరిమితమయ్యే ఎమ్మెల్యేలు భవిష్యత్ నాయకులుగా ఉండలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్నవారికే పదవులైనా, టికెట్లయినా ఇస్తామని స్పష్టం చేశారు. 'గత ఎన్నికల్లో సోషల్ ఇంజనీరింగ్ చేశాం. రాష్ట్రంలో మొదటిసారిగా కులాలు, మతాల దామాషా ప్రకారం అందరికీ న్యాయం చేశాం. వీటన్నింటి పర్యవసానమే 2024 ఎన్నికల సత్ఫలితాలు. ప్రజలు కూడా సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుని మనకు అధికారం ఇచ్చారు.' అని తెలిపారు. కాగా.. తొలి అడుగు కార్యక్రమం కారణంగా ప్రభుత్వ సమీక్షల నుంచి మంత్రులకు వెసులుబాటు కల్పించారు.

..లేకుంటే అంతే సంగతి

ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుతోపాటు పాలనపై ఎప్పటికప్పుడు సర్వేల రూపంలో సమాచారం తెప్పించుకుంటున్నానని.. అన్ని సర్వేలను విశ్లేషించి బేరీజు వేస్తున్నానని సీఎం చెప్పారు. 'ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నాను. వారు చెప్పిన మాటల్లో ఆచరించదగినవి ఉంటే అమలు చేస్తా. వారిలో ఏమైనా తప్పులుంటే సరిచేసుకోవడానికి సమయం ఇస్తా. పనితీరు మార్చుకుంటే సరి.. లేకపోతే అంతే సంగతులు. నిర్మొహమాటంగా నిర్ణయం తీసుకుంటా. ఇది ఎమ్మెల్యేలకే కాదు. నా సొంత నియోజకవర్గంలో ఎవరు తప్పుచేసినా పక్కన పెడతా' అని తెలిపారు. 'కొందరు ఎంతో పనిచేస్తారు. కానీ మంచి పేరు రాదు. ఇంకొందరు పెద్దగా పనిచేయకున్నా ప్రజల్లో మంచి పేరు ఉంటుంది' అని చెప్పారు. 'ప్రజలు, కార్యకర్తలకు నచ్చని విషయాలు ఉంటే సరిచేసుకుందాం. ప్రజలు మెచ్చాలి.. కార్యకర్తలు ఆమోదించాలి. ఇప్పుడు గెలిచిన వాళ్లు.. మళ్లీ మళ్లీ గెలవాలన్నదే నా ఆశ. పార్టీలోని ప్రతి ఒక్కరూ అదే తరహాలో ఆలోచన చేయాలి' అని సూచించారు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలుస్తామనే ధీమా వద్దు.. 2024 ఎన్నికల్లో మనకంటే ఎక్కువ ఖర్చు పెట్టిన వాళ్లకు కేవలం 11 సీట్లే వచ్చాయి. డబ్బులతో ఎన్నికల్లో గెలువలేమనే విషయం స్పష్టమైంది. ఐదేళ్లపాటు పనిచేసి, రూ.4 వేలు పింఛను ఇచ్చి, ఊరూరా రోడ్లువేసి ఎన్నికల్లో డబ్బులు పంచడం బాధాకరం. ఆదర్శవంతమైన అభివృద్ధి రాజకీయాలు చేద్దాం.

లోకేశ్‌లా పనిచేయాలి..

'మంచి నాయకులకే ప్రజల్లో గుర్తింపు, గౌరవం ఉంటుంది. చెడ్డ నాయకులకు మంచి నియోజకవర్గం ఇస్తే చెడగొడతారు. మంచి నాయకులకు అలాంటి నియోజకవర్గం ఇచ్చినా మంచిగా మారుస్తారు. దీనికి ఉదాహరణ లోకేశ్. 2019లో విశాఖపట్నం నుంచి పోటీ చేయాలని ఆయనకు సూచించాను. లేదు.. మంగళగిరిలో పార్టీ ఎప్పుడూ గెలువలేదు.. అక్కడి నుంచే పోటీ చేస్తానని చెప్పారు. నెల ముందు నియోజకవర్గానికి వెళ్లారు. తక్కువ మెజారిటీతో ఓడిపోయారు. ఆ తర్వాత ఐదేళ్లు అక్కడే కష్టపడి పనిచేసి 2024లో మూడో అతిపెద్ద మెజారిటీతో విజయం సాధించారు. గెలిచిన తర్వాత కూడా నియోజకవర్గాన్ని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. తొలిసారి గెలిచిన మిగతావారు కూడా ఇలాగే పనిచేయాలి. నేను 9వసారి ఎమ్మెల్యే అయ్యాను. మొదటిసారి గెలిచిన వాళ్లు కూడా వచ్చి ఏం చేయాలో నాకు చెబుతున్నారు' అని చంద్రబాబు ఆక్షేపించారు. రాబోయే 30 ఏళ్లకు అవసరమైన నాయకత్వాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో యువతకు అవకాశం ఇస్తున్నానని చెప్పారు. 'దేశంలోనే యంగెస్ట్ లెజిస్లేచర్ పార్టీ, యంగెస్ట్ పార్లమెంటేరియన్లు ఉన్న పార్టీ టీడీపీ. అమిత్‌షా కూడా ఇదే చెప్పారు' అని గుర్తుచేశారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనే ఓపికా లేదా?

ప్రతిపక్షంలో ఉంటే ఎంత జాగ్రత్తగా ఉంటామో అధికారంలో ఉన్నప్పుడూ అంతే జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబు చెప్పారు. కనీసం పింఛన్ల పంపిణీలో పాల్గొనే ఓపిక కూడా చాలా మంది ఎమ్మెల్యేలకు ఉండడం లేదంటూ తప్పుబట్టారు. ప్రజాప్రతినిధులకు ఏమైనా సమస్యలు ఉంటే బయట మాట్లాడొద్దని, నేరుగా తనకు చెప్పాలన్నారు.

56 మంది డుమ్మాపై ఆగ్రహం

విస్తృతస్థాయి సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు మొత్తం 56 మంది గైర్హాజరు కావడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పార్టీ కార్యక్రమాల కంటే ఇతర కార్యక్రమాలు ఎక్కువయ్యాయా? పార్టీ సమావేశాలకే రానివారు ఇక నియోజకవర్గాల్లో ఏం తిరుగుతారు.. ఏం పనిచేస్తారు' అని మండిపడ్డారు. ఎంత మంది ఎమ్మెల్యేలు వచ్చారు.. ఎంత మంది సంతకాలు పెట్టి వెళ్లిపోయారు.. చివరివరకు ఎంత మంది ఉన్నారనే వివరాలు తీసుకున్న ఆయన.. వారితో మాట్లాడతానని చెప్పారు.

ఎమ్మెల్యేలు.. సమస్యల ప్రస్తావన

కొందరు ఎమ్మెల్యేలు క్షేత్ర స్థాయి సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు.. రేషన్ దుకాణాల అంశాన్ని ప్రస్తావించారు. ఏజెన్సీలో ఇళ్లు దూరం దూరంగా ఉంటాయని.. వారంతా రేషన్ తీసుకునేందుకు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తోందని చెప్పగా.. దీనిపై కసరత్తు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం పథకంలో నిబంధనలు మార్పులు చేయడం కుదరదని స్పష్టం చేశారు. తమ తమ నియోజకవర్గాల్లో పార్టీ పటిష్ఠానికి వినూత్నంగా పనిచేస్తున్న కొందరు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో మాట్లాడించారు. రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నా శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న పనులు బాగున్నాయని సీఎం ప్రశంసించారు. నాయకులు ఎలా ఉండకూడదో వివరిస్తూ.. జగన్ సత్తెనపల్లి పర్యటనను ప్రస్తావించారు. ఈ ఘటనపై ఆయన ఇంతవరకు సంతాపం తెలియజేయలేదని, ఇలాంటి వ్యక్తిని నాయకుడిగా భావిస్తే ఎవరికైనా పతనం తప్పదన్నారు.

దేశమంతా విస్తరించిన రుతుపవనాలు



- బంగాళాఖాతంలో అల్పపీడనం
- అటు హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరదలకు 17 మంది మృతి
- ఉత్తరాఖండ్‌కు రెడ్ అలర్ట్.. చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

విశాఖపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండురోజుల్లో ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్ దిశగా పయనించనుంది. గుజరాత్‌లోని కచ్ పరిసరాల్లో ఏర్పడిన మరో అల్పపీడనం బలహీనపడిప్పటికీ.. రాజస్థాన్‌లో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. ఈ ప్రభావంతో రుతు పవనాలు చురుగ్గా మారి ఆదివారం పశ్చిమ రాజస్థాన్, పశ్చిమ యూపీ, హరియాణా, ఢిల్లీలోకి ప్రవేశించాయి. దీంతో దేశంలోని అన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించినట్టయింది. నైరుతి సీజన్‌లో జూన్ 29 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, విదర్భ, మధ్య మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బిహార్, అసోం, మరికొన్ని ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. గుజరాత్, కేరళ, ఈశాన్య రాష్ట్రాలు, ఝార్ఖండ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లో జూన్‌లోనే వరదలు సంభవించాయి. కొన్ని రాష్ట్రాల్లో కుంభవృష్టి, మరికొన్ని రాష్ట్రాల్లో వర్షాభావం కొనసాగుతుండటంపై వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హిమాచల్‌లో ఆకస్మిక వరదలు

హిమాచల్‌ప్రదేశ్‌ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 17 మంది మరణించినట్టు ప్రభుత్వం తెలిపింది. రూ.300 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా వేసింది. అనేక ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, విద్యుత్, తాగునీటి సరఫరా స్తంభించిపోయాయని రెవెన్యూ, గిరిజనాభివృద్ధిశాఖల మంత్రి జగత్ సింగ్ నేగీ చెప్పారు. కొండప్రాంతాలకు వచ్చే పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్తరాఖండ్‌లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం చార్‌ధామ్ యాత్రను 24 గంటలపాటు నిలిపివేసింది. వాతావరణం మెరుగయ్యే వరకు పర్యాటకులు కొండ ప్రాంతాల్లోకి వెళ్లొద్దని సూచించింది. రిషికేశ్‌కు చేరుకున్న యాత్రికులు అక్కడే ఆగిపోవాలని, అక్కడి నుంచి ముందుకు కదిలిన యాత్రికులు నిర్దేశిత సురక్షిత ప్రదేశాల్లో ఆగాలని గఢ్‌వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే సూచించారు. ఝార్ఖండ్‌లోని తూర్పు సింగ్భూమ్ జిల్లాలో భారీ వర్షాలకు ఒక ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాల భవనం నీటమునగడంతో శనివారం రాత్రి నుంచి సుమారు 162 మంది విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. వారిని ఉపాధ్యాయులు పాఠశాల పైకప్పు మీదికి తరలించారు. ఆదివారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందడంతో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో బోట్లలో వచ్చి తాళ్ల సాయంతో గ్రామస్థులతో కలిసి వారిని కాపాడారు.



స్పిల్‌వే నుంచి విడుదలవుతున్న గోదావరి జలాలు

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఉప నదులు, కొండవాగుల వరద గోదావరిలో కలిసి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. అదనంగా వస్తున్న జలాలను పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే 48 గేట్లు, స్పిల్‌వేలో 6 స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు విడిచిపెడుతున్నారు. 28,879 క్యూసెక్కుల జలాలను విడుదల చేసినట్టు అధికారులు ఆదివారం తెలిపారు. స్పిల్‌వే ఎగువన 26.090 మీటర్లు, దిగువన 17.290 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య 15.320 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

బీజేపీతో జగన్‌ది అక్రమ పొత్తు

- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల



మచిలీపట్నం, భీమవరం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సక్రమ పొత్తు పెట్టుకున్నారని, జగన్‌ది మాత్రం బీజేపీతో అక్రమ పొత్తు అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రంలో బీజేపీని ఎదిరించే దమ్ము కాంగ్రెస్‌కే ఉందన్నారు. కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మచిలీపట్నంలో జరిగింది. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర విభజన హామీలపై దారుణంగా మోసం చేసినా, కూటమి ప్రభుత్వం, వైసీపీ మౌనంగా ఉన్నాయన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితేనే విభజన హామీలు అమలవుతాయని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికే జిల్లా పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో పనిచేయనివారు ఎంతటివారైనా పక్కన పెడతామని చెప్పారు. తన జిల్లాల పర్యటన పూర్తయిందన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష

ఎన్నికకు నోటిఫికేషన్

- నేడు నామినేషన్లు.. రేపు అధ్యక్షుడి ప్రకటన

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి పాకా సత్యనారాయణ ఆదివారం విడుదల చేశారు. అధ్యక్షుడి ఎన్నికతో పాటు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుల కోసం సోమవారం ఉదయం 11గంటల నుంచి నామినేషన్లను స్వీకరించి రెండు గంటలకు అర్హమైనవి ప్రకటిస్తారు. సాయంత్రం 4గంటల లోపు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. జూలై 1న సాయంత్రం నూతన రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటిస్తామని సత్యనారాయణ తెలిపారు. ఓటర్ల జాబితా విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో అందుబాటులో ఉందని, పార్టీ సోషల్ మీడియా గ్రూపుల్లోనూ చూసుకోవచ్చని ఆయన సూచించారు.

వడివడిగా

క్వాంటమ్ బాట

- జనవరి నుంచి వ్యాలీ కార్యకలాపాలు
- అమరావతిలో టెక్ వ్యాలీ పార్కులోనే లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు
- నేడు సీఎం అధ్యక్షతన వర్క్‌షాప్

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ప్రప్రథమంగా రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరి నుంచి మెరుపు వేగంతో కూడిన సాంకేతిక నైపుణ్యం.. క్వాంటమ్ కంప్యూటింగ్ సేవలు అందుబాటులోనికి రానున్నాయి. ఇప్పటిదాకా క్లాసిక్ కంప్యూటింగ్ పేరిట సంప్రదాయ కంప్యూటర్ సిస్టమ్ ప్రోగ్రామింగ్ మొత్తం.. మేథమెటిక్స్ పైనే ఆధారపడి ఉంటోంది. అందువల్ల సమస్యలను పరిష్కరించే మేధస్సు వేగం కొంత మేరకే ఉంటోంది. కానీ వర్తమాన కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంలో మేథమెటిక్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీల కలయికతో కూడిన క్వాంటమ్ కంప్యూటింగ్ కాంతి వేగంతో పోటీ పడుతుంది. లక్షల మందిలో ఒకరిని లక్ష్యంగా చేసుకుని సమాచారం కోరితే క్షణాల్లో అందించే మేధ క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రత్యేక. వచ్చే ఏడాది జనవరి నుంచి లక్షల మంది అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ టెక్ పార్కు నుంచి పనిచేసేందుకు ఆస్కారం ఉంది. ఈ వ్యాలీ రాష్ట్రానికే పరిమితం కాకుండా పలు రాష్ట్రాలూ, ప్రాంతాలు, ప్రభుత్వరంగ సంస్థలు వాడుకునే వీలుంది. ఈ నేపథ్యంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన విజయవాడలో ప్రత్యేక వర్క్‌షాపు జరగనుంది. ఇందులో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను సాంకేతికంగా అభివృద్ధి చేసే సంస్థలు, వినియోగించేవారు, విద్యార్థులు, మేధావులు, ప్రభుత్వ రంగానికి చెందిన వారు పాల్గొంటారు. క్వాంటమ్ వ్యాలీపై డిక్లరేషన్‌ను ప్రకటిస్తారు.



అమరావతి క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాపులో పాల్గొనేందుకు వచ్చిన దిగ్గజ ఐటీ కంపెనీల ప్రతినిధులకు ఇచ్చిన విందులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అనేక రంగాలకు విస్తృతంగా సేవలు

స్టార్టప్‌ల నుంచి భారీ పరిశ్రమల దాకా, వైద్య రంగం నుంచి సేవారంగం వరకూ, వ్యవసాయం నుంచి వాణిజ్యం దాకా.. అన్ని రంగాల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ సేవలు విస్తృతం కానున్నాయి. ఫార్మసీ రంగంలో ఔషధాల నమూనాల కలయికపైనా క్వాంటమ్ కంప్యూటింగ్ స్పష్టమైన సమాధానాలు ఇవ్వగలుగుతుంది. దీనివల్ల ఫార్మా రంగంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ఉపయోగించి రసాయనాల మిశ్రమాలనూ తయారు చేయనున్నారు. జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు ఔషధ తయారీ సంస్థల క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాయి. భారీ ఉత్పత్తి సంస్థలు కూడా మానవ రహిత తయారీని క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ఉపయోగించి చేపడుతున్నాయి. ఒక మనిషి ఆలోచనకూ, లక్ష మంది ఒకేసారి ఆలోచించిస్తే వేగంలో ఎంత తేడా ఉంటుందో .. ప్రస్తుత సంప్రదాయ క్లాసిక్ కంప్యూటింగ్‌కూ, క్వాంటమ్ కంప్యూటింగ్‌కూ అంతే తేడా ఉంటుందనని ఐటీరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జాతీయ స్థాయిలో క్వాంటమ్ మిషన్ లక్ష్యాలు ఏర్పడ్డాయి. దానికి అనుగుణంగా రాష్ట్రంలోనూ మార్గదర్శకాలను రాష్ట్ర ఐటీ శాఖ రూపొందించింది. లాజిస్టిక్, స్పేస్, ఔషధ రంగం, విద్య, వైద్యం, ఆర్థిక, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ కీలకంగా మారింది. 2029 నాటికి ఐబీఎం సంస్థ 'స్టార్లింగ్' పేరిట భారీ క్వాంటమ్ కంప్యూటింగ్ సిస్టమ్‌ను మార్కెట్‌లోకి తీసుకురానుంది. బ్యాంకులు లక్షలాది మంది ఖాతాదారుల ఆర్థిక లావాదేవీలు క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా నిర్వహించనుండగా, ఇతర వాణిజ్య సంస్థలూ తమ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోనున్నాయి. లాజిస్టిక్స్, సప్లయ్‌చైన్, మాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్, రోబోటిక్స్ లాంటి రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ సేవలు ఎంతో అవసరం. కొన్ని సంవత్సరాల పాటు శ్రమించి సాధించాల్సిన ఫలితాలు.. ఈ సాంకేతిక విధానం ద్వారా కొద్ది గంటల్లోనే పూర్తిచేసే వెసులుబాటు కలుగుతుంది. రిస్క్ ఎనాలిసిస్, క్లయిమేట్ చేంజ్, క్రిప్టోగ్రఫీ ఆప్టిమైజేషన్ వంటి వాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ పరిజ్ఞానం ఒక సులువైన సాధనంగా మారుతుంది. భవిష్యత్తులో ఐఐటీలు, వర్సిటీలు, పరిశోధనాల సంస్థలు ప్రస్తుత క్లాసిక్ క్వాంటమ్ కంప్యూటింగ్ సిస్టమ్ వదిలేసి.. క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని మారాల్సిన పరిస్థితి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న తరుణంలో ఇప్పటిదాకా క్లాసిక్ కంప్యూటింగ్ కోర్సులు చేసిన వారు, క్లాసిక్ కంప్యూటింగ్‌పై ఆధారపడ్డవారి భవిష్యత్తుకు ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇస్తుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

ఖరీఫ్‌లో డిజిటల్ పంట సర్వే

- ఎన్ఐసీ సాంకేతిక సహకారంతో జూలై నుంచి నిర్వహణ

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ-పంట నమోదుకు డిజిటల్ పంట సర్వే మార్గదర్శకాలను వ్యవసాయశాఖ జారీ చేసింది. జూలై మొదటి వారంలో ఈ-పంట నమోదు ప్రారంభం కానుంది. కచ్చితత్వం, పారదర్శకత కోసం జాతీయ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) సాంకేతిక మద్దతుతో పూర్తి స్థాయిలో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించనున్నారు. సాగుకు అనువు కాని భూములు, ప్రభుత్వ భూముల్ని పక్కన పెట్టేసి, కేవలం సాగు భూములను మాత్రమే ఎన్ఐసీ డిజిటల్ క్రాప్ సర్వేకు అనుసంధానం చేసిందని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదివారం తెలిపారు. భూ హక్కుల ఆధారంగా 100% పంటల నమోదుతో డేటా సేకరించి, రైతుల ఈ-కేవైసీ పూర్తి చేసి, ఆధార్ అనుసంధాన మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేయనున్నారు. అరటి, కొబ్బరి, మామిడి వంటి బహువార్షిక ఉద్యాన పంటలను జియో ఫెన్సింగ్‌తో ఫీల్డ్ సర్వే చేసి, ఫొటోలతో డేటా నమోదు చేయనున్నారు. పొలం గట్లపై ఉన్న చెట్లు, మొక్కలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ పంటల అవసరాలకు యూరియా కొరత లేదని ఢిల్లీరావు తెలిపారు. ప్రస్తుతం 3.20 లక్షల టన్నుల యూరియా డీలర్లు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ వద్ద నిల్వ ఉందన్నారు.

పెదపరిమి పరిసరాల్లో విమానాశ్రయం!

విజయవాడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని పెదపరిమి చుట్టుపక్కల ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు అంశం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అమరావతికి దక్షిణ దిక్కున దీనిని నిర్మించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. కొండలు, నీటి ప్రవాహాలు లేకపోవడంతో ఈ ప్రాంతంపై దృష్టి సారించినట్లు సమాచారం. సీఆర్‌డీఏ అమరావతి జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం చూసినా.. విమానాశ్రయం వంటి వాటికి ఉండవల్లి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపరిమి పరిసరాలు అనువుగా ఉంటాయని చెబుతున్నారు. రాజధానిని మరింతగా విస్తరించేందుకు సీఆర్‌డీఏ రెండోదశ భూ సమీకరణ చేపట్టనున్న ప్రాంతాల్లోనే అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకానుంది. అమరావతి విమానాశ్రయానికి సంబంధించి టెక్నికల్ ఫీజిబిలిటీ నివేదిక కోసం ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీ ఏడీసీఎల్) గతంలోనే ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) పిలిచింది. అయితే కన్సల్టెన్సీ సంస్థ ఇచ్చిన నివేదికపై సీఆర్‌డీఏ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ ఏడీసీఎల్ కూడా ఇదే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. దీంతో ఈ రంగంలో నైపుణ్యం కలిగిన సంస్థలకు సాంకేతిక నివేదిక రూపకల్పన బాధ్యతను అప్పగించారు. ఈ నివేదిక వస్తే ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్నదానిపై మరింత స్పష్టత వస్తుంది. అమరావతి- గుంటూరు మధ్య విమానాశ్రయం ఏర్పాటయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

నిజామాబాద్‌లో పసుపు బోర్డును ప్రారంభించిన షా

నిజామాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలోని నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన కిసాన్ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు బోర్డు ఏర్పాటుతో నిజామాబాద్ రైతుల 40 ఏళ్ల చేసిన పోరాటం ఫలించిందని, వారి కల నెరవేరిందని పేర్కొన్నారు. ఇకపై ఇక్కడి రైతులు పండించే పసుపు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతుందన్నారు. ఇందుకోసం మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్ వ్యవస్థలను ఏర్పాటు చేసి పసుపును ఎగుమతి చేస్తామన్నారు. నక్సలైట్లు తక్షణమే హింసను వీడి లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. ఆయుధాలు వదిలేసేంత వరకూ వారితో చర్చలు ఉండబోవని, లొంగిపోతే పునరావాసం కల్పిస్తామన్నారు. 2026 మార్చిలోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు డి.శ్రీనివాస్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించారు.

ఆ గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలి: తుమ్మల

హైదరాబాద్/ఖమ్మం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రలో కలిపిన భద్రాచలం చుట్టుపక్కల ఉన్న యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఆ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నిజామాబాద్‌లో ఆయనకు లేఖ అందించారు. భద్రాచలం పట్టణం తెలంగాణలో కొనసాగుతుండగా, ఆ 4 గ్రామ పంచాయతీలు, 17 రెవెన్యూ గ్రామాలను ఏపీలో కలపటంతో పాలన, అభివృద్ధికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.

ఎంపీఎస్ హెచ్ఎం జాబ్‌చార్ట్ విడుదల చేయాలి

అమరావతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయుల జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. పాలనాపరమైన విధులు ఉన్నందున బోధనను ఐచ్ఛికం చేయాలన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో టీచర్ల కొరత లేకుండా చూడాలని కోరారు.

వేగంగా మ్యుటేషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

తిరిగినా మ్యుటేషన్ జరగక ఇబ్బందులు పడేవారు. కొన్ని సందర్భాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయిన ఆస్తిపై వివాదాలు తలెత్తడంతో మ్యుటేషన్ జరిగేదికాదు. 2018లో నాటి సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆటోమ్యుటేషన్, రెవెన్యూ సంస్కరణల ఫలితంగా ఇప్పుడు రిజిస్ట్రేషన్లతో పాటే మ్యుటేషన్లు కూడా క్షణాల్లో జరిగిపోతున్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే ఆటోమేటిగ్గా వెబ్‌ల్యాండ్‌లో యాజమాన్య హక్కుల బదలాయింపు కూడా పూర్తవుతోంది. జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ఆటోమ్యుటేషన్‌ను కాగితాలకే పరిమితం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, జిరాక్స్ రిజిస్ట్రేషన్లు, గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లంటూ ప్రజలను హడలెత్తించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది. 99శాతానికి పైగా డాక్యుమెంట్లలో రిజిస్ట్రేషన్ పూర్తయిన సమయంలోనే ఆటోమ్యుటేషన్ కూడా జరిగిపోతోంది. ఈ విధానం రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసింది.

ఆటోమ్యుటేషన్‌తో క్షణాల్లో బదిలీ

గతంలో మ్యుటేషన్ చేయాలంటే భూమి హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టం, దానిలోని నియమాలు, పరిమితులకు లోబడి తహసీల్దారు వ్యవహరించేవారు. మ్యుటేషన్ జరగాలంటే మీసేవ, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని తాశీల్దారు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం 18 రోజులు పట్టేది.ఇప్పుడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తవగానే ఆటోమ్యుటేషన్ విధానంలో వెబ్‌ల్యాండ్‌లో కూడా బదిలీ జరిగిపోతుంది.

ఇకపై మున్సిపాలిటీల్లోనూ అమలు

వ్యవసాయ భూములు ఆటోమ్యుటేషన్ చేయడంలో మంచి ఫలితాలు రావడంతో ఇదే విధానాన్ని మున్సిపాలిటీల్లో కూడా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం పట్టణాలు, నగరాల్లో రిజిస్ట్రేషన్లు జరిగిన వెంటనే కొనుగోలుదారుల పేరుతో ఆస్తి పన్ను వివరాల మార్పు (ఆటోమ్యుటేషన్) జరిగే విధానాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, స్పందనను పరిగణనలోకి తీసుకుని మార్పుచేర్పులతో మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీ పరిధుల్లో క్రమంగా విస్తరించాలని భావిస్తున్నారు. విజయవాడ పరిధిలో అసెస్‌మెంట్ నంబర్లపై ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు జరిగే ఆస్తుల క్రయవిక్రయాలకు మాత్రమే ఆటోమ్యుటేషన్ విధానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. అసెస్‌మెంట్ నంబరు కలిగిన పూర్తి ఆస్తి అమ్మకం జరిగితేనే ఈ విధానం వర్తిస్తుంది. కొత్త ప్లాట్ల కొనుగోలుకు కూడా నూతన విధానాన్ని అమలు చేస్తారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆ వివరాలు సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తారు.

స్లాట్ బుకింగ్‌తో గంటల తరబడి నిరీక్షణకు తెర

సాధారణంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు జనాలతో కిటకిటలాడుతుంటాయి. ఏ సమయంలో పిలుస్తారో తెలియక ఉదయం నుంచి అక్కడే గంటల తరబడి ఎదురుచూసేవారు. కొనుగోలుదారు చలానా కట్టి, డాక్యుమెంట్లు రాయించడానికి కనీసం 3గంటల సమయం పట్టేది. అందరూ కార్యాలయంలో గుమికూడి ఉండటంతో అధికారులు, సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు. సేవల కోసం వచ్చినవారిని ఎక్కువ సేపు నిరీక్షించకుండా త్వరగా పంపేయాలని గతంలో ప్రభుత్వం ఎన్నో ప్రయోగాలు చేసినా ఫలితం దక్కలేదు. ఇప్పుడు ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానంతో ఈ నిరీక్షణకు తెరపడింది. పెద్ద కార్యాలయాల్లో ఒక్కోచోట రోజుకి 70 నుంచి 80 స్లాట్లు ఇస్తున్నారు. ఈ విధానంలో అధికారులు సూచించిన సమయానికి 15 నిమిషాల ముందు కార్యాలయానికి చేరుకుంటున్నారు. వారికిచ్చిన సమయానికి 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తవుతోంది. అదే సమయంలో మ్యుటేషన్ కూడా జరిగిపోతోంది. రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా అదే రోజు ఇచ్చేస్తుండటంతో వచ్చిన వారు గంటలోపే పని పూర్తిచేసుకొని వెళ్లిపోతున్నారు.

ఆటోమ్యుటేషన్ రేటు 99%

రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయిన 99శాతం డాక్యుమెంట్లకు అదే క్షణంలో ఆటోమ్యుటేషన్ జరిగిపోతోంది. గతంలో రిజిస్ట్రేషన్ పూర్తయిన మూడు నుంచి నాలుగు రోజుల తర్వాత కొనుగోలుదారులకు డాక్యుమెంట్లు ఇచ్చేవారు. ఇప్పుడు 89 శాతం రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లను అదే రోజున, మిగిలిన వాటిని మరుసటి రోజున అందజేస్తున్నారు. కర్నూలులో ఆటోమ్యుటేషన్ రేటు 99.65 శాతం, కడపలో 99.66 శాతం, ఒంగోలు 99.51 శాతం, నెల్లూరులో 99.3 శాతం, రాజమండ్రిలో 99.51 శాతం, గుంటూరులో 99.71 శాతం, బాపట్లలో 99.41 శాతం ఉంది. అన్ని కార్యాలయాల్లో కలిపి సగటు ఆటోమ్యుటేషన్ రేటు 99 శాతం ఉంది.

'పర్మిట్'తో ఆదాయం

పెంచుదాం!



(మొదటి పేజీ తరువాయి)

షాపులకు రూ.7.5 లక్షలు, మిగిలిన షాపులకు రూ.5 లక్షల చొప్పున ఫీజులుగా ప్రతిపాదించారు. రాష్ట్రంలో 3,736 మద్యం షాపులు ఉన్నాయి. వాటికి రూ.5లక్షల చొప్పున పర్మిట్ రూమ్ ఫీజుల రూపంలో రూ.186 కోట్లు వస్తుంది. కార్పొరేషన్లలోని షాపులకు రూ.2.5లక్షలు అదనం కాబట్టి మొత్తంగా పర్మిట్ రూమ్‌ల ఆదాయం రూ.200 కోట్లు దాటుతుంది. ఆగస్టు వరకు బార్ పాలసీకి గడువు ఉన్నందున, కొత్త బార్ పాలసీతోపాటు పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇచ్చి, ఆదాయాన్ని భర్తీ చేసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

ఇప్పటికే ఏడాది నష్టం

వాస్తవానికి పర్మిట్ రూమ్‌ల ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ రావాలి. కానీ కేబినెట్ సబ్‌కమిటీ సిఫారసు, ఎక్సైజ్ శాఖ అనాలోచిత నిర్ణయం కారణంగా గతేడాది ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తే షాపులే బార్లుగా మారిపోతాయని అప్పట్లో కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది. గతంలోనూ ఈ విధానం ఉన్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు కూడా సబ్ కమిటీ అభిప్రాయాన్నే అమలు చేశారు. దీంతో ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోయింది.

పెరుగుతున్న అమ్మకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావడంతో మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు ఈ ఏడాది ఏప్రిల్‌లో భారీగా అమ్మకాలు నమోదయ్యాయి. మద్యం విలువలో 11.29 శాతం వృద్ధి రేటు నమోదైంది. పరిమాణం రూపంలో చూస్తే లిక్కర్‌లో 26.09శాతం, బీరులో ఏకంగా 149.14శాతం వృద్ధి కనిపించింది. 2024 ఏప్రిల్‌లో 8.85లక్షల కేసుల బీరు అమ్మితే, ఈ ఏడాది ఏకంగా 22.06లక్షల కేసుల బీరు అమ్ముడైంది. లిక్కర్ గతేడాది ఏప్రిల్‌లో 26.23లక్షల కేసులు అమ్మితే, ఈ ఏడాది ఏప్రిల్‌లో 33.07లక్షలు కేసులు అమ్మారు. కాగా కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించడంతో అమ్మకాలు పెరిగినా రాబడి ఆ స్థాయిలో కనిపించట్లేదు. మరోవైపు అమ్మకాలు భారీగానే ఉన్నా టార్గెట్ల పేరుతో జిల్లాల అధికారులపై ఉన్నతాధికారులు ఇంకా ఒత్తిడి చేస్తున్నారు. అమ్మకాలు తగ్గితే జిల్లాల అధికారులదే బాధ్యత అని హెచ్చరికలు చేస్తున్నారు.

బార్ పాలసీతోనూ రాబడి

ఈ ఏడాది సెప్టెంబరు నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి రానుంది. రాష్ట్రంలో 870 బార్లు ఉన్నాయి. వాటిలో 44 ఖాళీగా ఉండిపోయాయి. త్వరలోనే మొత్తం 870 బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీచేయనుంది. తద్వారా దరఖాస్తు ఫీజుల రూపంలో ఆదాయం సమకూరుతుంది. 2022లో తెచ్చిన బార్ పాలసీ సమయంలో దరఖాస్తు ఫీజులు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు మూడు కేటగిరీలుగా పెట్టారు. ఈసారి లైసెన్స్ ఫీజులు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. లైసెన్స్ ఫీజులు తగ్గితే దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరుతుంది. మొత్తంగా గతేడాది దరఖాస్తు ఫీజులతో వచ్చిన రూ.1900 కోట్ల ఆదాయాన్ని వివిధ మార్గాల్లో రాబట్టేందుకు ఎక్సైజ్ శాఖ ప్రయత్నిస్తోంది.

స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో

పూర్ణచందర్ అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): న్యూస్ యాంకర్ స్వేచ్ఛ బలవన్మరణం ఘటనలో ఆరోపణలెదుర్కొంటున్న పూర్ణచందర్ నాయక్ గురించి సంచలన విషయాలు వెలుగులోకొస్తున్నాయి. పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి.. ఒత్తిడి చేసి మరీ భర్త నుంచి ఆమె విడాకులు తీసుకునేలా చేసిన పూర్ణచందర్, తర్వాత ఆమె పెళ్లి ప్రస్తావన తెచ్చిన ప్రతిసారి ఏదో ఒకటి చెప్పి దాటవేసేవాడని తేలింది. ఇటీవల పెళ్లి చేసుకునేది లేదని.. తనకు రాజకీయంగా అండదండలున్నాయని, తననేమీ చేయలేవంటూ స్వేచ్ఛను బెదిరించినట్లు సమాచారం. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని విచారణలో తేలిందని ఏసీపీ రమేశ్ కుమార్ చెప్పారు. శనివారం రాత్రి పూర్ణచందర్‌ను అదుపులోకి తీసుకున్న చిక్కడపల్లి పోలీసులు అతణ్ని అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. పూర్ణచందర్ 15ఏళ్లుగా స్వేచ్ఛతో కలిసి ఉంటున్నట్లు విచారణలో తేలింది.

మీ ఏడుపులే మాకు దీవెనలు!

- ఈసెట్ కౌన్సెలింగ్‌పై.. జగన్‌కు మంత్రి లోకేశ్ కౌంటర్

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీఈసెట్ కౌన్సెలింగ్‌ను జాప్యంచేస్తున్నారన్న మాజీ సీఎం జగన్‌కు విద్యామంత్రి లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. జగన్ ఆదివారం 'ఎక్స్'లో పెట్టిన పోస్టుపై ఎక్స్ వేదికగానే స్పందించారు. 'మీ ఏడుపులే మాకు దీవెనలు. మీరు ఐదేళ్లలో విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిపోయారు. నేను ఏడాదిలోనే అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రభుత్వ విద్యావ్యవస్థను గాడిన పెట్టడం చూసి.. మీకు కడుపు మంట రావడం సహజం. మీ హయాంలో ఎప్పుడు కౌన్సెలింగ్ పెట్టారో కూడా మీకు స్పృహ లేదు. 2022లో సెప్టెంబరులో, 2023లో జూలై చివరికి కౌన్సెలింగ్ పూర్తిచేసిన మీరు.. మమ్మల్ని విమర్శించటం మీ అజ్ఞానానికి నిదర్శనం' అని పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే గత ఏడాది జూలై మూడో వారంలో కౌన్సెలింగ్ పూర్తిచేశామని, ఈ సంవత్సరం కూడా జూలై మూడో వారానికే మొదటి విడత కౌన్సెలింగ్‌ను పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. 2020 నుంచి కౌన్సెలింగ్ జరిగిన తేదీల టేబుల్‌ను కూడా లోకేశ్ పోస్టు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.